

నర్సీపట్నం మండలం ధర్మసాగరం గ్రామంలో రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

విశాఖపట్నం




16

శనివారం 6 జనవరి 2018

జిల్లాకు బాబు వరాలు

నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణకు రూ.160 కోట్లు



- పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాల... జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్
- నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాలిటీల శివారు ప్రాంతాల అభివృద్ధికి నిధులు
- వెయ్యి ఎకరాలు అందుబాటులో ఉంటే నర్సీపట్నంలో ఎస్ఈజడ్
- తుని-నర్సీపట్నం రైల్వే లైన్, మల్కన్‌గిరి-సబ్బవరం జాతీయ రహదారి కోసం కేంద్రంపై ఒత్తిడి
- ధర్మసారం జన్మభూమి సభలో ముఖ్యమంత్రి ప్రకటన
- రచ్చబండ కార్యక్రమంలో ప్రజలతో ముఖాముఖి
- విద్యావికాసంపై అనర్గళంగా ప్రసంగించిన టెన్త్ విద్యార్థిని సబ్బవరపు పద్మ
- పుష్పగుచ్ఛమిచ్చి అభినందించిన చంద్రబాబు
- పలు స్టాళ్ల సందర్శన
- లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల పంపిణీ
- చంద్రబాబుకు ఘన స్వాగతం... సన్మానాల వెల్లువ
- అపరభగీరథుడని కొనియాడిన మంత్రి అయ్యన్నపాత్రుడు
- మీ మాటలే మాకు స్ఫూర్తి: అయ్యన్న సతీమణి పద్మావతి

... వివరాలు 6,8,9 పేజీల్లో



సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, హాజరైన ప్రజలు



నర్సీపట్నం మండలం ధర్మసాగరం గ్రామంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

భవిష్యత్తులో ప్రతిరోజూ సంక్రాంతే

- రూ.50 వేల కోట్లతో కొత్తగా 19 లక్షల గృహాలు
- రాష్ట్రంలో ఇంటింటికీ ఫైబర్ గ్రిడ్ సేవలు... దేశంలోనే ప్రప్రథమం
- చంద్రన్న బీమాకు రూ.265 కోట్లు కేటాయింపు
- మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించవచ్చు
- అందరి సహకారంతో సుపరిపాలన
- ధర్మసాగరం రాష్ట్రానికి ఆదర్శం
- సీఎం చంద్రబాబునాయుడు

... మెయిన్‌లో

ఖాకీ మార్కు బిజినెస్!



- పదవీ విరమణకు కాస్త ముందు విశాఖ జిల్లాలో ఏసీబీకి దొరికిన ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్
- ఇప్పుడు రౌడీలతో చెట్టపట్టాల్
- గ్రూపులన్నింటినీ ఒక తాటిపైకి తెచ్చి డాన్‌లా వ్యవహరించాలని ప్లాన్

... వివరాలు 11వ పేజీలో

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ABN

ముత్యాల ముగ్గుల పోటీ రేపు



- ఈ నెల 7న జిల్లాలో రెండుచోట్ల నిర్వహణ
- అనకాపల్లి ఎన్‌టీఆర్ స్టేడియంలో...
- సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 9985411656

3

అన్నదాత వర్రి

- ప్రభుత్వ ధరకే అడుగుతున్న వ్యాపారులు
- దీర్ఘకాలిక రకాలకు గిట్టుబాటు కాదంటున్న రైతులు
- కల్లాల్లోనే ధాన్యం నిల్వ

ధాన్యం మద్దతు ధరపై పెదవి విరుపు

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేవారు లేక అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతునారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర స్వల్పకాలిక రకాలకు గిట్టుబాటు అవుతుంది తప్ప, ఆర్‌జీఎల్ వంటి దీర్ఘకాలిక రకాలకు గిట్టుబాటు కాదని రైతులు అంటున్నారు. ప్రైవేటు వ్యాపారులు కూడా ప్రభుత్వం ప్రకటించిన ధరకే అడుగుతున్నారని, దీంతో ఏం చేయాలో పాలు పోవడం లేదని వాపోతున్నారు. పంట బాగా పండిందని ఆనందించాలో, గిట్టుబాటు ధర లేదని బాధపడాలో అర్థం కావడం లేదంటున్నారు.



... వివరాలు 7వ పేజీలో

ఇంటర్వ్యూ

భయం వీడితేనే జయం

- గ్రూప్స్ సాధనకు ఇష్టంతో కష్టపడాలి
- పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలి
- ప్రతి విషయంపైనా అవగాహన పెంచుకోవాలి
- అన్ని పాఠ్యాంశాలనూ విశ్లేషించాలి
- గ్రూప్స్ శిక్షకులు, అటవీ రేంజి అధికారి రాంనరేష్



చోడవరం, జనవరి 5: 'సివిల్స్, గ్రూప్స్ పరీక్షలు గతంలో కంటే కఠినంగా ఉంటున్నాయి. ఈ పరీక్షలకు సన్నద్ధమవుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులు మందలో కాకుండా మందిలో ఒకరుగా ఉండాలన్న లక్ష్యంతో ముందుకు సాగాలి. భయాన్ని వదిలేసి ఇష్టంతో కష్టపడాలి. అప్పుడే విజయం సాధించగలరు' అని చెబుతున్నారు గ్రూప్స్ శిక్షకులు, అటవీ రేంజి అదికారి బిర్లంగి రాంనరేష్. ప్రభుత్వ అధికారిగా ఉద్యోగం చేస్తూనే, మరోవైపు గ్రామీణ నిరుద్యోగులకు గ్రూప్స్ ఉద్యోగాల కోసం శిక్షణ, అవరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రూప్ పరీక్షల తీరుతెన్నులు... లక్ష్య సాధనకు అనుసరించాల్సిన విధానాలు... తదితర అంశాలపై 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: గ్రూప్ పరీక్షలపై ఆసక్తి ఎలా కలిగింది?

జ: శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చిన నాకు గ్రూప్స్ పరీక్షలపై చిన్నతనం నుంచీ ఆసక్తి. మరీ గంటలకు గంటలు కష్టపడిపోకుండానే ఆడుతూ పాడుతూ నాకు నచ్చిన సమయంలో చదువుకుంటూ పరీక్షలకు సిద్ధమయాను.

ప్రశ్న: గ్రూప్స్ పరీక్షలకు కోచింగ్ అవసరమా?

జ: సరైన గైడెన్స్ కోసం శిక్షణ అవసరమే. అలాగని తప్పనిసరి కాదు. ఎలాంటి కోచింగ్ లేకుండానే పరీక్షరాసి ఉత్తీర్ణులైన వారు ఉన్నారు. కోచింగ్ సెంటర్లలో అనుభజ్ఞుల బోధన, స్టడీ మెటీరియల్, సహచర విద్యార్థులతో కలిసి సాధన వల్ల ఉత్తేజం వస్తుంది. శిక్షణ తీసుకునే సామర్థ్యం లేని గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రణాళికబద్ధంగా సన్నద్ధత కలిగి ఉంటే విజయం సాధించే అవకాశం ఉంటుంది.

ప్రశ్న: గ్రామీణ అభ్యర్థులు ఎలా సన్నద్ధం కావాలి?

జ: గైడులు కాకుండా ప్రధాన పుస్తకాలు చదవాలి. ప్రతి విషయంపైనా విశ్లేషణ, అవగాహన, భాషపై పట్టు అవసరం. మౌకిక పరీక్షలో నెగ్గడానికి భయాన్ని విడచిపెట్టాలి.

ప్రశ్న: మారుతున్న ప్రశ్నల ధోరణికి ఎలా సిద్ధమవ్వాలి?

జ: బట్టీ పద్ధతిని విడిచిపెట్టి సబ్జెక్టుపై లోతైన అవగాహన పెంచుకోవాలి. విశ్లేషణకు పదును పెట్టాలి. సూక్ష్మ పరిశీలన ఉండాలి. సమకాలీన అంశాలపై పట్టు అవసరం.

ప్రశ్న: రుణాత్మక మార్కుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

జ: ఏపీపీఎస్సీ ఇటీవల రుణాత్మక మార్కులు ప్రవేశపెట్టింది. వీలైనంత వరకూ పూర్తిగా తెలియని, అవగాహన లేని ప్రశ్నల జోలికి వెళ్లకపోవడమే మంచిది. అలాగని ఎక్కువ ప్రశ్నలు కష్టంగా ఉన్నపుడు సమాధానం ఫిఫ్టీ ఫిఫ్టీగా ఉంటే రాయడానికి ప్రయత్నించాలి.

ప్రశ్న: పరీక్షలకు ఎప్పటి నుంచి... ఎలా... ఎన్ని గంటలు చదవాలి?

జ: చాలామంది విద్యార్థి దశ నుంచే గ్రూప్స్ సాధించాలని చదువుతున్నారు. ఇది ప్రణాళికాబద్ధంగా లేకపోవడం వల్ల వారు చదివే కోర్సులలో పట్టు రాక, ఇటు సివిల్స్, గ్రూప్స్‌లపై అవగాహన పెరగక రెంటికీ చెడ్డ రేవడిలా తయారవుతున్నారు. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న విద్యార్థులు కోర్సు సబ్జెక్టులతో పాటు జనరల్ స్టడీస్, సమకాలీన అంశాలు తెలుసుకోవాలి. రోజుకు కనీసం 8 నుంచి 10 గంటల పాటు చదవాలి. సిలబస్‌ను మూన్నాలుగు సార్లు చదవి అవగాహన చేసుకోవాలి. కొంత మార్కెట్ నుంచి, మరి కొంత సొంతంగా స్టడీ మెటీరియల్ రూపొందించుకోవాలి. నిర్ణీత సమయంలో ఎక్కువ మోడల్ ప్రశ్నలను సాధన చేస్తే ఫలితం ఉంటుంది. లెక్చరర్లు, స్నేహితుల వద్ద సందేహాలను నివృత్తి చేసుకోవాలి. వివిధ పోటీ పరీక్షలలో విజయం సాధించిన వారిని, పోటీలో కొద్ది తేడాలో ఓడిపోయిన వారిని కలిసి వారి అనుశబాలు తెలుసుకోవాలి. ఇలా కట్టుదిట్టమైన ప్రణాళికలతో చదివితే విజయం తథ్యం.

- ఊరి ప్రగతికి నడుం బిగించిన యువకులు
- 15 మంది సంఘంగా వినూత్న కార్యక్రమాలు
- రక్తదాన శిబిరాలతో 250 యూనిట్ల రక్తం సేకరణ
- పేద విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ
- ప్రత్యేక వైద్య శిబిరాలతో ప్రజలకు ఆరోగ్య సేవలు
- పాల్తేరు యంగ్ డైనమిక్ బాయిస్ అసోసియేషన్ ఘనత

సేవల్లో డైనమిక్స్



ఉన్నత పాఠశాలలో యువకులు ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహం

ఏ స్థాయిలో ఉన్నా తల్లిదండ్రులు... సొంతూరును మరచిపోకూడదంటారు పెద్దలు. అయితే, దీన్ని ఆచరణలో చూపేవారు అరుదుగా ఉంటారు. ఒక హోదా అనుభవిస్తున్న... రెండు చేతులా సంపాదిస్తున్న... ఉన్నత స్థితిలో ఉన్న... ఎంతో మంది ప్రస్తుతం ఊరును మరిచిపోతున్నారు. ఇలాంటి రోజుల్లోనూ ఎటువంటి సంపాదనా లేని కొంత మంది యువకులు ఊరి సేవలో పునీతులయ్యారు. ఓ సంఘంగా ఏర్పడి తొమ్మిదేళ్లుగా ఎన్నో మంచి కార్యక్రమాలు చేపడుతూ అందరితోనూ శభాష్ అనిపించుకున్నారు. వారే పాయకరావుపేట మండలంలోని పాల్తేరు గ్రామ యువకులు. ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న వారి సేవలపై ఈ వారం 'యువ' పాఠకుల కోసం ప్రత్యేక కథనం...

పాల్తేరు (పాయకరావుపేట), జనవరి 5: తాము పుట్టిన ఊరికి ఎంతో కొంత సేవ చేయాలని పాల్తేరు యువకులు నిర్ణయించుకున్నారు. విభిన్న రంగాల్లో ఉన్న 15 మంది ఓ సంఘంగా ఏర్పడ్డారు. యంగ్ డైనమిక్ బాయిస్ అసోసియేషన్ పేరుతో 2009లో ఓ సంస్థను రిజిస్ట్రేషన్ చేయించారు. స్వచ్ఛందంగా చేయాల్సినదంతా చేస్తున్నారు. అవసరమైతే దాతలను కలిసి నిధులు సమీకరించుకుంటున్నారు. వివేకానందుడి స్ఫూర్తిగా గ్రామానికి, స్థానిక ప్రజలకు, పేద విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అందిస్తున్నారు.

యువకుల సేవల్లో కొన్ని...

- పాల్తేరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విజ్ఞానం అందించాలన్న లక్ష్యంతో మండల పరిషత్ పాఠశాల తరగతి గదిలో 2013లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. కథల పుస్తకాలు, వార్తా పత్రికలు అందుబాటులో ఉంచుతున్నారు.
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విద్యార్థులకు నవోదయ, ఎన్ఎంఎస్ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు.
- గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త దేవవరపు రాజబాబు ఆర్థిక సాయంతో పాఠశాలలో 20 మంది విద్యార్థులను దత్తత తీసుకున్నారు. వారికి కావాల్సిన నోటు పుస్తకాలు, బ్యాగులు అందజేస్తున్నారు.
- గ్రామంలో ఇప్పటి వరకు ఐదు సార్లు ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించారు. ఏటా వివేకానందుడి జయంతి రోజున రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. సుమారు 250 యూనిట్లు అందుబాటులో ఉంచారు.
- విద్యార్థినులకు కోలాటంలో శిక్షణ ఇప్పిస్తున్నారు. శిక్షణ పూర్తిచేసిన వారితో బృందాలుగా ఏర్పాటు చేసి ప్రభుత్వ, ఆధ్యాత్మిక కార్యక్రమాలల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేయిస్తున్నారు.
- 16 మంది సభ్యుల్లో సహచరులు రెడ్నం దొరబాబు 2013లో ఆకస్మిక మృతి చెందారు. అతడి జ్ఞాపకార్థం గ్రామాన్ని గ్రీన్ విలేజ్‌గా అభివృద్ధి చేసేందుకు సభ్యులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణకు ఏటా మొక్కలు నాటుతున్నారు. అవి పెరిగి పెద్దవి అయ్యేంతవరకూ రక్షణ చర్యలు చేపడుతున్నారు.
- నాలుగేళ్లుగా గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వేడుకగా నిర్వహిస్తున్నారు.

యువ

గ్రామస్థుల సహకారంతోనే...



గ్రామస్థుల సహాయ సహకారాలతో సేవా కార్యక్రమాలు చేపడు తున్నాం. పర్యావరణ పరిరక్షణకు గ్రామంలో ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపడతాం. తమ సామాజిక కార్యక్రమాలకు ప్రభుత్వం కూడా సహకారం అందిస్తే మరింత మందికి ఉపయోగపడతాం.

-మోకిన రమణ, సంస్థ కార్యదర్శి

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు కృషి



నేను మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ కోర్సు పూర్తి చేశాను. గ్రామంలో సహచర యువకులతో సేవా కార్యక్రమాల్లో పాలు పంచుంటున్నాను. అలాగే నా కోర్సులో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెడుతున్నాను. ఇందులో భాగంగా విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాల పెంపునకు, సత్ప్రవర్తనకు కృషి చేస్తాను.

-కొమ్మిరెడ్డి నాగేశ్వరరావు, సభ్యుడు



పాఠశాలకు సమకూర్చిన గ్రంథాలయం



రక్తదానం చేస్తున్న యువకులు



వైద్య శిబిరంలో గ్రామ ప్రజలకు ఆరోగ్య సేవలు

నేడు సీలేరులో జెన్‌కో డైరెక్టర్ పర్యటన

ఎత్తిపోతల పథకం సాధ్యాసాధ్యాలపై నిపుణుల బృందం పరిశీలన

సీలేరు, జనవరి 5: సీలేరు కాంప్లెక్సు పరిధిలో ఏపీ జెన్‌కో హైడల్ డైరెక్టర్ నాగేశ్వరరావు శనివారం పర్యటించనున్నారు. సీలేరుకు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు మళ్లింపుతో పాటు భూ గర్భంలోనే మరో జల విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను ఆయన అధ్యనం చేస్తారని సమాచారం. హైడల్ డైరెక్టర్ పాటు జల విద్యుత్ రంగంలో అనుభవజ్ఞులైన మాజీ డైరెక్టర్ ఆదిశేషు, విద్యుత్ సౌదాకు చెందిన ఇంజనీరింగ్ బృందం కూడా ప్రాజెక్టులను పరిశీలించనున్నారు. ఎత్తిపోతల పథకం విజవంతమైతే సీలేరు కాంప్లెకు పరిధిలో మరో 900 మెగావాట్ల విద్యుదుత్పత్తి పెరిగి రాష్ట్రంలో విద్యుత్ కొరత తీరుతుందని జెన్‌కో ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు.

మన్యాన్ని వణికిస్తున్న చలి

స్థిరంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు

లంబసింగిలో 4... చింతపల్లిలో 5 డిగ్రీలు

చింతపల్లి జనవరి 1: మన్యం ప్రజల వెన్నులో చలి పుడుతోంది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతలగాలుల ప్రభావం ఒక్కసారిగా పెరగడంతో మిట్ట మధ్యాహ్నం కూడా గిరిజనులు గజగజలాడుతున్నారు. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదవుతున్నాయి. శుక్రవారం లంబసింగిలో 4, చింతపల్లిలో 5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంచు తగ్గినప్పటికీ చలి తీవ్రత అధికంగాఉంది. శీతల గాలుల కారణంగా ఉదయం కాఫీతోటలకు వెళ్లే గిరిజనులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళలో నిద్రపట్టక సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీంతో గ్రామాల్లో నిత్యం చలి మంటలు రగులుతూ కనిపిస్తున్నాయి. అలాగే ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించే వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇదిలా ఉండగా, లంబసింగిని సందర్శించిన పర్యాటకులు చలిలో ఎంజాయ్ చేస్తున్నారు.



లంబసింగిలో సందడి చేస్తున్న పర్యాటకులు


ముత్యాల ముగ్గుల పోటీ రేపు

- ఈ నెల 7న జిల్లాలోరెండుచోట్ల నిర్వహణ
- ప్రతి కేంద్రంలోనూ ముగ్గురికి బహుమతులు

విశాఖపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక, 'ఏబీఎన్' ఛానల్ ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నాయి. టాటా జెమినీ, సీఎంఆర్ షాపింగ్‌మాల్, గోల్డ్‌డ్రాప్ ఆయిల్, డిజిసెల్, అమృతబిందు సహకారంతో ఈనెల ఏడవ తేదీన నగరంలోని సీతమ్మధార టీపీటీ కాలనీలో గల శ్రీప్రకాష్ విద్యానికేతన్ ఆవరణతోపాటు, అనకాపల్లిలోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఆదివారం ఉదయం 9.30 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి.

ముగ్గురు విజేతలకు బహుమతులు

ప్రతి కేంద్రంలో జరిగే పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందించనున్నారు. మొదటి బహుమతిగా రూ.5 వేలు, రెండో బహుమతిగా రూ.3 వేలు, మూడో బహుమతిగా రూ.2 వేలు అందించనున్నారు. జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన మహిళకు రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనే అవకాశం లభిస్తుంది.



ఇవీ నిబంధనలు

- పోటీల్లో మహిళలు మాత్రమే పాల్గొనాలి.
- చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి.
- ముగ్గు, రంగులు వగైరా సామగ్రిని పోటీదారులే తెచ్చుకోవాలి.
- ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు మాత్రమే.

మరింత సమాచారానికి..

నగరంలోని శ్రీప్రకాష్ స్కూల్ ఆవరణలో నిర్వహించే పోటీలో పాల్గొనదలచిన వారు 9985411639, 0891-2549123 నంబర్‌లకు, అనకాపల్లి ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహించే పోటీల్లో పాల్గొనాలనుకునే మహిళలు 9985411656 నంబర్‌కు సంప్రతించవచ్చు.

వైద్యాలయంలో మరో అత్యాధునిక సౌకర్యం

- ఏ సమయంలోనైనా కఫం నిర్ధారణ
- రోగులు ఇక విశాఖ వెళ్లే కష్టాలకు చెక్
- రూ.కోటి వెచ్చించి సీబీ ఎన్‌ఏఏటీ పరికరాన్ని అందించిన ప్రభుత్వం

అనకాపల్లి టౌన్, జనవరి 5 : ఎన్టీఆర్ వైద్యాలయానికి సుమారు రూ.కోటి విలువైన అధునాతన పరికరాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలో ఎక్కడా అందుబాటులో లేని విధంగా డెంగ్యూ వ్యాధి నిర్ధారణ పరికరం ఇప్పటికే అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు కఫం పరీక్షను ఏ సమయంలోనైనా చేసే అత్యాధునిక సీబీ ఎన్‌ఏఏటీ పరికరాన్ని అందించింది. దీనిని ఏఆర్‌టీ సెంటర్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకు విశాఖనగరంలోని టీబీ కేంద్రంలో మాత్రమే ఈ పరికరం ఉంది. దీంతో జిల్లాలోని సీహెచ్‌సీ, పీహెచ్‌సీల నుంచి టీబీ రోగులు వ్యాధి నిర్ధారణ పరీక్షలకు విశాఖ వెళ్లి నిరీక్షించాల్సి వస్తోంది. ఒక్కోసారి రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితులున్నాయి. ఇకపై ఆ కష్టాలకు చెక్ పెట్టాలన్న ఉద్దేశ్యంతో ఈ పరికరాన్ని ఎన్టీఆర్ వైద్యాలయానికి ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సందర్భంగా వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ఇప్పటి వరకు తెల్లవారుజామున కఫం పరీక్ష చేసి టీబీ ఉన్నదీ లేనిది వైద్యులు నిర్ధారించేవారని, ప్రస్తుతం ఈ పరికరం ద్వారా ఏ సమయంలోనైనా వ్యాధి నిర్ధారణ చేయవచ్చునని వివరించారు.



వైద్యాలయానికి చేరిన కఫం నిర్ధారించే పరికరం

'మలసాల'కే ఆర్‌ఈసీఎస్ పగ్గాలు?

- చైర్మన్ పదవికి ఎంపిక చేస్తూ ముగ్గురు ఎమ్మెల్యేలు సిఫార్సు
- మంత్రి గంటా అంగీకారం!
- అమరావతికి రమణరావు

కశింకోట, జనవరి 5 : కశింకోట మండలం అమీన్‌సాహెబ్‌పేటకు చెందిన మలసాల రమణరావుకు ఆర్‌ఈసీఎస్ చైర్మన్ పీఠం దాదాపుగా ఖరారైనట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటి వరకు చైర్మన్‌గా వ్యవహరించిన కొటాన అప్పారావు పదవీకాలం గత ఏడాది జూన్ 25తో ముగిసింది. దీంతో చైర్మన్ పదవి రమణరావుకు కేటాయించేందుకు సంస్థ పరిధిలోని ఎమ్మెల్యేలు పీలా, బండారు, పంచకర్ల అంగీకరించారని సమాచారం. దీంతో పాటు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ లేఖలు కూడా రాశారని తెలిసింది. అలాగే మంత్రి గంటా శ్రీనివాసరావు కూడా అంగీకారం తెలిపారని చెప్పుకుంటున్నారు. ఎమ్మెల్యేల లేఖలు సహకార కమిషనర్, సహకార మంత్రికి అందించేందుకు రమణరావు అమరావతికి పయనమయ్యారు.



మలసాల రమణరావు

దూర విద్య బీఎడ్ ఫలితాలు విడుదల

విశాఖపట్నం, జనవరి 5: ఆంధ్రవిశ్వవిద్యాలయం దూరవిద్య బీఎడ్ పరీక్షల ఫలితాలను విడుదల చేశామని ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఉదయం నిర్వహించిన డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమంలో ఆయన విద్యార్థుల సందేహాలకు సమాధానాలిచ్చారు. దూరవిద్య బీఎడ్ ఫలితాలను ఏయూ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. త్వరలో నాన్‌టీచింగ్ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. దూరవిద్య పరీక్షలు, పీజీ కోర్సులలో ప్రవేశాలు, ఫలితాలు విడుదల, విభాగాల నిర్వహణ తదితర అంశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు, దూరవిద్య సంచాలకులు ఆచార్య బి.మోహిని, డీన్‌లు పాల్గొన్నారు.

రేషన్ డిపోలపై 'విజిలెన్స్' దాడులు

- స్టాకు తేడాలున్న రెండు డిపోలు సీజ్
- సమీప డీలర్లకు సరకు అప్పగింత
- మిగిలిన డిపోల్లో త్వరలో తనిఖీలు
- విజిలెన్స్ విభాగం అధికారులు వెల్లడి

పాయకరావుపేట, జనవరి 5 : మండలంలోని పలు రేషన్ డిపోలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. స్టాకు తేడాలున్న రెండు డిపోలను సీజ్ చేశారు. విజిలెన్స్ సీఐలు శ్రీనివాసరావు, నారీమణి, సివిల్ సప్లైస్ తహసీల్దారు సుమాబాల మూడు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పలు రేషన్ డిపోల్లో తనిఖీలు జరిపారు. మంగవరంలోని రేషన్ డీలర్ రాయుడికు చెందిన డిపో నంబరు 10లో రికార్డుల్లో ఉన్న బియ్యం నిల్వ కంటే 1,320 కేజీల బియ్యం తక్కువ ఉన్నట్టు గుర్తించారు. వెంటనే డిపోను సీజ్‌చేసి ఉన్న స్టాకును గ్రామంలోని రేషన్ డిపో 48కు అప్పగించారు. అదే విధంగా అరట్లకోటలోని రేషన్ డీలర్ పి.కాంతంకు చెందిన డిపో నంబరు 24లో రికార్డులో ఉన్న నిల్వ కంటే 1,100 కేజీల బియ్యం తక్కువ ఉన్నట్టు గుర్తించారు. డిపోను సీజ్‌చేసి ఉన్న స్టాకును గ్రామంలోని రేషన్ డిపో 25కు అప్పగించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ మంగవరం, అరట్లకోట డిపోలను సీజ్‌చేసి రికార్డులు స్వాధీనం చేసుకున్నామని, ఉన్నతాధికారుల ఆదేశాలతో తదుపరి చర్యలు ఉంటాయని చెప్పారు. మిగిలిన డిపోల్లోనూ త్వరలో తనిఖీలు చేపడతామని తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ హెచ్‌సీ నానాజీ, పాయకరావుపేట ఆర్ఐ రామారావు తదితరులు పాల్గొన్నారు.



మంగవరం రేషన్ డిపో వద్ద రికార్డుల తనిఖీ



జాతీయస్థాయి సైన్స్ కాంగ్రెస్‌లో
చోడవరం విద్యార్థిని ప్రతిభ

తొలి ప్రయత్నంలోనే 2వ రౌండ్‌కు ఎంపిక

చోడవరం టౌన్, జనవరి 5 : పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని దేవరపల్లి నవ్యసాయి మేఘన 25వ జాతీయస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ 2017లో ప్రతిభ చూపింది. రసాయనాలతో కాకుండా మునగాకు రసం వినియోగించి ఆరోగ్యకరమైన సేంద్రియ బెల్లాన్ని తయారు చేయడంపై రాష్ట్రస్థాయిలో అవార్డులు సాధించి, జాతీయ పోటీలకు ఎంపికైన విషయం తెలిసినదే. దీంతో డిసెంబర్ 27 నుంచి 31 వరకు గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. వివిధ రాష్ట్రాలకు చెందిన 2300 మంది విద్యార్థులు హాజరుకాగా, మొదటి రౌండ్‌లో 850, రెండో రౌండ్‌లో 80 మందిలో మేఘన స్థానం సంపాదించింది. కాగా, తుది రౌండ్‌లో ఎంపిక కాలేదు. అయితే జాతీయ స్థాయి పోటీల్లోపాల్గొన్న ఆమెను హెచ్‌ఎం డి.కృష్ణకుమారి తదితరులు శుక్రవారం అభినందించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి

విశాఖపట్నం, జనవరి 5: టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి పాసై, డిగ్రీ అయిన 18 నుంచి 27 సంవత్సరాల వయస్సులోపు నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు గల కోర్సుల్లో శిక్షణ అందించి ఉపాధి కల్పించనున్నట్టు సంస్థ డైరెక్టర్ మయూర్ తెలిపారు. కంప్యూటర్ , టాలీ కోర్సుల్లో నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 9502874304, 73307 86078 ఫోన్ నంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.

అరకులోయ
నియోజకవర్గం

అరకులోయ - ముంచంగిపుట్టు - అనంతగిరి - హుకుంపేట - డుంబ్రిగుడ - పెదబయలు

ఏజెన్సీలో వణికిస్తున్న చలి

అనంతగిరిరూరల్, జనవరి5: చలితీవ్రత పెరగడంతో మండల వాసులు చలికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాత్రి వేళల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలకు చేరుతుండడంతో గిరిజనం చలిమంటలు వేస్తున్నారు. ఆశ్రమ విద్యార్థులు చలితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



సంక్షిప్తం

ప్రజా సమస్యలపై పోరాడతాం: వైసీపీ



మాట్లాడుతున్న శెట్టి గంగాధరస్వామి

అనంతగిరిరూరల్, జనవరి5: మండలంలో అభివృద్ధికి నోచుకోని మారుమూల ప్రాంతాల సమస్యలపై పోరాటం చేస్తామని వైసీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధర స్వామి అన్నారు. ఆయన గడిచిన మూడు రోజులుగా జీనబాడు, పినకోట, పెదకోట, కివర్ల పంచాయతీలలో పర్య టించి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతాల్లో కనీసం రహదారి, మంచినీటి సదుపాయాలు లేవని, వేలమామిడి గ్రామంలో 60ఏళ్ల పైబడి ఉన్న వృద్ధులకు పింఛన్లు మంజూరు చేయలేదని ఆయన అన్నారు. జన్మభూమి గ్రామసభలతో అభివృద్ధి ప్రచారాన్ని చేసుకుంటున్న అధికార పక్షం మారుమూల ప్రాంతాల లోని సమస్యలపై స్పందించడంలేదని ఆయన ఆరోపించారు. ఈకార్యక్రమంలో ఆయనతో పాటు పెదకోట సర్పంచ్ పూజారిలక్ష్మి, వైసీపీ నాయకులు బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహనా ర్యాలీ



ర్యాలీ చేస్తున్న అనంతగిరి జూనియర్ కళాశాల విద్యార్థులు

అనంతగిరిరూరల్, జనవరి5: మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన కలిగిస్తూ శుక్రవారం.. ప్రభుత్వ జూని యర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. జన్మభూమి -మాఊరు కా ర్యక్రమంలో భాగంగా విద్యా సంస్థల తరపున అవగాహనా ర్యాలీలు చేపడ తున్నారు. అందులో భాగంగా శుక్ర వారం అనంతగిరి , కాశీపట్నం వంటి ప్రాంతాలలో పాఠశాల, కళాశాల విద్యా ర్థులు ర్యాలీలు చేశారు. అనంతగిరిలో కళాశాల విద్యార్థులు ఈకార్యక్రమంలో పాల్గొనగా, కాశీపట్నంలో ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు సైతం చేశారు. కళాశాల ప్రిన్స్‌పాల్ నీలకంఠం, అధ్యాపకులు పైడిపునాయుడు, కాశీ పట్నం యూపీ పాఠశాల ఉపాధ్యా యులు దేముడు, కృష్ణారావు, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రాజు పాల్గొన్నారు.

అరకు సంతలో పండగ సందడి

రెండో తేదీ నుంచే మొదలైన సంక్రాంతి సంబరాలు ▸▸ భారీగా వస్త్రాల కొనుగోళ్లు

డుంబ్రిగుడ, జనవరి 5: ఏజెన్సీలో పెద్ద సంతగా పేరొందిన అరకు వారపుసంతలో శుక్రవారం పండగ సందడి నెలకొంది. మండలంలోని గుంటసీత, తదితర గ్రామాల్లో రెండో తేదీ నుంచి సంక్రాంతి పండగా మొద లైంది. దీంతో అనేక మంది గిరిజనులు అరకు వారపు సంతలో నూతన వస్త్రాలు కొనుగోలు చేస్తుండడంతో.. వస్త్ర దుకాణాలు కళకళలాడు తున్నాయి. మరోవైపు నలుమూలాల నుంచి గిరిజనులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలు, వాణిజ్య పంటలను కొనుగోలు చేయడానికి ఒడిశా, బెంగాల్, చత్తీ స్‌ఘడ్, మైదాన ప్రాంతం నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారు. విక్రయించిన డబ్బు తో పండగకు సరిపడే దినుసులు, దుస్తులను కొనుగోలు చేసుకుంటారు.

ముఖ్యంగా సంక్రాంతి పండగ అంటే ధింసాకు పెట్టింది పేరు. అందుకు గిరిజనులు తుడుము, డప్పులను వార పుసంతలో కొను గోలు చేశారు. అలాగే మేకలు, గొర్రెలు సంతలో తీసుకొచ్చి విక్రయిస్తారు. మేకలు రకాలు బట్టి రూ.3 వేలు నుంచి రూ.8 వేలు, గొర్రెలు రూ.2500 నుంచి రూ.5000 వేలు, గిరిరాజా కోళ్లను రూ.400 నుంచి రూ. 800 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. కాగా శుక్ర వారం నాటి సంతలో వస్త్ర దుకాణాలు కిక్కిరిసి పోవడంతో నడవడానికి వీల్లేక పోయింది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీ సులు అవసరమైన చర్యలు తీసుకున్నారు.



కళకళలాడుతున్న వస్త్ర దుకాణాలు

పెదబయలులో ఉత్సాహంగా 5కే రన్

విద్య ప్రాధాన్యతను వివరిస్తూ నిర్వహణ

పెదబయలు, జనవరి 5: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి గాంధీ విగ్రహం వద్ద 5కే రన్‌ను ఎమ్మెల్యే కిడారి శుక్రవారం ప్రా రంభించారు. విద్య ప్రాధాన్యత చాటిచె ప్పేందుకు, 6-14 సంవత్సరాల బాలలకు బడిలో చేర్పించే ఉద్దేశ్యంతో గతంలో ఎన్నడూ లేని విధంగా మండల విద్యాశాఖ అధికారి కె.సింహాచలం ఆధ్వర్యంలో 5కే రన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కిడారి మాట్లా డుతూ.. పెదబయలులో 5కే రన్ నిర్వహిం చడం స్ఫూర్తిదాయకమన్నారు. పన్నెండ వరకు 5కే రన్ కొనసాగింది. అంతకు ముందు చిన్నా రులు చేసిన నృత్య ప్రదర్శనను ఎమ్మెల్యే, అధి కారులు, ప్రజాప్రతినిధులు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ వేణుగోపాల్, ఎంపీపీ ఉమామహేశ్వరరావు, టీడీపీ జిల్లా నాయకులు పాంగి రాజారావు, జడ్పీటీసీ సభ్యురాలు గంగా భవానీ, సీకరి సన్యాసిదొర, కాంగ్రెస్ నాయ కులు, ఉపాధ్యాయులు బుజ్జి, మురళీ, శంకరం, స్వామి, బుజ్జిబాబు, ఎం.అప్పారావు తదిత రులు పాల్గొన్నారు.



5కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు

'బోయలను ఎస్టీల్లో చేర్చవద్దు'

అరకులోయ, జనవరి 5: బోయవాల్మీ కులను ఎస్టీల్లో చేర్చవద్దంటూ ఏపీ ఆదివాసీ వికాస పరిషత్ డిమాండ్ చేస్తోంది. ఇదే క్రమంలో పరిషత్ సభ్యులు.. సిరగాం జన్మభూమి గ్రామ సభలో తీర్మానాల వినతిని నోడల్ అధికారికి అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఎల్‌బీ రామారావు, ఎం.సత్యబాబు, బీడీ ధనరాజు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ, డీటీఎఫ్ క్యాలెండర్‌ల ఆవిష్కరణ





హుకుంపేటలో పీఆర్‌టీయూ , పెదబయలులో డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ దృశ్యాలు

హుకుంపేట, జనవరి 5: ప్రతీ ఒక్క ఉద్యోగి క్యాలెండర్ , డైరీలను వినియోగించుకో వాలని ఎంఈవో రామచంద్రరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో పీఆర్‌టీయూ క్యాలెండర్, డైరీ లను ఆయన ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. క్యాలెండర్, డైరీలను ఉపయోగించడం వల్ల అన్ని విధాలు ఉపయోగం ఉంటుందన్నారు. . ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కా ర్యదర్శి కొర్రా మార్కండేయులు, ఉపాధ్యా యులు సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు, జనవరి 5: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డీటీఎఫ్ క్యాలెండర్, డైరీలను ఎంఈవో కె.సింహాచలం ఆధ్వర్యంలో ఆవిష్క రించారు. డీటీఎఫ్ అధ్యక్షుడు కె.సంజీవరావు, నాయకులు వి.మాధవరావు, ఎస్.మత్స్యలింగం, జి.ప్రసాద్, గెన్నుబాబు, రాజేశ్వరరావు, ఎస్‌బీవీ ల్ స్వామి, మత్స్యరాజు, రాజేంద్రప్రసాద్, తిరు పతిరావు తదితరులు పాల్గొన్నారు.

వినతులను ఆన్‌లైన్‌లో పొందుపరచండి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ డీకే బాలాజీ

లోతుగెడ్డ (చింతపల్లి) జనవరి 5: జన్మ భూమిలో వచ్చిన వినతులను అదే రోజు సాయంత్రం ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని పాడేరు సబ్ కలెక్టర్ బాలాజీ డీకే అన్నారు. లోతుగెడ్డ పంచాయతీలో సర్పంచ్ సావిత్రి అధ్యక్షతన శుక్రవారం జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జన్మభూమి మా ఊరు కార్య క్రమాలు సమయానికి ప్రారంభించాలని, ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించి సా యంత్రం ఐదుగంటల తరువాత కార్యక్రమా న్ని ముగించాలని సూచించారు. సభలకు అధికారులు విధిగా హాజరుకావాలన్నారు.

ట్రైకార్ రుణాలు మంజూరు చేస్తాం

డీఎస్‌వీ గోపాలకృష్ణ, బ్రాంచి మేనేజర్, ఎస్‌బీఐ కాశీపట్నం

ఇంటర్వ్యూ



ప్రశ్న: వ్యవసాయ రుణాలు మంజూరుకు మీరు ఎలాంటి ప్రణా ళికలు చేస్తున్నారు?

జవాబు: ప్రస్తుతం కాశీపట్నం బ్రాంచి పరిధిలో రైతులకు వ్యవసాయరుణాలు రెన్యు వల్ చేస్తున్నాం. రైతులు తమ బ్యాంకు లోను పుస్తకం రెవున్యూ 1బీ తో వచ్చినట్లయితే వెంటనే రెన్యువల్ చేస్తున్నాం.

ప్రశ్న: కొత్తగా వ్యవసాయ రుణాలు మంజూరు చేస్తున్నారా?

జవాబు: వ్యవసాయ రుణాలు మా శాఖ పరిధిలో అత్యధికంగా ఇది వరకే మంజూరు చేయడం జరిగింది. ముందుగా రెన్యువల్ పై దృష్టి సారించాం

ప్రశ్న: ట్రైకార్ రుణాలు ఎప్పుడు మంజూరు చేస్తారు?

జవాబు: ప్రభుత్వం నుంచి మంజూరైన యూనిట్లకు అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉంటే మరికొద్ది రోజుల్లో ట్రైకార్ రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. ఆమోదం కోసం జోనల్ అధికారులకు నివేదిక పంపించాం

ప్రశ్న: బ్యాంకులో వినియోగదారులకు సేవలు అందడంలో ఇబ్బందులు తలెత్తుతు న్నాయని విమర్శలు వస్తున్నాయి?

జవాబు: మా బ్రాంచి శాటిలైట్ బ్రాంచి కావడంవల్ల ఒక్కోసారి నెట్‌వర్క్ లేకపోవ డంతో లావాదేవీలకు వీలు ఉండదు. దాని వల్ల సమస్య మినహా మిగతా ఎలాంటి సమ స్య లేదు. మెరుగైన సేవలు అందించడానికి ఎల్ల వేళలా కృషి చేస్తున్నాం.

- అనంతగిరి

సంక్రాంతి శోభ

బుడియాల నృత్యాలు



అరకు సంతలో బుడియా నృత్యం

అరకులోయ, జనవరి 5: మన్యం వారపు సంతలో పండగ శోభ సంతరించుకుంది. సంక్రాంతి పండగ సందర్భంగా మొదటి వారపు సంత కావడంతో పెద్ద ఎత్తున గిరిజనం సంతకు తరలివచ్చారు. ఈ సందర్భంగా క్యాలెండర్ ప్రకారం వచ్చే సంక్రాంతి పండగ కన్నా మన్యంలో సంక్రాంతి పండగ ముందుగానే వస్తుంది. దీంతో పలువురు యువకులు పలు రకాల వేషాధా రణతో డప్పు, వాయిద్యాలతో ప్రతీ దుకాణం ముందు నృత్యం చేస్తూ సందడి చేశారు.

పెదగరువులో వాలీబాల్ టోర్నీ ప్రారంభం

హుకుంపేట, జనవరి 5: పెదగరువు పంచాయతీ కేంద్రంలో వాలీబాల్ టోర్నీ శుక్రవారం ప్రారంభమైంది. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఈ టోర్నీ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కొట్నాపల్లి పంచాయతీ సర్పంచ్ వాసుదేవ్ మాట్లాడుతూ.. ఈ టోర్నీలో గెలుపొందిన యువకులను జన్మభూమి సభలో బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో పరశురాం వార్డు సభ్యులు, గిరిజనులు పాల్గొన్నారు.

అనేక సమస్యలు పరిష్కరించాం

జన్మభూమిలో ఎమ్మెల్యే కిడారి వెల్లడి


పెదబయలులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు


సిరగంలో రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ అరుణకుమారి


భీంపోలులో రేషన్ కార్డులు అందజేస్తున్న ఎంపీపీ గుజ్జలిపైడితల్లి

పెదబయలు, జనవరి 5: టీడీపీ ప్రభుత్వం అనేక సమస్యలు పరిష్కరించిందని ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు అన్నారు. మండలంలోని సీతగుంట పంచాయతీ కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఆవరణలో శుక్రవారం జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. అనేక పథకాలను అమలు చేస్తుందని, వాటిని అర్హులైన వారంతా సద్వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం చంద్రన్న కానుకలను లబ్ధిదారులకు అందజేశారు.

ఇదిలా ఉండగా కార్యక్రమం ప్రారంభంలోనే సీపీఎం, వైసీపీ నాయకులు బోయలను ఎస్టీల్లో చేర్పించే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలు నినాదాలు చేశారు. అలాగే మండల కేంద్రంలో రూ.5 కోట్లతో సంబంధిత కాంట్రాక్టర్ నిర్మించిన తాగునీటి పథకం ద్వారా నీరు అందడం లేదని, ట్యాంకులు రంగులు వేచి అసంపూర్తిగా వదిలేశారని ఫిర్యాదు చేశారు. సంక్రాంతి కానుక సరుకులను బయోమెట్రిక్ విధానంతో కాకుండా పాత పద్ధతిలో పంపిణీ చేయాలన్నారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు తీర్మానం మాత్రమే జరిగిందని, దీనికి తాను కూడా వ్యతిరేకమని చెప్పడం ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉమా మహేశ్వరరావు, టీడీపీ నాయకులు పాంగి రాజారావు, లక్ష్మి, సర్పంచ్ విజయ, జడ్పీటీసీ సభ్యురాలు గంగాభవానీ, మాజీ ఎంపీపీ వెచ్చంగి కొండయ్య, సీకరి సన్యాసిదొర, కాంగ్రెస్ నాయకులు జి.సూరయ్య, జీసీసీ మేనేజర్ బి.వెంకటేష్, సీడీపీవో కేబీవీ దేవి, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

అరకులోయ, జనవరి 5: మారుమూల గ్రామ పంచాయతీల పరిధిలో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ అరుణకుమారి అన్నారు. సిరగంలో నిర్వహించిన జన్మభూమిలో ఆమె మాట్లాడుతూ.. సిరగాంలో తాగు నీటి సమస్య ఉందన్న విషయం తాము స్వయంగా గుర్తించామన్నారు. సిరగాం నుంచి దిబ్బవలస వరకు మంజూరైన రహదారి అటవీశాఖ అభ్యంతరాలతో రహదారి నిర్మాణం కొన్నాళ్లు నిలిచిపోయిందని, ఇటీవలే అనుమతులు వచ్చాయన్నారు.

కాగా.. నూతనంగా మంజూరైన రేషన్ కార్డులు, సాధికారిక మిత్రలకు కరదీపికలను, ఎంపీపీ అరుణకుమారి, సర్పంచ్ అప్పలమ్మ, ఎంపీడీవో మల్లిఖార్జునరావు పంపిణీ చేశారు.

భూముల పరిరక్షణకు చర్యలు

అనంతగిరి, జనవరి5: గిరిజనేతర పంచాయతీల్లో భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని మండలాధ్యక్షురాలు గుజ్జలి పైడితల్లి అన్నారు. గుమ్మకోట, భీంపోలు పంచాయతీల్లో శుక్రవారం జన్మభూమి గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి జన్మభూమి ఉపయోగపడుతుందన్నారు. కాగా తహసీల్దార్ జయప్రకాశ్ ఆధ్వర్యంలో అధికారుల బృందం గుమ్మ, పెదబిడ్డ పంచాయతీలలో గ్రామసభలను నిర్వహించారు. పెదబిడ్డ పంచాయతీలో నాటుసారా విక్రయాలను అదుపులోకి తీసుకురావాలని స్థానిక నాయకులు కోరారు.

ఎంపీడీఓ రమేష్ రామన్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఎస్ఎఫ్‌సీ డైరక్టర్ బూర్జలక్ష్మీ, సర్పంచ్‌లు స్వామి, దూరు అక్కమ్మ, చిన్నయ్య, పుణ్యవతి, ఎంపీటీసీలు స్వామినాయుడు, కొండమ్మ పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



అరకురూరల్, జనవరి 5: శిరగాం పంచాయతీ తాగునీటి సమస్యల పరిష్కరించాలని ఆ పంచాయతీ ప్రజలు ఖాళీ బిందెలతో అధికారులకు నిలశారు. శుక్రవారం శిరగాం పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన జన్మభూమి కాకార్యక్రమంలో సీపీఎం ఆధ్వర్యంలో ఈ నిరసనకు దిగారు. జన్మభూమి కార్యక్రమానికి హాజరైన ఎంపీడీవో మల్లిఖార్జునరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే వర్రా జంక్షన్ నుంచి శిరిగాం, దిబ్బవలస, లంతంపాడు వరకు రోడ్డు సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

బాబుసాలలో నిరసన..

ముంచంగిపుట్టు, జనవరి 5: మండలంలో బాబుసాలలో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అలాగే గత ప్రభుత్వ కాలంలో పునాదులు స్థాయి వరకు నిర్మించిన ఇందిరమ్మ గృహాలను నేటికీ ఎందుకు మంజూరు చేయలేదని, ఎన్నిసార్లు దరఖాస్తు పెట్టుకుంటున్నా పింఛన్‌లు మంజూరు చేయడం లేదని, రెవెన్యూ పరమైన సమస్యలు సకాలంలో పరిష్కరించడం లేదని ఆయా శాఖల అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పాఠశాల, అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలను నిర్మించాలని, సమస్యలు పరిష్కరించాలంటూ.. రహదారిపై బైఠాయించారు.





డుంబ్రిగుడలో చంద్రన్న కానుకలను అందజేస్తున్న ఏపీడీ లచ్చన్న , (కుడి వైపు చిత్రంలో) హుకుంపేటలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్యాంబాబు

మరుగుదొడ్లను తప్పక నిర్మించుకోవాలి

హుకుంపేట, జనవరి 5: వ్యక్తిగత మరుగుదొడ్లను ప్రతీ కుటుంబం నిర్మించుకోవాలని తహసీల్దార్ శ్యాంబాబు అన్నారు. ఇందుకు ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని గూడ , ములియపుట్టు, బొడ్డాపుట్టు, మత్స్యపురం పంచాయతీల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లోని ప్రజల నుంచి వినతులు స్వీకరించి.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అంతకు ముందు గూడ గ్రామంలో నిర్వహించిన జనభూమిలో గర్భిణీలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమంతాలు నిర్వహించారు. చంద్రన్న కానుకలను అందజేశారు. గూడ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు థింసా నత్యం చేసి, అలరించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో రామచంద్రమూర్తి, ఎంఈవో రామచంద్రరావు, డీటీ శ్రీనివాసు, ఈవోపీఆర్డీ ఉషారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రమేష్, టీడీపీ నాయకులు కె.రాంబాబు, సర్పంచ్ సరోజిని, జన్మభూమి కమిటీ ప్రతినిధి జ్ఞానప్రకాష్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ మండలంలో..

డుంబ్రిగుడ, జనవరి 5: ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగించుకోవాలని ఉపాధి హామి పథకం ఏపీడీ లచ్చన్న అన్నారు. మండలంలోని తూటంగి పంచాయతీ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జన్మభూమిలో ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా మండల అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జన్మభూమిల్లో నిరసనలు చేస్తే లాభం ఉండదని, సమస్యల వినతులు అందిస్తే పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. అనంతరం రేషన్ కార్డులు, పింఛన్లు, చంద్రన్న కానుకలను అందించారు. తూటంగి పంచాయతీ సర్పంచ్ కుంతూరు పుష్పవతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఎంపీడీవో మీనాకుమారి బృందం పాల్గొన్నారు.

బోయవాల్మీకులను ఎస్టీల్లో చేర్చొద్దు: గిరిజన సంఘం వినతి

తహసీల్దార్ బృందం కొర్రా పంచాయతీలో జన్మభూమి నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు పోతురాజు ఆధ్వర్యంలో.. బోయ వాల్మీకులకు ఎస్టీ జాబితాలో చేర్పించే వద్దంటూ తీర్మాన పత్రాన్ని తహసీల్దార్ బాబుసుందరానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో త్రినాథ్‌రావు, టీడీపీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు, జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి వి.నాగేశ్వరరావు, మండల నాయకులు ఎం.స్వామి, దేశం పార్టీ ప్రచార కార్యదర్శి కె.సుబ్బారావు, రాజారావు, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ ప్రకాష్, పశువైద్యదికారి సీనయ్య, ఐసీడీఎస్ పీవో రత్నకుమారి, ఏవో అనసూయ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

మండంలోనికి కొర్రా పంచాయతీలో శుక్రవారం జన్మభూమి కార్యక్రమంలో భాగంగా గిరిజనులకు వైద్యసేవలు అందించారు. సుమారు వంద మంది గిరిజనులకు వైద్యపరీక్షలు జరిపి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. రోగాల బారిన పడకుండా ఉండాలండే తాగునీటిని కాచి, చల్లార్చుకుని తాగాలన్నారు. చలికాలం ఎక్కువగా చర్మ సంబంధిత వ్యాధులు రాకుండా ఉండాలంటే.. నిత్యం పరిశుభ్రంగా ఉండాలన్నారు.

కాగా అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు తప్పనని సరిగా ఆస్పత్రిల్లో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆసిస్టెంట్‌లు హరిబాబు, మురళీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేడు తొంకోటలో వాలీబాల్ టోర్నమెంట్

అనంతగిరి, జనవరి5: మండలంలోని పెదకోట పంచాయతీ తోంకోటలో శనివారం.. వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తారు. ఈనెల 7న భైరవమూర్తి అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఈ టోర్నీ ఏర్పాటు చేస్తున్నామని కమిటీ నిర్వాహకులు సత్యం తెలిపారు. విజేతలకు ఆకర్షణీయ బహుమతులు అందజేస్తామని, ఆసక్తి కలిగిన జట్లు టోర్నీలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

జన్మభూమికి వ్యతిరేకంగా తీర్మానం చేయాలి: కాంగ్రెస్

హుకుంపేట, జనవరి 5: ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమాలకు గిరిజన ప్రాంతప్రజలంతా తిరుగుబాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు కేబీ సావిత్రి, జిల్లా అధికార ప్రతినిధి అశోక్ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన వారిని ఎస్టీ జాబితాలో చేర్పించే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. దీనిపై ప్రతీ ఒక్కరూ జన్మభూమిల్లో నిరసన తెలిపాలన్నారు.

గడ్డివాము దగ్ధం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

హుకుంపేట, జనవరి 5: మండలంలోని తడిగిరి పంచాయతీ కేంద్రంలో గడ్డివాము శుక్రవారం దగ్ధమైంది. దీనికి సంబంధించిన వివరాలు... తడిగిరి గ్రామానికి చెందిన కిముడు మత్స్యలింగం అనే గిరిజనుడు గ్రామ సమీపంలో వరి నూడ్పులలో నిమగ్నమై ఉన్నారు. అయితే చలి తీవ్రంగా ఉండడంతో కలం సమీపంలో మంటపెట్టుకున్నారు. ఇదే సమయంలో భారీ స్థాయిలో గాలి రావడంతో అగ్గిరవ్వలు గడ్డివాముపై పడి.. వరి గడ్డి పూర్తిగా దగ్ధమైంది. పాడేరు అగ్నిమాపక అధికారుకు సమాచారం అందించిన ఫలితం లేకపోయిందని, అగ్నిమాపక శకటం వచ్చేసరికి గడ్డి పూర్తిగా బూడిదైందని మత్స్యలింగం వాపోయాడు. దీంతో ఈ ఏడాది తమ పశువులకు మేతకు గడ్డి పెట్టలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు ఆదుకోవాని ఆయన కోరారు.

బడిఈడు పిల్లలంతా పాఠశాలలోనే ఉండాలి

చౌడుపల్లి (చింతపల్లి) జనవరి 5: బడిఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉంటూ చదువుకోవాలని చౌడుపల్లి సర్పంచ్ అప్పలమ్మ కోరారు. జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాప్-1, 2 విద్యార్థులు, అధ్యాపకులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు.


గిరిజన మహిళలతో కలిసి ధింసా నృత్యం చేస్తున్న సీఎం చంద్రబాబు


ధర్మసాగరం గ్రామానికి చెందిన కె.రామలక్ష్మి కుమారుడు దిలీప్‌కు అన్నప్రాసన చేస్తున్న చంద్రబాబు


వివిధ వేషధారణలతో ఉన్న చిన్నారులతో సీఎం, మంత్రి అయ్యన్న, ప్రజాప్రతినిధులు

టీడీపీదే గెలుపు... మళ్లీ మీరే సీఎం

ధర్మసాగరం(నర్సీపట్నం), జనవరి 5: ధర్మసాగరం గ్రామానికి చెందిన సాధికార మిత్ర వేమవరపు పద్మ మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ విజయం సాధించి, చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి కావాలని అన్నారు. భగవంతుడు అన్నిచోట్లకూ వెళ్లలేక చంద్రబాబునాయుడును తన ప్రతినిధిగా పంపుతున్నాడని, అదేవిధంగా చంద్రబాబు ప్రజలందరి వద్దకు వెళ్లలేక సాధికార మిత్రలుగా తమను పంపుతున్నారని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్నామని చెప్పారు.

ఆకట్టుకున్న విద్యార్థిని పద్మ ప్రసంగం

గొలుగొండ మండలం చీడిగుమ్మల జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని సబ్బవరపు పద్మ... తన అనర్గళ ప్రసంగంతో ముఖ్యమంత్రిని ఆకట్టుకుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న బడికొస్తా, మధ్యాహ్న భోజన పథకం, మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు వంటి అనేక సంక్షేమ పథకాల గురించి వివరించింది. దీంతో మంత్ర ముగ్ధుడైన ఆయన పుష్పగుచ్ఛాన్ని తెప్పించి బాలికకు ఇచ్చి అభినందించారు.

సాధికార మిత్ర వేమవరపు పద్మ

కాపు కార్పొరేషన్ సాయంతో విదేశాల్లో మెడిసిన్, ఎంఎస్

పేద పిల్లలకు ముఖ్యమంత్రి అందిస్తున్న ఆర్థిక సహాయం మరువలేనిదని, తన కుమార్తె అప్పన ప్రియాంక కాపు కార్పొరేషన్ ద్వారా రూ.10 లక్షల ఆర్థిక సహాయం పొంది, కజకిస్థాన్‌లో మెడిసిన్ చదువుతున్నదని నాతవరం మండలం చమ్మచింతకు చెందిన విద్యార్థిని తల్లి అప్పన సత్యనారాయణమ్మ అన్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం పొంది, ప్రస్తుతం కెనడాలో ఎంఎస్ చదువుతున్న చిత్తూరు జిల్లాకు చెందిన హేమంత్ అనే విద్యార్థితో ముఖ్యమంత్రి చంద్రబాబు స్కైప్ ద్వారా ఆన్‌లైన్‌లో మాట్లాడారు. ప్రభుత్వం ఆదుకోవడం వల్లనే కెనడాలో చదువుకోగలుగుతున్నానని, చదువు పూర్తయిన తర్వాత అక్కడే కొంతకాలంపాటు ఉద్యోగం చేసి, తర్వాత స్వదేశానికి సేవలందిస్తానని విద్యార్థి హేమంత్ తెలిపారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.... పేద పిల్లల చదువు కోసం ఎంత ఖర్చయినాసరే ప్రభుత్వం భరిస్తుందన్నారు.

ముఖ్యమంత్రికి సన్మానాల వెల్లువ


సీఎం చంద్రబాబును సన్మానిస్తున్న ధర్మసాగరం సాధికార మిత్రలు

ధర్మసాగరం(నర్సీపట్నం), జనవరి 5: ధర్మసాగరంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మంత్రి అయ్యన్నపాత్రుడుతోపాటు పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం మొదటి దశ పనులకు రూ.2,600 కేటాయించిన సీఎం చంద్రబాబు అపర భగీరథుడంటూ మంత్రి అయ్యన్న, ఆయన కుటుంబు సభ్యులు ఘనంగా సన్మానించి, జ్ఞాపికతోతోపాటు నాగలి బహూకరించారు. ధర్మసాగరం గ్రామానికి చెందిన నర్సీపట్నం ఎంపీపీ సుకల రమణమ్మ, సర్పంచ్ నల్లబెల్లి సత్యవతి, తదితరులు కూడా సీఎంని సత్కరించారు. నర్సీపట్నం మెయిన్‌రోడ్డు విస్తరణకు నిధులు మంజూరుచేస్తున్నట్టు ప్రకటించినందుకు నర్సీపట్నం మున్సిపాలిటీ తరపున చైర్‌పర్సన్ చింతకాయల అనిత, వైస్‌చైర్మన్ సన్యాసిపాత్రుడు, తదితరులు కూడా ముఖ్యమంత్రిని సన్మానించారు. జిల్లా సాధికారమిత్రల తరపున ధర్మసాగరం గ్రామానికి చెందిన సాధికారమిత్రలు, వార్డు మెంబర్‌లు కూడా చంద్రబాబును సన్మానించారు.


జన్మభూమి ప్రతిజ్ఞ చేస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు అయ్యన్న, చినరాజప్ప, ఎంపీ ముత్తంశెట్టి, ఎమ్మెల్సీలు మూర్తి, చలపతిరావు, ఎమ్మెల్యే అనిత, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ రమణమ్మ

ఆద్యంతం ఉత్సాహంగా...

ధర్మసాగరం(నర్సీపట్నం), జవవరి 5 (ఆంధ్రజ్యోతి): జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నర్సీపట్నం మండలం ధర్మసాగరం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రజప్రతినిధులు, టీడీపీ నేతలు ఘనస్వాగతం పకలగా, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఉదయం 10.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా మదర్ నర్సింగ్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎంకు, మంత్రులు అయ్యన్నపాత్రుడు, నిమ్మకాయల చినరాజప్ప, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సాదరంగా స్వాగతం పలికి, పూలవర్షం కురిపించారు. అక్కడ నుంచి ధర్మసాగరం చేరుకున్నారు. గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. రచ్చబండ కార్యక్రమ వేదిక వద్దకు నడుచుకుంటూ వెళ్లారు. ఈ సమయంలో పలువురిని పలకరిస్తూ, గ్రామస్థులతో కరచాలనం చేశారు. సీఎంతో ఫొటోలు దిగేందుకు యువతీ యువకులు ఉత్సాహం చూపారు. రచ్చబండ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు అన్నీ తానై వ్యవహరించారు. అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిన ధర్మసాగరం గ్రామాన్ని చూస్తుంటే ముచ్చటేస్తుందన్నారు. ప్రస్తుతం ఆరు పాయింట్ల రేటింగ్‌లో వుందని, భవిష్యత్‌లో పది పాయిట్ల వృద్ధితో రాష్ట్రానికి ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జన్మభూమి సభావేదిక వద్దకు చేరుకున్నారు. ఎంపీడీవో జయమాధవి, నర్సీపట్నంలో ప్రభుత్వం చేపట్టిన పనులను వివరిస్తుండగా సీఎం కలుగజేసుకొని, సమస్యలపై అందిన అర్జీలు, వాటి పరిష్కారాలను మాత్రమే వివరించాలని సూచించారు.

మంత్రి గంటా గైర్హాజరుపై చర్చ...

మంత్రి అయ్యన్న సొంత నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు హాజరైన జన్మభూమి సభకు జిల్లాకు చెందిన మరో మంత్రి గంటా శ్రీనివాసరావు హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. ఇరువురు మంత్రుల మధ్య సఖ్యత లేదని, అందుకే సభకు రాలేదని ప్రచారం సాగింది. అయితే మంత్రి గంటా, విజయనగరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కావడం, ఆ జిల్లాలోని బొబ్బిలిలో కూడా ఇదే రోజు సీఎం సభ వుండడం, జన్మభూమిలో ప్రాధాన్యత అంశమైన విద్యా వికాసం అంశాన్ని బొబ్బిలిలోనే ప్రారంభించనుండడంతో విద్యా శాఖా మంత్రి అయినా గంటా.. ధర్మసాగరం రాలేదని తెలిసింది. కాగా జిల్లా అంతటా జన్మభూమి-మావూరు కార్యక్రమాలు జరుగుతుండడంతో ఎమ్మెల్యేలు తన సభకు రావద్దని సీఎం ముందుగానే చెప్పడంతో పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత, ఎమ్మెల్సీలు ఎంవీవీఎస్ మూర్తి, పప్పల చలపతిరావు మినహా మిగిలిన వారెవరూ హాజరు కాలేదు.

టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం

తెలుగుదేశం తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత మూడున్నరేళ్లలో జిల్లాలో పలు నియోజకవర్గాల్లో పర్యటించినప్పటికీ, నర్సీపట్నం నియోజకవర్గానకి రావడం ఇదే ప్రథమం. దీంతో పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. మంత్రి తనయుడు విజయ్‌తోపాటు టీడీపీ నాయకులు పలుచోట్ల భారీ స్వాగత ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

జన్మభూమి సభలో సైడ్‌లైట్స్

- ధర్మసాగరం గ్రామానికి చేరుకున్న ముఖ్యమంత్రికి మంత్రులు చినరాజప్ప, అయ్యన్నపాత్రుడు, మంత్రి సతీమణి పద్మావతి, అయ్యన్న తనయుడు విజయ్, ఎంపీపీ సుకల రమణమ్మ పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు.
- సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఐసీడీఎస్ ఏర్పాటుచేసిన శిబిరాన్ని సందర్శించి గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
- పాఠశాల విద్యా శాఖ ఏర్పాటుచేసిన విద్య-వికాసం, బోధన-అభ్యాసన స్టాల్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. 'బడికొస్తా' పథకంలో భాగంగా బాలికలకు అందించిన సైకిళ్లను ఏర్పాటు చేశారు. వీటిని ముఖ్యమంత్రి పరిశీలించి విద్యార్థినులతో ముచ్చటించారు.
- ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రయాణ అద్దె వాహనాలను ప్రదర్శించారు. రుణాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో పయనించాలని లబ్ధిదారులకు సూచించారు.
- రైతు రథం ట్రాక్టర్‌లను, పవర్‌టిల్లర్‌లను సీఎం పరిశీలించి, గొలుగొండ మండలం గదం పాలెం గ్రామానికి చెందిన లగుడు సత్యవేణికి ట్రాక్టర్ తాళం అందజేశారు. ట్రాక్టర్ ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు.
- సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో.. విద్య-మా హక్కు, విద్య-వికాసం, జన్మభూమి-మాఊరు అని ఇసుకలో ఏర్పాటు చేసిన అక్షరాలను చూసిన సీఎం, సదరు నిర్వాహకుడిని అభినందించారు.
- ఉద్యాన శాఖ, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఎస్సీ కార్పొరేషన్, పశుసంవర్ధక శాఖలు తమ స్టాల్స్‌ని ఏర్పాటు చేశాయి.
- నర్సీపట్నం శ్రీచైతన్య పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న మాకవరపాలెం మండలం వెంకయ్యపాలెం గ్రామానికి చెందిన ఎ.అజయ్‌కుమార్ అనే బాలుడు, సీఎం చంద్రబాబు వేషధారణలో నాగలి పట్టుకుని అలరించాడు. ఈ బాలుడితో సెల్ఫీలు దిగడానికి పలువురు ప్రజాప్రతినిధులు ఆసక్తి చూపారు. సీఎం సైతం బాలుడితో ఫొటోలు దిగారు.
- రాజధాని నిర్మాణం కోసం అనిమిరెడ్డి అప్పలనాయుడు అనే రైతు రూ.10 వేలు విరాళంగా అందజేయడంతో మంత్రి అయ్యన్నపాత్రుడు అతనిని వేదికపైకి పిలిచి సీఎం చేతులమీదుగా శాలువాతో సన్మానించారు.
- సభావేదిక వద్ద ముఖ్యమంత్రి, మంత్రులు... గిరిజన సంప్రదాయ కొమ్ము తలపాగాలు ధరించి ధింసా నృత్యం చేశారు.
- ముఖ్యమంత్రి సభకు భారీగా మహిళలు, వృద్ధులు హాజరుకావడంతో సభాప్రాంగణం సరిపోకపోక వందలాది మంది బయట నిల్చోవాల్సి వచ్చింది.
- ప్రజలు ఇచ్చిన అర్జీలను ముఖ్యమంత్రి పరిశీలించి కొన్నింటిపై అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీచేశారు.
- నర్సీపట్నానికి చెందిన మౌనిక అనే విద్యార్థిని బాక్సింగ్‌లో ఆరు బంగారు పతకాలు సాధించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు.

-నర్సీపట్నం టౌన్

- ధాన్యం మద్దతు ధరపై పెదవి విరుపు
- ప్రభుత్వ ధరకే అడుగుతున్న వ్యాపారులు
- దీర్ఘకాలిక రకాలకు గిట్టుబాటు కాదంటున్న రైతులు
- కల్లాల్లోనే ధాన్యం నిల్వ

అన్నదాత వర్రీ


కుమ్మరాపల్లి సమీపంలో పొలాల్లో వరి నూర్చుతున్న రైతులు

రాంబిల్లి, జనవరి 5: రాంబిల్లి మండలంలో ఈ ఏడాది 9,500 ఎకరాల్లో వరి సాగుచేయగా, దాదాపు 90 శాతం విస్తీర్ణంలో ఆర్‌జీఎల్(శ్రీకాకుళం సన్నాలు) రకాన్ని వేశారు. వాతావరణం అనుకూలించడంతో పంట బాగానే పండింది. వరికోత, నూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎకరాకు 40 బస్తాలకు(ఒక్కోక్కటి 75 కిలోలు)పైగా దిగుబడులు వస్తున్నాయి. కాగా మండలంలోని దిమిలి సహకార సంఘంలో డీసీసీబీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ క్వింటా ధాన్యం ఏ గ్రేడ్ అయితే రూ.1590, సాధారణ రకం అయితే రూ.1550లకు కొనుగోలు చేస్తున్నారు. ఈ ధర స్వల్పకాలిక రకాలు అయితేనే గిట్టుబాబు అవుతుందంటూ, ఆ రకాలను మాత్రమే విక్రయించేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. దీర్ఘకాలిక రకమైన ఆర్‌జీఎల్, సాంబ మసూరి రకాల ధాన్యాన్ని ఈ ధరకు విక్రయించడం లేదు.

ముందుకురాని వ్యాపారులు

ఒకవైపు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం, మరోవైపు నూర్చిన ధాన్యం ఇంకా పూర్తిస్థాయిలో ఆరక పోవడంతో కొనుగోళ్లకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. మండలంలో కూలీల కొరత వుండడంతో పలువురు రైతులు యంత్రాలతో వరి పంట కోత, నూర్పిడి ఏకకాలంలో నిర్వహిస్తున్నారు. ఇటువంటి ధాన్యంలో తేమ శాతం అధికంగా వుంటుంది. కొద్ది రోజుల ఆరబెట్టిన తరువాత వ్యాపారులు కొనుగోలు చేస్తారు. అయితే జిల్లా అంతటా వరి పంట బాగా పండడంతో ధాన్యం వ్యాపారులు ఒక మెట్టు పైకెక్కి కూర్చున్నారు. ఏ రకం ధాన్యం అయినాసరే ప్రభుత్వం ప్రకటించిన ధర అయితేనే కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. ధాన్యం పూర్తిగా ఆరకుండా కొనుగోలు చేస్తే తరువాత తూకం తగ్గిపోయి తాము నష్టపోతామని, అందువల్ల ప్రభుత్వ ధరకు కొనుగోలు చేస్తామని వ్యాపారులు చెబుతున్నారు. ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేసిన రైతులు... ధాన్యం నిల్వకు సదుపాయం లేకపోవడంతో పొలంలోనే రాశిగా పోసి నిల్వ వుంచుతున్నారు. వ్యాపారులు ఆర్‌ఎల్‌జీ రకం బస్తా కనీసం రూ.1,500 లకు అయినా కొనుగోలు చేస్తే గిట్టుబాటు అవుతుందని రైతులు అంటున్నారు. కానీ రూ.1,200లకు మించి కొనుగోలు చేయలేమని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు.

వ్యాపారులు మెట్ట దిగడంలేదు



నేను ఆర్‌ఎల్‌జీ రకం వేశాను. పక్షం రోజుల క్రితం వరి కోసి, నూర్పిడి చేయించాను. బస్తా(75 కిలోలు) రూ.1,500 అయితే అమ్మడానికి సిద్ధంగా వున్నాను. వ్యాపారులు రూ.1,200లకు మించి పలకదని అంటున్నారు. ధాన్యాన్ని ఇంటిలో నిల్వ చేయడానికి వీలులేక కల్లంలోనే వుంచేశాను. ఈ ఏడాది వరి పంట బాగా పండడంతో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా వున్నాయి.

ఎన్.సత్తిబాబు, దిమిలి

ప్రభుత్వ ధరలు గిట్టుబాటు కావు



వరి సాగు వ్యయం ఏటేటా పెరుగుతున్నది. నాట్లు, కోతలు వంటి పనులకు కూలీలు దొరకని పరిస్థితి. ఉపాధి హామీ పథకంతో వ్యవసాయాన్ని అనుసంధానం చేయలేదు. ధాన్యం ధరలు మాత్రం మూడేళ్ల నుంచి ఒకేవిధంగా వున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు ఏమాత్రం గిట్టుబాటు కాదు.

వి.నూకునాయుడు, కట్టుబోలు

మానసిక ఒత్తిడితోనే భార్యాభర్తల ఆత్మహత్య?


రాజేష్‌రెడ్డి, సౌమ్య (ఫైల్ ఫొటో)

- ఒకవైపు ఆర్థిక ఇబ్బందులు...మరో వైపు అవమాన భారం
- ఆస్తిలో వాటా ఇచ్చేందుకు రాజేష్‌రెడ్డి కుటుంబీకుల నిరాకరణ
- కిడ్నాప్ కేసు ఉపసంహరణకు సోదరుడి ససేమిరా
- నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయిన దంపతులు
- బంధువులు దూరం పెట్టడంతో తీవ్ర క్షోభ
- మానసిక వైద్యుడి వద్ద చికిత్స
- భర్త జైలుకు వెళ్లిన సమయంలో లైంగిక వేధింపులు ఎదుర్కొన్న సౌమ్య?
- సూసైడ్‌నోట్‌లో ప్రస్తావన?
- భార్యభర్తల మధ్య ఎలాంటి విభేదాలు లేవంటున్న సౌమ్య కుటుంబసభ్యులు

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం/మహారాణిపేట)

వ్యక్తిగత సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, అవమానభారం, మానసిక ఒత్తిడి తదితర కారణాలతోనే పిల్లలను చంపి తాము ఆత్యహత్యకు పాల్పడి వుంటారనే అభిప్రాయాన్ని సౌమ్య కుటుంబ సభ్యులు వ్యక్తంచేశారు. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన రాజేష్‌రెడ్డి, అతని భార్య దేవిరెడ్డి గురుబాల అలియాస్ సౌమ్యలు గురువారం పిల్లలకు విషమిచ్చి తాము ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా సౌమ్య తల్లిదండ్రులు, ఆమె మేనమామ, సోదరి ఇతర బంధువులు శుక్రవారం మార్చురీ వద్దకు వచ్చారు. రాజేష్, సౌమ్య మరణానికి గల కారణాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సౌమ్య తల్లిదండ్రులు గురుస్వామి, భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బుధవారం రాత్రి రాజేష్‌రెడ్డి ఫోన్‌లో అతని తల్లితో మాట్లాడాడని, తర్వాతే మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్టు భావిస్తున్నామన్నారు. గురువారం తెల్లవారుజామున సౌమ్య 'వుయ్ ఆర్ కమిటెడ్ సూసైడ్..గుడ్‌బై' అంటూ తన సోదరి గురుప్రియకు వాట్సాప్‌లో మెసేజ్ పంపిందన్నారు. గురుప్రియ గురువారం సాయంత్రం సౌమ్య పంపిన మెసేజ్ చూసిందన్నారు. దీంతో కంగారుపడి వెంటనే ఆరిలోవ పోలీసులకు విషయాన్ని ఫోన్ ద్వారా తెలియజేసిందన్నారు. భార్యాభర్తలిద్దరూ అన్యోన్యంగానే వుండేవారని, ఎలాంటి విభేదాలు లేవన్నారు. వ్యక్తిగత, ఆర్థిక సమస్యలతోనే అఘాయిత్యానికి పాల్పడివుంటారని భావిస్తున్నామన్నారు. సౌమ్య మేనమామ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాజేష్‌రెడ్డి పెళ్లైనప్పటి నుంచి అద్దెకు ఇల్లు తీసుకుని వుండేవాడన్నారు. అతని అన్న శ్రీనివాస్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేస్తున్నాడని, అయితే రాజేష్‌కు ఆస్తి ఇచ్చేందుకు నిరాకరించినట్టు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో వున్నప్పుడు ఆస్తి ఇవ్వకపోగా సహాయం చేయాలని కోరినా నిరాకరించడంతో 2016 మార్చి 31న అతని కుమార్తెను కిడ్నాప్ చేశాడన్నారు. దీనిపై పోలీసులు కేసు పెట్టడంతో రాజేష్ రెండు నెలలపాటు జైలు శిక్ష అనుభవించాడన్నారు. బెయిల్‌పై బయటకువచ్చిన తర్వాత కిడ్నాప్ కేసు ఉపసంహరించుకోవాలని సోదరుడిని ఎన్నోసార్లు వేడుకున్నా ఫలితం లేకపోయిందన్నారు. ఆ కేసు త్వరలోనే విచారణకు వస్తుండడంతో శిక్ష పడితే తిరిగి జైలుకు వెళ్లాల్సి వుంటుందనే ఆందోళన రాజేష్‌రెడ్డిలో పెరిగిపోయిందన్నారు. దీనికితోడు కుటుంబసభ్యుల ఆదరణ కూడా లేకపోవడంతో కొద్దినెలల కిందట విశాఖ వచ్చి ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగిస్తున్నాడన్నారు. ఇప్పటికే తీవ్ర అవమానంతో సమాజంలో తలెత్తుకోలేకపోతున్న రాజేష్ తిరిగి జైలుకు వెళ్లాల్సి వస్తుందనే మానసిక ఒత్తిడికి గురవుతున్నాడని తెలిపారు. ఈ విషయమై ఒకసారి మానసిక వైద్యుడిని కలిసి చికిత్స కూడా పొందినట్టు తెలిపారు. గత నెల 29న తమ సొంత ఊళ్లో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరయ్యాడన్నారు. ఆ సమయంలో తాము కలిసినా ఎలాంటి సమస్యలు చెప్పలేదన్నారు. ఆత్మహత్యకు పాల్పడడానికి ముందురోజు బుధవారం రాత్రి రాజేష్‌రెడ్డి అతని తల్లితో మాట్లాడిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకుని వుంటాడని అనుమానం వ్యక్తంచేశారు. అంతేకానీ భార్యాభర్తల మధ్య ఎలాంటి విభేదాలు లేవని రాజేష్ తన భార్య పిల్లలను బాగానే చూసుకునేవాడని తెలిపారు. కేవలం అతని తల్లిదండ్రులతో పాటు అన్న వేధింపుల కారణంగానే కుటుంబం మొత్తం ఆత్యహత్య చేసుకుందని, దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సౌమ్య లైంగిక వేధింపులు ఎదుర్కొందా?

రాజేష్‌రెడ్డి భార్య సౌమ్య గతంలో లైంగిక వేధింపులు ఎదుర్కొందని, వాటిని తలచుకునే జీవితంపై విరక్తితో తనువు చాలించాలనే నిర్ణయానికి వచ్చిందనే అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. సౌమ్య రాసిన సూసైడ్ నోట్‌లో రాజేష్ జైలుకు వెళ్లినప్పుడు తనను ఎంతోమంది కామాంధులు లైంగికంగా వేధించారని రాసినట్టు ప్రచారం జరుగుతోంది. దీనివల్ల సౌమ్యను ఆమె తల్లిదండ్రులు కూడా అపార్థం చేసుకున్నారని, ఆమెను దూరంపెట్టారని దీనివల్ల ఆమె కూడా మానసికంగా కుంగిపోయినట్టు చెబుతున్నారు. రాజేష్‌పై పెట్టిన కిడ్నాప్ కేసు విచారణకు వస్తుండడం, కేసు ఉపసంహరణకు రాజేష్ సోదరుడు నిరాకరిస్తుండడంతో శిక్ష ఖరారైతే భర్త తిరిగి జైలుకు వెళ్లాల్సి వుంటుందని, అదే జరిగితే తిరిగి లైంగిక వేధింపులతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం వుందనే భయంతోనే రాజేష్, సౌమ్య కలిసి ఈ నిర్ణయం తీసుకుని వుంటారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సంక్షిప్తం


జల్లూరు వంతెన నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే

ఏడాదిలోగా జల్లూరు వంతెన పనులు పూర్తిచేయాలి

కోటవురట్ల: ఏడాది లోగా జల్లూరు వంతెన నిర్మాణ పనులను పూర్తిచేయాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు అన్నారు. శుక్రవారం మండలంలోని జల్లూరు వంతెన నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం చినరాజప్ప, రోడ్లు భవనాల శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొమ్మిది ప్రాజెక్టులను పూర్తిచేసిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. చంద్రబాబు నాయుడు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలు వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. జల్లూరు వంతెన నిర్మాణం కోసం పదేళ్ల నుంచి పోరాటాలు చేశారన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత వెంటనే వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. డిప్యూటీ సీఎం చినరాజప్ప, అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత ప్రసంగించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ లాలం భవానీ, ఆర్‌డీవో సూర్యారావు, యండపల్లి సర్పంచ్ హైమవతి, జల్లూరు సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీ సభ్యులు యోగశ్వరీ, లాలం కాశీనాయుడు పాల్గొన్నారు.


తాండవ స్పిల్‌వే గేట్లను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ శశిభూషణ్‌రావు

పోలవరంతో 1.3 లక్షల ఎకరాలు సస్యశ్యామలం

నాతవరం, జనవరి 5 : పోలవరం కాలువ పనులు పూర్తయితే విశాఖ జిల్లాలో మొదటి దశగా లక్షా 30వేల ఎకరాల భూములకు సాగునీరు అందుతుందని జిల్లా నీటిపారుదలశాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ శశిభూషణరావు అన్నారు. శుక్రవారం ఆయన డీఈఈ రాజేంద్రకుమార్‌తో కలసి తాండవ రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 36కోట్ల రూపాయలతో రైవాడ రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు చేపట్టనున్నామన్నారు. పోలవరం కాలువ ద్వారా విశాఖజిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో గల తొమ్మిది మండలాల్లో లక్షా 30వేల ఎకరాల భూములు సస్యశ్యామలం అవుతాయన్నారు. రెండో దశ పూర్తయితే జిల్లాలో మరొక మూడు లక్షల ఎకరాల భూములకు సాగునీరు అందుతుందన్నారు. తాండవ రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు.

ధర్మసాగరంలో సంక్రాంతి


ధర్మసాగరంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన సీఎం చంద్రబాబునాయుడు


జన్మభూమి సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు


విశాఖ డెయిరీ రైతులకు చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు


విద్యార్థినులతో సీఎం చంద్రబాబు, మంత్రులు అయ్యన్న, చినరాజప్ప

ఆ మూడింటికి నిధులివ్వండి

సీఎంను కోరిన మంత్రి అయ్యన్న


సభలో మాట్లాడుతున్న మంత్రి అయ్యన్న

ధర్మసాగరం(నర్సీపట్నం), జనవరి 5: గత ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హామీల్లో దాదాపు అన్నింటినీ అమలు చేశానని, అయితే మూడు మాత్రం మిగిలి వున్నాయని, వాటిని అమలు చేయడానికి సీఎం చంద్రబాబునాయుడు నిధులు మంజూరు చేయాలని ఆర్అండ్బీ శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు కోరారు. నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణకు రూ.160 కోట్లు అవసరమన్నారు. పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్గ్రేడ్ చేయాలని, నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాలిటీల శివారు ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నర్సీపట్నానికి సీఎం చంద్రబాబు వరాలు

ధర్మసాగరం(నర్సీపట్నం), జనవరి 5: ధర్మసాగరంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు... నర్సీపట్నం, ధర్మసాగరం ప్రాంతాలకు పలు వరాలను ప్రకటించారు. మంత్రి అయ్యన్నపాత్రుడు దంపతులు, ఎంపీ ముత్తంశెట్టి, తదితరుల విజ్ఞప్తి మేరకు మల్కన్గిరి-సబ్బవరం జాతీయ రహదారి, తుని-కొత్తవలస రైల్వే లైన్లను మంజూరు చేయించడమే కాకుండా పనులను సత్వరమే చేపట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు. నర్సీపట్నం మెయిన్రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు



చేస్తామని, పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాల వచ్చే విద్యా సంవత్సరం నుంచి గురుకుల జూనియర్ కళాశాలగా అప్గ్రేడ్ చేస్తామని, నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాలిటీల శివారు ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. నర్సీపట్నంలో ఎస్ఈజడ్ ఏర్పాటు తనకు అంగీకారమేనని, అయితే ఇందుకు రెండు వేల ఎకరాలు అవసరమని, అంత భూమి అందుబాటులో లేకపోతే కనీసం వెయ్యి ఎకరాలు అయినా ఉండేలా చూడాలన్నారు. ధర్మసాగరం గ్రామానికి మంచినీటి పథకం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, శివారు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానన్నారు.


ధర్మసాగరంలో పిల్లలతో...

గ్రామీణ ప్రాంతం అభివృద్ధికి ప్రాజెక్టులు మంజూరుచేయించండి

అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు


సభలో మాట్లాడుతున్న ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాస్

ధర్మసాగరం (నర్సీపట్నం), జనవరి 5: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ఎనలేని కృషిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖ జిల్లాలో గ్రామీణ ప్రాంతం అభివృద్ధిపై ఒకింత ఎక్కువ దృష్టి సారించాలని అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. ధర్మసాగరంలో నిర్వహించిన జన్మభూమి-మాఊరు సభలో ఆయన మాట్లాడుతూ, తుని-కొత్తవలస మధ్య కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకు సర్వే జరుగుతున్నదని, కేంద్రంతో మాట్లాడి, రైల్వే లైన్ మంజూరు చేయిస్తే జిల్లాలో వెనుకబడిన గ్రామీణ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. రాయపూర్-విజయనగరం జాతీయ రహదారిని అనుసంధానం చేస్తూ ఒడిశాలోని సిమిలిగుడ నుంచి పాడువా, అరకు, ఎస్.కోట, కొత్తవలస, పెందుర్తి, చోడవరం, రావికమతం, నర్సీపట్నం, చింతపల్లి మీదుగా మల్కన్గిరి వరకు నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణానికి కూడా ముఖ్యమంత్రి కృషి చేయాలని ఎంపీ కోరారు. నర్సీపట్నంలో ప్రత్యేక ఆర్థిక మండలిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.


సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు


చంద్రన్న బీమా పరిహారం పత్రాన్ని అందజేస్తున్న సీఎం


సీఎంకు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ చైర్పర్సన్ దంపతులు


సీఎంకు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ ప్రవీణ్కుమార్


ముఖ్యమంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న చింతకాయల పద్మావతి


వృద్ధాప్య పింఛన్ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న సీఎం చంద్రబాబు


చిన్నారుల ఎగ్జిబిషన్లో సీఎం


సీఎంకు చిత్రపటాన్ని అందజేస్తున్న విద్యార్థి


జన్మభూమి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మీ మాటలే మాకు స్ఫూర్తి

మంత్రి అయ్యన్న సతీమణి సిహెచ్.పద్మావతి



ధర్మసాగరం (నర్సీపట్నం), జనవరి 5: ధర్మసాగరం పంచాయతీని దత్తత తీసుకుని, పలు అభివృద్ధి పనులు చేయించిన మంత్రి అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి జన్మభూమి గ్రామసభలో చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. సభల్లో, సమావేశాల్లో పాల్గొనేందుకు పెద్దగా ఇష్టపడని ఆమె, ముఖ్యమంత్రి సభలో తొలిసారి పాల్గొని, ఎటువంటి బెరుకు లేకుండా మాట్లాడారు. దేశ భవిష్యత్తుకు గ్రామాల అభివృద్ధి ఎంతో కీలకమని, గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషిచేస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలే తనకు ఆదర్శమన్నారు. ఆయన స్ఫూర్తితోనే తన భర్త అయ్యన్న, తనయులు విజయ్, రాజేష్లతో మాట్లాడి, నలుగురం నాలుగు పంచాయతీను దత్తత తీసుకున్నామన్నారు. తన భర్త ఏ.ఎల్.పురాన్ని, తాను ధర్మసాగరాన్ని, విజయ్ భీమబోయినపాలేన్ని, రాజేష్ మర్రిపాలేన్ని దత్తత తీసుకుని వాటి అభివృద్ధికి కృషిచేస్తున్నామన్నారు. ధర్మసాగరం చేసిన అభివృద్ధిని ఆమె సోదాహరణంగా వివరించారు. ఇంకా చేయాల్సిన పనుల గురించి ప్రస్తావించి, వాటినికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. అనంతరం మాట్లాడిన సీఎం... ఆయా పనులను మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు.


విద్యార్థిని సబ్బవరపు పద్మను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు


వివిధ వేషధారణలతో ఉన్న విద్యార్థులతో ముఖ్యమంత్రి....


జన్మభూమి సభకు హాజరైన మహిళలు

సంక్షిప్తం

రిక్షావాలాకు తీవ్ర గాయాలు



గాయపడిన పెంటారావు

చోడవరంటౌన్, జనవరి 5: పట్టణంలోని కొత్తూరు జంక్షన్ వద్ద గల పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని చందకవీధికి చెందిన రిక్షా కార్మికుడు దేవర పెంటారావు తలకు తీవ్రగాయమైంది. రాత్రి ఎనిమిది గంటల సమయంలో రోడ్డు పక్క నుంచి నడిచి వెళుతుండగా క్వారీ లారీ వెనుక నుంచి ఢీకొనడంతో రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయమైంది. దీంతో స్థానికులు చోడవరం సీహెచ్‌సీకి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యానికి అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి 108లో తరలించారు.

పోలీసుల అదుపులో నకిలీ విలేఖర్లు



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న నకిలీ విలేఖర్లు

ఎస్.రాయవరం, జనవరి 5: మండలంలోని రేవుపోలవరం రేషన్ డిపో వద్దకు వెళ్లి తాము టీవీ ఛానల్ రిపోర్టర్లమని చెప్పి, డీలర్ల నుంచి డబ్బులు గుంజిన ఇద్దరు నకిలీ విలేఖర్లను శుక్రవారం సాయంత్రం ఎస్.రాయవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనకాపల్లికి చెందిన ఆర్.రఘుబాబు, పి.సింహాచలం అనే వ్యక్తులు తాము ఒక ఛానల్ విలేఖర్లమని చెప్పి, ఒక్కొక్కరూ రూ.500 డిమాండ్ చేశారు. దీంతో డీలర్లు ఇద్దరూ రూ.300 చొప్పున వారికి ఇచ్చారు. ఇంతలోనే అనుమానం వచ్చిన సతీష్ అనే డీలర్ విషయాన్ని ఎస్.రాయవరంలోని కొందరు మీడియా ప్రతినిధులు, పోలీసులకు తెలియజేశారు. దీంతో ఏఎస్ఐ మోహన్‌రావు నేతృత్వంలో కానిస్టేబుల్ రాజు, తదితరులు రేవుపోలవరంలో దందా చేస్తున్న నకిలీ విలేఖర్లను పట్టుకొన్నారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

సౌత్ ఆసియాకు ఇండియన్ కోస్ట్‌గార్డు నౌక

విశాఖపట్నం, జనవరి 5: ఇండియన్ కోస్ట్‌గార్డు నౌక శౌనక్ ఆఫ్‌షోర్ పెట్రోల్ వెజల్ సౌత్ ఆసియాకు బయల్దేరింది. టి.శశికుమార్ కమాండ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న 105 మీటర్ల పొడవుగల ఈ నౌక ఈనెల రెండున విశాఖపట్నం నుంచి బయల్దేరింది. శుక్రవారం నాటికి పోర్టు బ్లెయర్ చేరుకుంది. అక్కడ నుంచి బంగ్లాదేశ్, మయన్మార్, థాయిల్యాండ్, మలేషియాలను సందర్శిస్తూ సౌత్ ఆసియా చేరుతుంది.

పెన్షన్ పెంచుతామంటూ దగా

80 ఏళ్ల వృద్ధురాలిని మోసగించిన మాజీ సర్పంచ్
బ్యాంకు విత్‌డ్రా ఫారాలపై వేలిముద్రలు
బ్యాంకు ఖాతా నుంచి రూ.49 వేలు విత్‌డ్రా
పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం




బ్యాంకు పాస్‌బుక్‌లో నమోదైన దృశ్యం

అచ్యుతాపురం జనవరి 5: ప్రతి నెల వచ్చే వెయ్యి రూపాయల పెన్షన్‌ని రూ.1500లకు పెంచుతానని నమ్మించి, 80 ఏళ్ల వృద్ధురాలి నుంచి రూ.49 వేలు కాజేసిన మాజీ సర్పంచ్ ఉదంతం ఇది. ఈ సంఘటన అచ్యుతాపురం మండలం గురజాపాలెంలో జరిగింది. దీనికి సంబంధించి ఎస్ఐ దీనబంధు అందించిన వివరాలిలా ఉన్నాయి.

గురజాపాలెంకి చెందిన రాజాన చిన్నమ్మి(80) ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) నిర్వాసితురాలు. వీరి కుటుంబానికి రావలసిన పరిహారం గతంలో ఇచ్చేశారు. అంతేకాకుండా ఆమె భర్త మృతి చెందడంతో వెయ్యి రూపాయల వితంతు పింఛన్ వస్తున్నది. అయితే వితంతువులు, మేజర్లకు ఇళ్లస్థలాలతోపాటు పరిహారం కూడా ఇవ్వాలని నిర్వాసితులు ఆందోళన చేయడంతో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చొరవతో వారికి గృహనిర్మాణానికి ఐదు సెంట్ల భూమి, గృహనిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. తెలుగుదేశం ప్రభుత్వం పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో పరిహారాన్ని ఏపీఐఐసీ అధికారులు లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలోనే వేస్తున్నారు. ఈనేపథ్యంలో చిన్నమ్మి బ్యాంక్ ఖాతాకు గత నెల 28న రూ.74,200 ఏపీఐఐసీ నుంచి బదిలీ అయ్యాయి. నిరక్షరాస్యులు, వృద్ధురాలైన చిన్నమ్మికి ఈ విషయం తెలియదు. కానీ మాజీ సర్పంచ్ లాలం ప్రసాద్ ఈ వివరాలను ముందుగానే సేకరించాడు. ఇదిలాఉండగా వికలాంగులకు పరీక్షలు నిర్వహించి, పెన్షన్‌లు మంజూరు చేద్దామనే ఉద్దేశంతో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం అచ్యుతాపురంలోని ప్రశాంతి పాలిటెక్నిక్‌లో సదరం క్యాంపుని ఏర్పాటు చేశారు. దీనిని గురజాపాలెం మాజీ సర్పంచ్ లాలం ప్రసాద్ చక్కగా వినియోగించుకున్నాడు. ఇంతవరకు వెయ్యి రూపాయల పెన్షన్ వస్తున్న చిన్నమ్మికి రూ.1500 చేయడానికి అచ్యుతాపురంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మెడికల్ శిబిరం ఏర్పాటు చేశారని, నీకు బాగా వయసు అయిపోయిందున వైద్య పరీక్షలు చేస్తే నెలకు రూ.500 అదనంగా పెన్షన్ వస్తుందని నమ్మబలికాడు. తన బంధువు కూడా కావడంతో చిన్నమ్మి మాజీ సర్పంచ్ ప్రసాద్‌ను నమ్మి ఆటోలో అచ్యుతాపురం వచ్చింది. వైద్యపరీక్షలు నిర్వహించాలంటే వేలిముద్రలు కావాలని కొన్ని కాగితాలపై వేలిముద్రలు వేయించుకున్నారు. దీంతోపాటు బ్యాంక్ విత్‌డ్రా ఫారాలపై కూడా వేలిముద్రలు వేయించుకొన్నాడు. తర్వాత బ్యాంక్‌కి వెళ్లి రూ.49 వేలు డ్రా చేశాడు. ఇంటికి వెళ్లిన తర్వాత కొడుకు చిన్నోడు, మనవడు రమేష్ కలిసి ఎక్కడికి వెళ్లావంటూ చిన్నమ్మిని అడిగారు. దీంతో జరిగిన విషయం వారికి చెప్పింది. ఎన్నడూ లేనిది ప్రసాద్ తీసుకువెళ్లడమేమిటని వారికి అనుమానం వచ్చి ఆరా తీశారు. ఎందుకైన మంచిదని బ్యాంక్‌కి వెళ్లి విచారణ జరిపారు. రూ.74 వేలు ఇమ్మని మాజీ సర్పంచ్ ప్రసాద్ వృద్ధురాలికి తీసుకు వచ్చాడని, అయితే రూ.50 వేలు దాటితే పాన్‌కార్డు కావాలని చెప్పడంతో రూ.49 వేలు మాత్రమే ఇచ్చామని బ్యాంకు అధికారులు తెలిపారు. దీంతో మాజీ సర్పంచ్ ప్రసాద్ తమను మోసం చేశాడని తెలుసుకొని శుక్రవారం ఫిర్యాదు చేశారని ఎస్ఐ దీనబంధు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



బైక్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన అప్పలనాయుడు

రాంబిల్లి, జనవరి 5: మండలంలోని కొత్తూరు ఎస్సీ కాలనీ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కె.అప్పలనాయుడు అనే వృద్ధుడు మృతి చెందాడు. స్థానిక హెచ్‌సీ వై.తాతయ్యలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తూరు గ్రామానికి చెందిన కె.అప్పలనాయుడు(61) గురువారం సాయంత్రం ఏడు గంటలు ప్రాంతంలో మామిడివాడ నుంచి తన గ్రామమైన కొత్తూరు వస్తుండగా ఎలమంచిలి నుంచి అచ్యుతాపురం వైపు వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో అప్పలనాయుడుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడి కుటుంబీకులు అప్పలనాయుడును ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, వైద్యచికిత్సలు చేయించి, స్వగ్రామమైన కొత్తూరు తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో అప్పలనాయుడు మృతి చెందాడని హెచ్‌సీ తాతయ్యలు తెలిపారు. అప్పలనాయుడుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారన్నారు. ఆడపిల్లలకు వివాహాలు జరిగాయన్నారు. ఇతని అల్లుడు ఎం. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తాతయ్యలు తెలిపారు.

ఎంత పెద్ద పామో!



గిరిజనులు హతమార్చిన పాములు

చింతపాక (దేవరాపల్లి), జనవరి 5: అనంతగిరి మండలం చింతపాక గ్రామంలో గిరిజన యువకులు శుక్రవారం భారీ నల్లతాచు, నాగజెర్రిలను హతమార్చారు. దేవరాపల్లి సమీపంలో గల పినకోట పంచాయతీ చింతపాక ఎయిడెడ్ పాఠశాల వద్ద నల్లతాచు, నాగజెర్రిలను యువకులు గుర్తించారు.

పదకొండు అడుగుల పొడవు గల నల్లతాచును, ఏడడుగులు వున్న నాగజెర్రిని హతమార్చారు. పాఠశాల సమీపంలో వున్న అంత పెద్ద పాముల వద్దకు పిల్లలు వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. ఉపాధ్యాయుడు వుండడం వల్ల పిల్లలు అటువైపు వెళ్లలేదని.. లేకుంటే అక్కడే ఆడుకుంటారని విద్యార్థుల తల్లిదండ్రులు విలేకరులకు తెలిపారు.

రౌడీషీటర్ హత్య కేసులో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు

క్షణికావేశంతో జీవితాలు నాశనం



విలేకర్లతో మాట్లాడుతున్న ఏసీపీ రామమోహనరావు

గాజువాక/గాజువాక టౌన్, జనవరి 5: క్షణికావేశం ఉన్నత చదువులు చదువుకున్న కొందరు జీవితాలను నాశనం చేసింది. ఒక రౌడీషీటర్ హత్య కేసులో నిందితులుగా మార్చింది. విశాఖ నగర పరిధిలోని అక్కిరెడ్డిపాలెంలో గత వారం జరిగిన రౌడీషీటర్ షేక్ కుమార్ హత్య కేసులో ఏడుగురిని గాజువాక పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి స్టేషన్‌లో శుక్రవారం జరిగిన విలేఖరుల సమావేశంలో సౌత్ ఏసీపీ రామమోహనరావు హత్యకు సంబంధించి వివరాలను వెల్లడించారు. డిసెంబర్ 31న అర్ధరాత్రి పెదఅక్కిరెడ్డిపాలెం మల్లమ్మ పేరంటాలు మండపం వద్ద రౌడీషీటర్ షేక్ కుమార్ తన స్నేహితులతో కలిసి మద్యం తాగాడు. అనంతరం తన వాహనాన్ని ఇచ్చి మిత్రుడు ఉదయ్‌ను ఇంటి వద్ద దింపి రమ్మని మణికంఠను పంపాడు. బైక్‌పై వేగంగా వెళుతుండడంతో అక్కిరెడ్డిపాలెం రామాలయం వద్ద కొంతమంది యువకులు అంత వేగం సరికాదని వారించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. ఈ క్రమంలో బైక్‌పై వున్నవారు షేక్‌కుమార్ పేరు చెప్పడంతో...యువకులు అతను వున్న మండపం ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ఇరువర్గాలు కొట్లాటకు దిగాయి. ఈ క్రమంలో షేక్‌కుమార్‌ను తీవ్రంగా కొట్టి, ఆపై తోసేయడంతో మొనదేలిన రాయి అతని తలకు తగిలింది. తీవ్రరక్తస్రావం కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి షేక్ గోవిందమ్మ ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి అక్కిరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన కె.సురేష్, వై.సునీల్‌కుమార్ (బీటెక్), వై.రాజ్‌కుమార్ (బీటెక్), కె.హరినాథ్, బి.ప్రదీప్, బి.శ్రీకాంత్, కె.నూకరాజులను అరెస్ట్ చేశారు. సీఐ ఇమ్మాన్యుయేల్‌రాజు పర్యవేక్షణలో ఎస్సైలు అప్పలరాజు, శ్రీనివాసరావు, భాస్కరరావు కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించారు.

ఖాకీ మార్కు బిజినెస్!

- పదవీ విరమణకు కాస్త ముందు జిల్లాలో ఏసీబీకి దొరికిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్
- ఇప్పుడు రౌడీలతో చెట్టపట్టాల్
- గ్రూపులన్నింటినీ ఒక తాటిపైకి తెచ్చి డాన్‌లా వ్యవహరించాలని ప్లాన్

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

అతనో పోలీస్ అధికారి. కొద్దినెలల్లో పదవీ విరమణ చేస్తాడనగా అడ్డంగా ఏసీబీకి దొరికిపోయాడు. రాజభోగాలతో జరగాల్సిన ముగింపు వీడ్కోలు...చడీచప్పుడు లేకుండా అయిపోయింది. ప్రస్తుతం బిజినెస్‌మన్‌గా సరికొత్త అవతారమెత్తాడు. నగరంలో జెండా పాతడమే టార్గెట్ అంటూ ముందుకు అడుగేస్తున్నాడు. మహేష్‌బాబు బిజినెస్‌మన్ నమూనాను మక్కీకి మక్కీ అమలు చేయడానికి యత్నిస్తున్న ఆ మాజీ పోలీస్ అధికారి ఇప్పుడు పోలీస్ ఉన్నతాధికారుల దృష్టిలోకీ వెళ్లాడు.

స్మార్ట్ సిటీ...ఫ్రెండ్లీ సిటీ...పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన విశాఖ ప్రశాంతతకు మారుపేరు. రాష్ట్ర విభజన అనంతరం విశాఖ ప్రాధాన్యం మరింతగా పెరిగింది. పెరుగుతున్న నగరంతో పాటే భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. విద్య, వ్యాపార, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతుండడంతో అందరి దృష్టి ఇప్పుడు స్మార్ట్‌సిటీపైనే. భలే మంచి సమయం...మించిన రాదులే అనుకున్నాడో ఏమో కానీ, ఆ విశ్రాంత పోలీస్ అధికారి తన ఆలోచనలకు పదునుపెట్టాడు. ఉద్యోగంలో వుండగానే భారీగా వెనకేసుకున్న సదరు అధికారి తన సామ్రాజ్యాన్ని మరింత విస్తరించాలని ప్లాన్ వేశాడు. పైసా ఖర్చు పెట్టకుండా నగరంలో ఖరీదైన భూములను, ఇళ్లను చేజిక్కించుకోవాలన్న పన్నాగంతో ముందుకు కదిలాడు.

ఈ బిజినెస్‌మన్ యాక్షన్ ప్లాన్ తెలుసుకోవాలంటే ముందుగా సిట్ విచారణ గురించి కొంచెం తెలుసుకోవాలి. విశాఖలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములు, భూ రికార్డుల తారుమారు వ్యవహారాలపై విచారణ చేస్తున్న సిట్ అధికారులు మాన్సాస్ ట్రస్టు భూములు అన్యాక్రాంతమయ్యాయన్న సమాచారం మేరకు ఎలమంచిలి వెళ్లారు. అయితే రికార్డుల్లో పేరు నమోదైన వ్యక్తికి అసలు మాన్సాస్ అంటే కూడా తెలియదని నిర్ధారణ కావడంతో వెనుతిరిగారు సిట్ బృందం వెనక్కు మళ్లిన కొద్దికాలానికే సదరు విశ్రాంత సీఐ, ఓ రౌడీషీటరుతో కలసి సిట్ విచారించిన వ్యక్తి వద్దకు వెళ్లాడు. తాము పోలీసులమని, విచారణలో భాగంగా కొన్ని సంతకాలు కావాలని చెప్పి సదరు వ్యక్తి వద్ద సంతకాలు తీసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సిట్ వెంటనే కదిలింది. ఉన్నతాధికారుల సూచన మేరకు బాధితుడిని తీసుకుని వెళ్లి ఎలమంచిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించింది. అయితే సదరు స్టేషన్ ఎస్‌ఐ కేసు నమోదు చేయడానికి మొదట నిరాకరించినట్టు తెలిసింది. అయితే జిల్లా పోలీస్ ఉన్నతాధికారితో నగర పోలీస్ ఉన్నతాధికారి మాట్లాడిన తరువాత తప్పనిసరి పరిస్థితులలో సదరు ఎస్‌ఐ కేసు నమోదు చేశారని విశ్వసనీయ వర్గాల కథనం.

ఇదిలావుండగా విశాఖ నగరంలో రౌడీలు రెండు ముఠాలుగా చీలిపోయి వున్నారు. ఈ రెండు ముఠాలకూ మధ్య ఎంతోకాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. ఒకటి అల్లిపురం బ్యాచ్‌గానూ, మరొకటి కైలాసపురం బ్యాచ్‌గానూ చీకటి సామ్రాజ్యంలో పేరుపొందాయి. ప్రస్తుతం ఒక వర్గానికి చెందిన ఇద్దరు రౌడీషీటర్లు పీడీ యాక్టు కింద కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నారు. మరో వర్గంలోని గ్యాంగ్ లీడర్ అనదగ్గ వ్యక్తి ఏడాది క్రితం జైలులోనే ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. అదే వర్గంలో తరువాత నాయకత్వ స్థానంలో వున్న వ్యక్తితో సదరు విశ్రాంత సీఐరహస్యంగా సమావేశమయ్యాడు. పగలు, ప్రతీకారాలు పెట్టుకుని ఏం సాధిస్తారు? నా వెంట ఉండి, నేను చెప్పినట్టు చేస్తే...మీ జీవితాలు ఆనందమయమవుతాయంటూ చెప్పాడు. పోలీస్ అధికారిగా పని చేసిన వ్యక్తి తోడుంటే కొండంత అండ అనుకున్న సదరు రౌడీషీటర్ వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. ఒక గ్రూపు సరేనంది. మరో గ్రూపును కూడా దారిలోకి తెచ్చుకుంటే డాన్ అవ్వచ్చుననుకున్నాడో ఏమో వెంటనే సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న రౌడీషీటర్లను కలిసి మాట్లాడినట్టు తెలిసింది. ఎంతోకాలంగా కారాలూ, మిరియాలూ నూరుకుంటున్న రెండు గ్యాంగ్‌లనూ ఏకం చేసే ప్రయత్నాలు దాదాపుగా ఫలించాయని సమాచారం.

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'కి అందిన సమాచారం నిర్ధారణ చేసుకోవడం కష్టసాధ్యమైన పనిగా మారింది. దీంతో ఈ సమాచారం పోలీస్ ఉన్నతాధికారులకు తెలుసా? లేదా? అన్న దిశగా 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' తన పరిశోధనను సాగించింది.ఒక ఉన్నతాధికారి వద్ద ఇదే విషయాన్ని ప్రస్తావించింది. ఆయన పరోక్షంగా మొత్తం విషయాన్ని నిర్ధారించడంతో సదరు విశ్రాంత పోలీస్ అధికారి తీరును బహిరంగ పరచడంతో పాటు నగర పౌరులూ బాధ్యతాయుతంగా అవసరమైతే ఫిర్యాదు చేసి బరిలో నిలబడాలన్న విజ్ఞప్తినీ ఇవ్వడమే సామాజిక బాధ్యతగా భావించింది.



నిర్మాణంలో ఉన్న యాగశాల

నృసింహ దీక్షల విరమణకు ముమ్మర ఏర్పాట్లు

సింహాచలం, జనవరి 5 : వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రారంభించిన నృసింహ దీక్షలను ఈ నెల 8వ తేదీన దీక్షాపరులువిరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా సింహాచల దేవస్థానం అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా దీక్షల ముగింపును పురస్కరించుకుని భక్తుల నుంచి తిరుముడులను స్వీకరించేందుకు ప్రత్యేక వైదిక సిబ్బందిని నియమించారు. దీక్షల ముగింపు సందర్భంగా ముందుగా ప్రకటించిన విధంగా ప్రత్యేక హోమం నిర్వహించేందుకు ఆలయ ఉత్తర రాజగోపురం ఎదు రుగా ఉన్న సువిశాల ఖాళీ స్థలంలో తాటి ఆకు లతో ఆగమశాస్త్ర విధానంలో యాగశాల నిర్మాణాన్ని చేపట్టారు. భక్తుల కోసం క్యూల ఏర్పా టు చేశారు. దీక్షల ముగుంపు చేసిన భక్తులను తిరుముడలతో సహా అప్పన్నస్వామి దర్శనానికి ఈనెల 8వ తేదీ ఉదయం అంతరాలయంలోకి అనుమతిస్తారు.తిరుముడుల సమర్పణ, విశేష నృసింహ హోమం,పూర్ణాహుతి అనంతరం ఉద యం 10:30 గంటలకు ప్రత్యేక వేదికపై శాంతి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి రామచంద్రమోహన్ ప్రకటించారు.

డైట్ ఉత్సవ్ అదిరింది

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

అనకాపల్లి టౌన్, జనవరి 5 : పట్టణంలోని డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన డైట్ ఉత్సవ్ - 2018 ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని ఏపీ ఇన్నోవేటివ్ టెక్నాలజీస్ సీఈఓ, ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ వైస్ చైర్‌పర్సన్, ప్రొఫెసర్ డాక్టర్‌వి.వల్లికుమారి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోని విద్యార్థులు తమకున్న పరిజ్ఞానాన్ని విదేశీయుల పాలు కాకుండా చూడాలన్నారు.దేశీయ పరిజ్ఞానాన్ని మన దేశానికే పరిమితం చేయాలని సూచించారు. దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ (ఇన్‌చార్జి) ప్రొఫెసర్ వి. కేశవరావు మాట్లాడుతూ విద్యార్థులు అంబాని అవుదామని కల కనడం తప్పులేదు గాని ఆ కలలు సాకారం చేసుకునే పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ కళాశాల స్థాపించి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ ఉత్సవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. కళాశాలలో కేము సాఫ్ట్‌వేర్ ప్రారంభించామని, దీని ద్వారా విద్యార్థి గురించి సమగ్రమైన సమాచారం తల్లిదండ్రులకు అందుతుందన్నారు. అలాగే తమ కళాశాలకు నాక్ గుర్తింపు లభించిందన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ కె. అమరేంద్ర మాట్లాడుతూ కాలేజీ స్థాపించిన దగ్గర నుంచి నేటి వరకు జరిగిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవ్‌ను ప్రారంభించిన కుమారి



నృత్యం చేస్తున్న విద్యార్థిని



ఉత్సవ్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

సంక్షిప్త వార్తలు



అధికారులను నిలదీస్తున్న వైసీపీ సభ్యులు

గుడ్డిపలో టీడీపీ, వైసీపీ వాగ్వాదం

గుడ్డిప (రావికమతం), జనవరి 5 : మండలంలోని గుడ్డిప గ్రామంలో జరి గిన జన్మభూమి సభలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం నెలకొంది. సభ ప్రారంభంకాగానే వైసీపీ నాయకుడు,మాజీ సర్పంచ్ అడ్డూరి సత్యారావు తదితరులు గత జన్మభూమిలో ఇచ్చిన ఆర్జీలపై అధికారులను ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో నిర్వహించిన రచ్చబండలో ఇచ్చిన ఆర్జీలు పరిష్కారం కాకపోతే తాము సభను అడ్డుకున్నామా అంటూ జన్మభూమి కమిటీ సభ్యుడు గల్లా సత్యారావు ఎదురుతిరిగారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో తహసీల్దార్ సిద్ధయ్య కల్పించుకుని సభ సజావుగా జరిగేలా సహకరించాలని కోరడంతో ఇరువర్గాల నాయకులు శాంతించారు.

ప్రసూతి మరణాలు నియంత్రించండి

విశాఖపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జరుగుతున్న ప్రసూతి మరణాలపై వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. శుక్రవారం విమ్స్‌లో ఉన్నతాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న శిశు మరణాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రసూతి శిశువుల మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న శిశు మరణాల సమాచారాన్ని క్రోఢీకరించి దానికి గల కారణాలను, నివారణ చర్యలను తీసుకోవాలని లైఫ్‌లైన్ సెల్ అధికారులకు ఆమె సూచించారు. ప్రసవాలు ఆసుపత్రుల్లోనే జరిగేలా చూడాలని, అందుకు ఏం చేయాలన్నది ఆలోచించాలని చెప్పారు.



సాగర్‌నగర్ తీరంలో కళేబరం

తీరంలో ముళ్లకప్ప కళేబరం

సాగర్‌నగర్, జనవరి 5: సాగర్‌నగర్ తీరానికి శుక్రవారం ముళ్లకప్ప కళేబరం కొట్టుకువచ్చింది. సముద్ర జీవరాశులలో అరుదైన జీవిగాముళ్లకప్పకు పేరు వుంది. ఈ కప్పకు ఒళ్లంతా ముళ్లు వుంటాయి. ఈ ముళ్లు గుచ్చుకుంటే జెర్రికుట్టినట్టు బాధ కలుగుతుంది. ఈ ముళ్ల సాయంతోనే సముద్ర జలాల్లో వాటిని అవి రక్షించుకుంటూ వుంటాయి.

సామవేదంలో 'సామ' అనే పదానికి సరైన అర్థం?

ప్రాచీన భారతదేశ చరిత్ర

1. ఆర్యులు భారతదేశంలో స్థిరపడిన సంవత్సరం?
ఎ) క్రీ.పూ.2000 బి) క్రీ.పూ.1750
సి) క్రీ.పూ.1500 డి) క్రీ.పూ.1000

2. ఆర్యులు భారతదేశంలో నివసించిన తొలి ప్రాంతానికి గల పేరు?
ఎ) గంగా యమున అంతర్వేది బి) ఎగువ సింధు
సి) హిమాలయాలు డి) సప్తసింధు

3. ఆర్యులు స్థానికంగా నివాసం ఏర్పర్చుకొన్న సింధు ప్రజలను ఏ పేరుతో వ్యవహరించేవారు?
ఎ) ద్రవిడులు బి) దస్యులు
సి) పాణీలు డి) దేశీయులు

4. ఆర్యులు ఆగమనం, వారి స్వస్థలాలకు సంబంధించి, రచయితల అభిప్రాయంలో సరైనది?
ఎ) ఆర్యులు జన్మస్థలం యురేషియా - మాక్స్‌ముల్లర్
బి) ఆర్యుల తొలి నివాసం పర్షియా - రోడ్స్
సి) ఆర్యులు టిబెట్ ప్రాంతవాసులు - దయానంద సరస్వతి డి) పైవన్నీ

5. ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వలసవచ్చారని పేర్కొంటూ 'ద ఆర్కిటిక్ హోమ్ ఆఫ్ ఆర్యన్స్' గ్రంథాన్ని రచించింది?
ఎ) లాసెన్ బి) బాలగంగాధర్ తిలక్
సి) రాజారామ్మోహన్‌రాయ్ డి) ఎవరూ కాదు

6. ఆర్యుల గురించి, వారి ఇష్ట దైవాల గురించి తెలిపే భోగజ్‌కోయి శాసనాన్ని ఎక్కడ కనుగొన్నారు?
ఎ) టర్కీ బి) ఇరాన్ సి) ఇండోనేషియా డి) చైనా

7. ఆర్య సంస్కృతికి ప్రతీకమైన వేదాలను 'అపౌరుషేయాలు' అనడానికి కారణం?
ఎ) ప్రపంచంలో తొలి మత గ్రంథాలు కావడం
బి) వీటిని మానవులు సృష్టించలేదు
సి) ప్రాచీన కాలానికి చెంది ఉండటం డి) పైవన్నీ

8. కర్మ, భక్తి, యోగ, జ్ఞాన మార్గాలను గురించిన చర్చలు ఉన్న వేద భాగం?
ఎ) అరణ్యకాలు బి) బ్రాహ్మణాలు
సి) ఉపనిషత్తులు డి) ఏవీకావు

9. భారత ఆధ్యాత్మిక చింతనకు మూలాధారాలు?
ఎ) ఉపనిషత్తులు బి) అరణ్యకాలు
సి) ఉపవేదాలు డి) బ్రాహ్మణాలు

10. ప్రపంచంలో అతి ప్రాచీన గ్రంథం?
ఎ) రుగ్వేదం బి) జెండ్ అవెస్తా
సి) ఓల్డ్ టెస్ట్‌మెంట్ డి) పంచ్‌జంగ్

11. రుగ్వేదానికి సంబంధించి కింది వాటిలో వాస్తవాన్ని గుర్తించండి?
ఎ) రుగ్వేదంలో మండలాలు 10
బి) రుగ్వేదంలో శ్లోకాలు 1028
సి) రుగ్వేదంలో 1028 సార్లు ప్రయోగించిన పదం 'ఓం'
డి) పైవన్నీ

12. పురుష సూక్తంలో చాతుర్వర్ణ వ్యవస్థను ప్రస్తావించిన వేదం?
ఎ) రుగ్వేదం బి) సామవేదం
సి) యజుర్వేదం డి) అధర్వణవేదం

13. రుగ్వేదంలో ప్రస్తావించిన జంతువు, ముఖ్యనదిని పేర్కొనండి?
ఎ) ఆవు - గంగానది బి) ఏనుగు - సింధునది
సి) పులి - గంగానది డి) సింహం - సరస్వతి

14. ఆంధ్రుల ప్రస్తావన ఉన్న ఐతరేయ బ్రాహ్మణం ఏ వేదంలో ఉంది?
ఎ) రుగ్వేదం బి) సామవేదం
సి) యజుర్వేదం డి) అధర్వణవేదం

15. సామవేదంలో 'సామ' అనే పదానికి సరైన అర్థం?
ఎ) సంగీతం బి) మధురం సి) గీతం డి) శ్రావ్యం

16. బ్రాహ్మణాల్లో పెద్దదైన శతపథ బ్రాహ్మణం ఏ వేదంలో ఉంది?
ఎ) రుగ్వేదం బి) యజుర్వేదం
సి) సామవేదం డి) అధర్వణవేదం

17. 'సత్యమేవ జయతే' అనే వాక్యం ఉన్న మండోక ఉపనిషత్తు ఏ వేదంలో ఉంది?
ఎ) రుగ్వేదం బి) సామవేదం
సి) యజుర్వేదం డి) అధర్వణవేదం

18. కింది వాటిలో అధర్వణవేదానికి సంబంధించి వాస్తవం ఏది?
ఎ) ఆయుర్వేద వైద్యానికి నిలయం
బి) మంత్రాలు, వశీకరణ శక్తులకు నిలయం
సి) గణిత శాస్త్రానికి నిలయం డి) పైవన్నీ

19. కింది వాటిలో వేదాంగాలు, వాటి అంశాల సరిజత క్రమం.
1. కల్ప ఎ. సక్రమ ఉచ్చారణ
2. శిక్ష బి. సూత్రాలు
3. నిరుక్త సి. స్వర ఉచ్చారణ
4. చందస్సు డి. భాషోత్పత్తి
5. జ్యోతిష్యం ఇ. భవిష్యత్ తరం
ఎ) ఎ, బి, సి, డి, ఇ బి) ఇ, డి, సి, బి, ఎ
సి) బి, ఎ, డి, సి, ఇ డి) ఎ, డి, సి, ఇ, బి

20. కింది వాటిలో ప్రాచీన కాలం నాటి నదులను నూతన పేర్లతో జతపరచండి.
ఎ) అస్కిణి - చీనాబ్ బి) సురౌపి - సరస్వతి
సి) సుతుద్రి - సట్లెజ్ డి) పైవన్నీ

21. ఆర్యుల రాజ్యాలకు గల పేరు?
ఎ) నగర రాజ్యాలు బి) తెగల రాజ్యాలు
సి) ఉన్నత రాజ్యాలు డి) వలస రాజ్యాలు

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ హిస్టరీ

22. ఆర్య తెగల మధ్య జరిగిన చారిత్రక యుద్ధం?
ఎ) దశరాజగణ యుద్ధం బి) తెగ రాజుల యుద్ధం
సి) కురుక్షేత్ర యుద్ధం డి) ఏదీకాదు

23. దశరాజగణ యుద్ధంలో విజయం సాధించిన భరత తెగ పాలకుడు?
ఎ) సుధాముడు బి) శత్రుఘ్నుడు సి) తక్షుడు
డి) భరతుడు

24. ఆర్యుల పరిపాలనలో వివిధ స్థాయులను తెలిపే పాలన క్రమం.
ఎ) గ్రామ - విష్ - కుల - జన
బి) కుల - గ్రామ - విస్ - జన
సి) జన - కుల - విష్ - గ్రామ
డి) విస్ - గ్రామ - కుల - జన

25. ఆర్యుల కాలంలో సభ, సమితుల కర్తవ్యం?
ఎ) పన్నుల వసూళ్లు బి) సలహా సంస్థలు
సి) శాసన సంస్థలు
డి) గ్రామ పాలన సంస్థలు

26. రుగ్వేదం కాలంలో అత్యంత ప్రాముఖ్యం పొందిన ప్రభుత్వ ఉద్యోగి?
ఎ) సేనాని బి) యువరాజు
సి) పురోహితుడు డి) గ్రామణి

27. ఆర్యుల కాలంలో ప్రజాస్వామ్య విధానానికి నిదర్శనంగా నిలిచే లక్షణం?
ఎ) గ్రామ పాలన బి) రాజును ఎన్నుకోవడం
సి) స్త్రీలకు ఉన్నత అవకాశాలు ఇవ్వడం
డి) కుల వ్యవస్థ లేకపోవడం

28. తెగలోని ప్రజలందరికీ సభ్యత్వం కలిగి, రాజన్‌ను ఎన్నుకొనే సంస్థ?
ఎ) సభ బి) సమితి
సి) విధాత డి) గణ

29. రుగ్వేద ఆర్యుల ప్రధాన వృత్తి?
ఎ) వడ్రంగం బి) వ్యవసాయం
సి) పశుపోషణ డి) వాణిజ్యం

30. పశువుల మందల కోసం ఆర్య తెగల మధ్య జరిగే యుద్ధాలు?
ఎ) పాణీలు బి) గోవిష్టులు సి) గవిష్టి డి) గణాలు

31. ఆర్యులకాలంలో పరిపాలన అధికారులు, విధులకు సంబంధించి సరైనది?
ఎ) గూఢచారి - స్పాస బి) రక్షక భటుడు - జీవగృభ
సి) పచ్చిక మైదానాల పర్యవేక్షకుడు - వ్రజపతి
డి) పైవన్నీ

32. ఆర్యుల కాలంలో సోమ, సుర అనేవి?
ఎ) గ్రామసభలు బి) రెవెన్యూ డివిజన్లు
సి) మత్తు పానీయాలు డి) న్యాయస్థానాలు

33. రుగ్వేద ప్రజలు తమ రక్షణ కోసం రాజుకు చెల్లించే పన్ను?
ఎ) బలి బి) భాగ సి) సుల్క డి) పైవన్నీ

34. రుగ్వేద కాల యుద్ధాల్లో తరచూ వాడే పదం 'పుర చరిస్ను' అంటే?
ఎ) పదాతి దళాలు బి) రథాల వరుసలు
సి) అశ్విక దళాలు డి) కదిలే కోటలు

35. ఆర్యుల కాలంలో విశ్వపర, లోపాముద్ర, గార్గి, ఘోష్ అనేవారు?
ఎ) వేద పండితులు బి) మహిళా విద్వాంసులు
సి) మహిళా పాలకులు డి) రాజు బంధువులు

36. ఆర్యులు ఎక్కువగా ధరించే వస్త్రాలు?
ఎ) పట్టు వస్త్రాలు బి) నూలు వస్త్రాలు
సి) ఉన్ని వస్త్రాలు డి) పైవన్నీ

37. ఆర్యుల ఆభరణంగా, ప్రామాణిక ద్రవ్యంగా చెలామణి అయినది?
ఎ) నిష్కం బి) శతమానం సి) కర్షాపణం డి) సువర్ణం

38. ఆర్యులు గుర్రాలను ఎక్కువగా ఏ కార్యక్రమాలకు ఉపయోగించారు?
ఎ) వ్యవసాయం బి) యుద్ధాలు
సి) రథ పందేలు డి) రవాణా

39. ఆర్యులకు సంబంధించి వస, అభివసు, నివి అనేవి దేనికి సంబంధించినవి?
ఎ) వస్త్రాలు బి) ఆహార పదార్థాలు
సి) పన్నులు డి) నాణేలు

40. ఆర్యుల ప్రధాన ఆరాధ్య దైవం?
ఎ) ఇంద్రుడు బి) బ్రహ్మ
సి) మహేశ్వరుడు డి) శ్రీరాముడు

41. రుగ్వేద ఆర్యులు ఇంద్రుడిని ఏ పేరుతో పూజించేవారు?
ఎ) విజయుడు బి) పురంధరుడు
సి) వజ్రాయుధుడు డి) సురరాజు

42. సర్వాంతర్యామిగా, నీతి పాలకుడిగా ఆర్యులు ఏ దేవుడ్ని ఆరాధించారు?
ఎ) ఇంద్రుడు బి) వరుణుడు
సి) ఆశ్విని దేవతలు డి) అగ్ని

43. ఆర్యులు మధ్యవర్తి, పథకృతి అనే పేర్లతో ఆరాధించే దైవం?
ఎ) ఇంద్రుడు బి) వరుణుడు సి) అగ్ని డి) సోముడు

44. నార్డిక్ జాతికి చెందిన ఆర్యులు అనుసరించిన మతాన్ని 'హెనోథియిజం' అంటారు. దాని అర్థం?
ఎ) ప్రకృతి ఆరాధన బి) దేవుడు సర్వాంతర్యామి
సి) అన్ని మతాలు ఒక్కటే
సి) దేవుడు ఒక్కడే, రూపాలు వేరు

45. రాజకీయ అంశాల్లో రుగ్వేద, మలివేద కాలాల మధ్య తేడాల్లో సరైనది.
ఎ) రాజన్ విరాట్, సామ్రాట్ బిరుదులు ధరించారు
బి) సభ, సమితులు ప్రాధాన్యం కోల్పోయాయి
సి) మహిళల స్వేచ్ఛ అడుగంటింది డి) పైవన్నీ

46. పురోహితుడికి వధువును కానుకగా ఇవ్వడాన్ని ఏ వివాహంగా పరిగణిస్తారు?
ఎ) ఆర్ష వివాహం
బి) దైవ వివాహం
సి) బ్రహ్మ వివాహం
డి) ప్రజాపత్య వివాహం


ఎస్.రాజా చక్రధర్
సీనియర్ ఫ్యాకల్టీ

47. వరకట్నం, కన్యాశుల్కం లేకుండా జరిగే వివాహాలను ఆర్యుల కాలంలో ఏమని పిలిచారు?
ఎ) ఆర్ష వివాహం
బి) అసుర వివాహం
సి) ప్రజాపత్య వివాహం
డి) బ్రహ్మ వివాహం

48. భారతదేశంలో క్రీ.పూ. 1000లో ఇనుమును కనుగొన్న ప్రాంతం?
ఎ) గాంధార బి) తక్షశిల సి) వారణాసి డి) గిరివ్రజం

49. మలివేద కాలంలో విధులు నిర్వహించే ఉద్యోగుల్లో సరైనది.
ఎ) సంగ్రాహిత - కోశాధికారి
బి) బాగదఘ - పన్నుల వసూళ్లు
సి) అక్షవహ - జూదగృహ పర్యవేక్షణ డి) పైవన్నీ

50. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే గ్రంథాలు వాటి సంఖ్యను తెలిపే సరైన క్రమం?
ఎ) వేదాలు 4, ఉపవేదాలు 4, ఉపనిషత్తులు 108, పురాణాలు 18
బి) వేదాలు 4, ఉపవేదాలు 5, ఉపనిషత్తులు 100, పురాణాలు 3
సి) వేదాలు 4, ఉపవేదాలు 4, ఉపనిషత్తులు 100, పురాణాలు 21
డి) వేదాలు 4, ఉపవేదాలు 6, ఉపనిషత్తులు 108, పురాణాలు 18

51. పంచమవేదం, జయసంహితగా పేరుపొందిన భారత ఇతిహాస గ్రంథం?
ఎ) రామాయణం బి) మహాభారతం
సి) భాగవతం డి) ఏదీకాదు

52. కురుక్షేత్రంలో కౌరవ పాండవుల మధ్య చారిత్రక యుద్ధం జరిగిన సంవత్సరం?
ఎ) క్రీ.పూ.800 బి) క్రీ.పూ.750
సి) క్రీ.పూ.700 డి) క్రీ.పూ.620

సమాధానాలు

1) సి	12) ఎ	23) ఎ	34) డి	45) డి
2) డి	13) డి	24) బి	35) బి	46) బి
3) బి	14) ఎ	25) సి	36) సి	47) సి
4) డి	15) డి	26) సి	37) ఎ	48) ఎ
5) బి	16) బి	27) బి	38) ఎ	49) డి
6) బి	17) డి	28) బి	39) ఎ	50) ఎ
7) బి	18) డి	29) సి	40) ఎ	51) బి
8) సి	19) సి	30) సి	41) బి	52) బి
9) ఎ	20) డి	31) డి	42) బి	
10) ఎ	21) బి	32) సి	43) సి	
11) డి	22) ఎ	33) ఎ	44) డి	

అడ్మిషన్స్

ఏపీ ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్‌లోని 164 ఆదర్శ పాఠశాలల్లో 2018-19 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2017-18 విద్యా సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు అర్హులు. ఆయా పాఠశాలల్లో 2016-17, 2017-18 సంవత్సరాల్లో నిరవధికంగా చదివి ఉండాలి.

వయసు: 01-09-2016 నుంచి 31-08-2008 మధ్య జన్మించివారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: ప్రవేశ పరీక్ష ద్వారా

ప్రవేశ పరీక్ష తేదీ: 2018 ఏప్రిల్ 8

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తు ప్రారంభం: 2018 జనవరి 16

చివరి తేదీ: 2018 ఫిబ్రవరి 16

వెబ్‌సైట్: http://cse.ap.gov.in/DSE/

మ్యాట్ - ఫిబ్రవరి 2018

దేశవ్యాప్తంగా ఉన్న వివిధ మేనేజ్‌మెంట్ సంస్థలోని ఎంబిఏ, పిజిడిఎం కోర్సుల్లో ప్రవేశానికి ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఎఐఎంఏ) దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా అర్హులే.

ఎంపిక: మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్) ద్వారా

ప్రవేశ పరీక్ష తేదీ:
2018 ఫిబ్రవరి 4 (పేపర్ బేస్డ్ టెస్ట్), 2018 ఫిబ్రవరి 10 (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్)

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

చివరి తేదీ: 2018 జనవరి 26

వెబ్‌సైట్: http://apps.aima.in/matfeb18/

What is myopia?



N. Sunilkumar
Senior Faculty

Sr. Inter PHYSICS

RAY OPTICS

VERY SHORT ANSWER QUESTIONS

1. Define focal length and radius of curvature of a concave lens.

Ans: Focal length of a concave lens is the distance between optical centre and principal focus of the lens.
Radius of curvature of a concave lens is the radius of the sphere from which the lens is cut.

2. What are the laws of reflection through curved mirrors?

Ans: **Laws of reflection:**
1. The angle of reflection is equal to the angle of incidence.
2. The incident ray, reflected ray and the normal to the reflecting surface at the point of incidence lie in the same plane.

3. Define 'power' of a convex lens. What is its unit?

Ans: The power of a convex lens is defined as the tangent of the angle by which a lens converges a beam of light falling at unit distance from the optical centre. It is reciprocal of focal length $P=\frac{1}{f}$

SI unit of power of lens is dioptre (D).

4. What is dispersion? Which composite colour gets relatively more dispersed?

Ans: The phenomenon of splitting of white light into its constituent colours is known as dispersion.
Violet colour is relatively more dispersed.

5. What is myopia? How can it be corrected?

Ans: When the light from a distant object get converged at a point infront of retina then the distant object is not clearly visible. This defect is called myopia or short-sightedness.
Myopia is corrected by using spectacles having divergent lens (concave lens)
(or)
If the image of a distant object is focussed before the retina then it can not be seen clearly. This defect of eye is called myopia.

6. What is hypermetropia? How can it be corrected?


Ans: When the image of near object is formed behind the retina then near objects are not clearly visible. This defect of eye is called hypermetropia. Hypermetropia can be corrected by using spectacles having convergent lens.

SHORT ANSWER QUESTIONS

7. Define critical angle. Explain total internal reflection using a neat diagram.

Ans: The angle of incidence corresponding to an angle of refraction of 90^0 is called critical angle. i.e for a given pair of media.

When light travelling from denser medium towards rarer medium is incident on the interface of two media at an angle greater than critical angle it is totally reflected back into denser medium. This phenomenon is called total internal reflection.



Explanation:

When light ray enters from denser medium to a rarer medium it bends away from normal as shown by the ray AO_1B.

The incident ray AO_1 is partially reflected (O_1C) and partially refracted (O_1B). Here angle of refraction 'r' is greater than angle of incidence (i).


As the angle of incidence increases the angle of refraction also increases and finally bacomes $\frac{\pi}{2}$ as shown for ray AO_3. Here refracted ray AO_3D grazes the interface.

Now, if the angle of incidence is further increased as shown for ray AO_4 the refraction is not possible and the incident ray is totally reflected back into denser medium which is called total internal reflection.


8. With a neat labelled diagram explain the formation of image in a simple microscope.

Ans: A simple microscope is a converging lens of small focal length.

In a simple microscope object is to be kept at a distance less than or equal to focal length of lens and eye is very close to lens. This forms an erect, magnified and virtual image between object and infinity.



When the object is at distance equal to focal length of the lens, the rays from the object after passing through the lens are parallel to each other. Hence image is formed at infinity as shown in figure (a)



When the object is at a distance less than focal length f of the lens, the rays after passing through the lens diverge away. When these diverging rays are produced back they meet between object and infinity i.e. image is formed between object and infinity (generally at near point) as shown in figure (b).


LONG ANSWER QUESTIONS

9. (a) Define snell's law. Using a neat labelled diagram derive an expression for the refractive index of the material of an equilateral prism.
(b) A ray of light, after passing through a medium, meets the surface separating the medium from air at an angle of 45^0 and is just not refracted. What is the refractive index of the medium?

Ans: **Snell's law:** The ratio of sine of angle of incidence (i) to the sine of angle of refraction (r) is a constant. This is called Snell's law.

$\frac{\sin i}{\sin r}=\text{constant}$ or $\frac{\sin i}{\sin r}=\mu_{21}$

Here, n_{21} is refractive index of second medium with respect to first medium which is a constant for a given pair of media and for a given wave length of light.



Expression for refractive index of material of prism:
Consider a triangle prism ABC
Let the angle of incidence and angle of refraction of first face AB are i and r_1
The angle of incidence at second face AC be r_2 and angle of refraction or angle of emergence be e.
Here, The angle between emergent ray RS and direction of incident ray PQ is called angle of deviation δ.
From quadrilateral AQNR
$\lfloor A+\lfloor QNR=180^0$ ...(i) ($\because$ angles at vetices Q and R are right angles)
From triangle QNR, $r_1+r_2+\lfloor QNR=180^0$ ...(ii)
from Eq. (i) and (ii), $r_1+r_2=A$ ...(iii)
As total deviation δ is external angle in triangle QMR
$\delta=(i-r_1)+(e-r_2)$
$\delta=i+e-A$ ...(iv)
From Eq.(iv) it is clear that angle of deviation depends upon angle of incidence.
From the graph between angle of incidence (i) and angle of deviation (δ) as shown in figure except for $i=e$ the ray will have same deviation for two values of i and e
At minimum deviation D_m the refracted ray inside the prism is parallel to base BC.
When $\delta=D_m$ we have $i=e$ and $r_1=r_2$

$\therefore$ from Eq. (iii) $2r=A$ or $r=\frac{A}{2}$

from Eq. (iv) $D_m=2i-A$ or $i=\frac{A+D_m}{2}$

The refractive index of prism material with respect to surroundings is

$$\mu_{21}=\frac{\mu_2}{\mu_1}=\frac{\sin i}{\sin r}=\frac{\sin\left(\frac{A+D_m}{2}\right)}{\sin\left(\frac{A}{2}\right)}$$

$$\therefore \mu_{21}=\frac{\sin\left(\frac{A+D_m}{2}\right)}{\sin\left(\frac{A}{2}\right)}$$


(b) Angle of incidence $i=45^0$
angle of refraction $r=90^0$
refractive index $n=?$
As the ray of light is travelling from denser towards rarer (air) medium

$$\mu=\frac{\sin r}{\sin i}=\frac{\sin 90^0}{\sin 45^0}=\frac{1}{\left(\frac{1}{\sqrt{2}}\right)}=\sqrt{2}=1.414$$

10. (a) Using a neat labelled diagram derive the mirror equation. Define linear magnification.
(b) An object is placd at 5cm from a convex lens of focal length 15cm. What is the position and nature of the image?

Ans. Mirror equation is the relation between object distance (u) image distance (v) and focal length (f)

$$\frac{1}{v}+\frac{1}{u}=\frac{1}{f}$$



Derivation: Consider a concave mirror MPN of focal length f
Let an object AB is kept on the principal axis at a distance 'u' from the pole 'P' of the mirror. Consider three rays from A as shown in figure.
The ray AM parallel to principal axis after reflection passes through focus F.
The ray ACN passing through centre of curvature retraces its path after reflection.
The ray AP incident at pole 'P' is reflected back following the laws of reflection.
Now the point A' where all these rays meet is in the image of point 'A'. In the same way the image of point B is at B'.
Here for the object AB image $A'B'$ is formed at a distance v from the pole.
For paraxial rays MP is almost a straight line perpendicular to CP.
From similar triangles $A'B'F$ and MPF

$\frac{B'A'}{PM}=\frac{B'F}{FP}$ or $\frac{B'A'}{BA}=\frac{B'F}{FP}$ $(\because PM=AB)$ ...(i)

Also as $\lfloor APB=\lfloor A'PB'$ the triangles $A'B'P$ and ABP are also similar.

$\therefore \frac{B'A'}{BA}=\frac{B'P}{BP}$ ....(ii)

From Eq.(i) and (ii)

$\frac{B'F}{FP}=\frac{B'P}{BP}$ ....(iii)

But $B'F=B'P-FP$

$\therefore$ Eq. (iii) becomes. $\frac{B'P-FP}{FP}=\frac{B'P}{BP}$

Now taking the cartesian sign convention

$B'P=-v, FP=-f$ and $BP=-u$

$\frac{-v-(-f)}{-f}=\frac{-v}{-u}$ or $\frac{v}{f}-1=\frac{v}{u}$

$\frac{v}{f}=1+\frac{v}{u}$ $\therefore \frac{1}{f}=\frac{1}{v}+\frac{1}{u}$

This relation is mirror equation.

Linear magnification: Linear magnification is defined as the ratio of height of the image to height of the object.

$m=\frac{h'}{h}=-\frac{v}{u}$

(b) Object distance $u=-5cm$
focal length $f=15cm$
image distance $v=?$

from lens formula, $\frac{1}{v}-\frac{1}{u}=\frac{1}{f}$

$\frac{1}{v}+\frac{1}{5}=\frac{1}{15}$

$\frac{1}{v}=\frac{1}{15}-\frac{1}{5}=\frac{1-3}{15}=\frac{-2}{15}$ $\therefore v=-7.5cm$

Image is virtual.

వైభవంగా అశ్వవాహనంపై వెంకన్న తిరువీధి

ఉపమాక(నక్కపల్లి), జనవరి 5 : మండలంలోని ఉపమాక క్షేత్రంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా వెంకటేశ్వరస్వామి తిరువీధి సేవలు ప్రతీ రోజూ ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామివారి తిరువీధి సేవ అశ్వ వాహనంపై వైభవోపేతంగా జరిగింది. శ్రీదేవి,భూదేవి సమేత వెంకటేశ్వరస్వామివారు పట్టుపీతాంబరాలతో మాఢవీధుల్లో దర్శనమివ్వగా, పల్లకీలో గోదాదేవి అమ్మవారు ఊరేగారు. తొలుత ఆలయంలో ప్రధానార్చకుడు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, అర్చకుడు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు పూజా కార్యక్రమాలు, నిత్యహోమాలు, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. తిరువీధి సేవ అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. అనంతరం రాత్రి ఆంజనేయవాహనంపై అధ్యయనోత్సవాల్లో భాగంగా తిరువీధి సేవ జరిగింది. అర్చకులు రంగ,గోపాలాచార్యులు,ఆలయ విజిలెన్స్ అధికారి రాజశేఖర్, శ్రీనివాసా సేవా సమితి ప్రతినిధులు కొప్పిసెట్టి సత్యనారాయణ,మీగడ ఈశ్వరరావు, చెరకూరి వెంకటేశ్వరరావు, డీవీ సన్యాసిరావు, రవి తదితరులు పాల్గొన్నారు.




స్వామివారు(ఇన్‌సెట్), అశ్వవాహనంపై మాఢవీధుల్లో ఊరేగుతున్న స్వామి వారు

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, జనవరి 5: ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు వాల్తేరు డివిజన్ డీసీఎం ఎల్.అశోక్‌రావు తెలిపారు.

విశాఖ-కొల్లాం-విశాఖ బై వీక్లీ

08567 నంబరు గల బై వీక్లీ ప్రత్యేక రైలు ఈనెల పది నుంచి 20వ తేదీ వరకు ప్రతి శని, బుధవారాల్లో రాత్రి 11.00 గంటలకు విశాఖలో బయలుదేరి సోమ, శుక్ర వారాల్లో ఉదయం తెల్లవారు జాము 3.45 గంటలకు కొల్లాం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08568 నంబరు గల బై వీక్లీ ప్రత్యేక రైలువ ఈనెల 12 నుంచి 22వ తేదీ వరకు ప్రతి సోమ, శుక్రవారాల్లో ఉదయం 5.45 గంటలకు కొల్లాంలో బయలుదేరి మంగళ, శనివారాల్లో మధ్యాహ్నం 12.30 గంటలకు విశాఖ చేరుతుంది.

విశాఖ-హైదరాబాద్-విశాఖ

07148 నంబరు గల రైలు ఈనెల 10, 12వ తేదీల్లో సాయంత్రం 5.45 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 8.15 గంటలకు విశాఖ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07147 నంబరు గల రైలు ఈనెల 11,13వ తేదీల్లో సాయంత్రం 6.50 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 9.45 గంటలకు హైదరాబాద్ చేరుతుంది.

తిరుపతి-విశాఖ-తిరుపతి ఏసీ స్పెషల్

07487 నంబరు గల ప్రత్యేక వారాంతపు ఏసీ రైలు ఈనెల ఏడు నుంచి ఫిబ్రవరి 25వ తేదీ వరకు ప్రతి ఆదివారం రాత్రి 10.30 గంటలకు తిరుపతిలో బయలుదేరి మర్నాడు ఉదయం 10.45 గంటలకు విశాఖ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07488 నంబరు గల ప్రత్యేక వారాంతపు ఏసీ రైలు ఈనెల ఎనిమిది నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు ప్రతి సోమవారం రాత్రి 7.20 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 7.45 గంటలకు తిరుపతి చేరుతుంది.

విశాఖ-తిరుపతి

07479 నంబరు గల వారాంతపు రైలు ఫిబ్రవరి ఏడు నుంచి 28వ తేదీ వరకు ప్రతి బుధవారం రాత్రి 7.05 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 9.25 గంటలకు తిరుపతి చేరుతుంది

కాచీగూడ-విశాఖ

07016 నంబరు గల వారాంతపు రైలు ఫిబ్రవరి ఆరు నుంచి 27వ తేదీ వరకు ప్రతి మంగళవారం సాయంత్రం 6.45 గంటలకు కాచీగూడలో బయలుదేరి మర్నాడు ఉదయం 7.50 గంటలకు విశాఖ చేరుతుంది.

చెన్నై-సంత్రాగచ్చి-చెన్నై (ప్రత్యేక చార్జీలు)

06058 నంబరు గల ప్రత్యేక చార్జీల ప్రత్యేక వారంతపు రైలు ఈనెల పది నుంచి మార్చి 28వ తేదీ వరకు ప్రతి బుధవారం మధ్యాహ్నం 3.15 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 5.10 గంటలకు విశాఖ చేరి తిరిగి ఇక్కడ నుంచి 5.30 గంటలకు బయలుదేరి అదేరోజు (గురువారం) రాత్రి 7.00 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 06057 నంబరు గల ప్రత్యేక వారాంతపు రైలు ఈనెల 11వ తేదీ నుంచి మార్చి 29వ తేదీ వరకు ప్రతి గురువారం రాత్రి 11.50 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 2.15 గంటలకు విశాఖ చేరి తిరిగి ఇక్కడ నుంచి 2.45 గంటలకు బయలుదేరి మర్నాడు (శనివారం) ఉదయం 5.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుతుంది.

పాండిచ్చేరి-సంత్రాగచ్చి-పాండిచ్చేరి వయా దువ్వాడ

06010 నంబరు గల వారాంతపు ప్రత్యేక రైలు ఈనెల ఆరు నుంచి మార్చి 31వ తేదీ వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకు పాండిచ్చేరిలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 1.43 గంటలకు దువ్వాడ చేరి తిరిగి 1.45 గంటలకు బయలుదేరి మర్నాడు (సోమవారం) ఉదయం 4.30 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 06009 నంబరు గల రైలు ఈనెల ఎనిమిది నుంచి ఏప్రిల్ రెండో తేదీ వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 2.10 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 3.55 గంటలకు దువ్వాడ చేరి తిరిగి 3.57 గంటలకు బయలుదేరి అదేరోజు (మంగళవారం) రాత్రి 8.45 గంటలకు పాండిచ్చేరి చేరుతుంది.

యోగా నారసింహుడిగా అప్పన్న

సింహాచలం, జనవరి 5: పవిత్రమైన ధనుర్మాసోత్సవాలలో అంతర్భాగమైన రాపత్తు ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం వరాహలక్ష్మీనృసింహస్వామి భక్తులకు యోగ ముద్రలో నారసింహునిగా దర్శనమిచ్చాడు. ఉత్సవంలో భాగంగా వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపసేవ, సేవాకాలం వంటి ప్రభాత ఆరాధనలు యధావిధిగా పూర్తిచేసి బాలభోగం, రాజభోగాలను నివేదన చేసి మధ్యాహ్నం పవళింపు జరిపారు.

సాయింత్రం స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని యోగ ముద్రలో కూర్చున్న రీతిలో రెండుచేతుల్లో సుదర్శన, పాంచజన్యాలను ధరించిన విధంగా ఆలయ అలంకారి కరి సీతారామాచార్యులు తీర్చిదిద్దిన తీరు భక్తులను ఆకట్టుకుంది.



యోగా నారసింహుడు

అనకాపల్లి మార్కెట్ ధరలు

కూరగాయలు (కిలో)



ఉల్లిపాయలు	రూ.45
బంగాళదుంపలు	రూ.15
టొమేటో	రూ.10
వంకాయలు(తెల్లవి)	రూ.30
వంకాయలు(నల్లవి)	రూ.40
బీరకాయలు	రూ.50
బెండకాయలు	రూ.40
దొండకాయలు	రూ.20
క్యారెట్	రూ.50
క్యాబేజీ	రూ.20
బీన్స్	రూ.60
కొబ్బరి కాయ(చిన్నది)	రూ.15
కొబ్బరికాయ(పెద్దది)	రూ.20
బీట్‌రూట్	రూ.40
మిర్చి	రూ.40
చిక్కుడు	రూ.50
గోరుచిక్కుడు	రూ.40
బరబాటీ	రూ.30
అల్లం	రూ.50
చేమదుంపలు	రూ.30
దోసకాయ	రూ.20
కాకరకాయలు	రూ.30
ఆనపకాయ(చిన్నది)	రూ.15
ఆనపకాయ(పెద్దది)	రూ.20
అరటికాయలు (మూడు)	రూ.20


పప్పు దినుసులు (కిలో)

కందిపప్పు	రూ.65
పెసరపప్పు	రూ.70
మినపపప్పు	రూ.65
శనగ పప్పు	రూ.65
పంచదార	రూ.40
ఇడ్లీనూక	రూ.28
గోధుమ రవ్వ	రూ.32
చింతపండు	రూ.180
మైదా	రూ.26

నూనె ధరలు (లీటర్)

పామోలిన్	రూ.70
సన్‌ఫ్లవర్	రూ.85
వేరుశనగ	రూ.120
కొబ్బరి	రూ.120
డాల్డా (కిలో)	రూ.70

కోడి గుడ్లు(నెక్)



వంద గుడ్లు రూ.లలో

విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	బ్యాగ్
లైవ్ ధర	104.00	90.00
విత్ స్కిన్	151.00	140.00
స్కిన్ లెస్	172.00	150.00

బెల్లం ధరలు(రూ.లలో)

	కనిష్ఠ	గరిష్ఠ
మొదటి రకం	2800	3540
రెండో రకం	2720	3120
మూడో రకం	2400	2820

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 6,8,9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): ఆరోగ్యం మెరుగువుతుంది. ఆస్పత్రులు, ఫార్మా, రెస్టారెంట్లు, రిక్రియేషన్ రంగాల వారు పై అధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి ప్రోత్సాహకరం. విందు, వినోదాల్లో ఉల్లాసంగా పాల్గొంటారు.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): పొదుపు పథకాలు లాభిస్తాయి. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రియతములకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. బంధుమిత్రులతో సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు.

మిథునరాశి: (మే21-జూన్21): సమీక్షలకు అనుకూలం. గృహావసరాల కోసం అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. ఆర్థిక విషయాల్లో కుటుంబ సభ్యుల సహకారం లభిస్తుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకర సమయం.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): వేడుకల్లో పాల్గొంటారు. శుభవార్త అందుకుంటారు. బంధుమిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. జన సంబంధాలు విస్తరిస్తాయి. స్టేషనరీ, ప్రింటింగ్, కమ్యూనికేషన్ల రంగాల వారికి శుభప్రదం. ప్రియతములతో ఉల్లాసంగా గడుపుతారు.

సింహరాశి: (జూలై24-ఆగస్టు23): అదనపు ఆదాయం లభిస్తుంది. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అనుకూలం. సహోద్యోగుల ఆర్థిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, చిట్‌ఫండ్‌లలో పనిచేసే వారికి ప్రోత్సాహకరం.

కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23): సంతతి విషయాల్లో శుభప్రదం. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమానుబంధాలు బలపడతాయి. చిట్‌ఫండ్‌లు, పొదుపు పథకాలు లాభిస్తాయి. చిన్నారుల వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): వాయిదాపడుతున్న పనులు పూర్తి చేస్తారు. దూరంలోఉన్న ప్రియతములు ఇల్లు చేరుతారు. వేడుకలు, బృంద కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తారు. రాజకీయ, సినీ రంగాల వారు కీలక పదవులు అందుకుంటారు.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): కొత్త స్నేహాలు చిగురిస్తాయి బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. సమావేశాలు, చర్చలు ఫలిస్తాయి. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. ప్రముఖుల్ని కలుసుకుంటారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. లక్ష్యం నెరవేరుతుంది. ప్రమోషన్లకు అనుకూలం.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ప్రత్యర్థులపై విజయం సాధిస్తారు. కొత్త వ్యూహాలు అమలు చేసి సత్ఫలితాలు సాధిస్తారు. న్యాయ, బోధన, రవాణా రంగాల వారికి అనుకూలం. నూతన ప్రాజెక్టులను విజయవంతంగా చేపడతారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): సంస్మరణలు, ఆధ్యాత్మిక సమావేశాల్లో పాల్గొంటారు. పూర్వ మిత్రులకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. యోగ, ధ్యానాలపై దృష్టి పెడతారు.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): బృంద కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ



లైట్ అప్ 2018

ప్రపంచంలోనే అతి ఎత్తయిన బిల్డింగ్ బుర్జ్‌ఖలీఫా.. మరో రికార్డును తన ఖాతాలో వేసుకుంది. 2018 నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతూనే గిన్నిస్ రికార్డును సొంతం చేసుకుంది.

- బుర్జ్‌ఖలీఫా వేదికగా జరిగిన కొత్త సంవత్సరం వేడుకల్లో 'లైట్ అండ్ సౌండ్ షో' పర్యాటకులకు వినోదం పంచింది.
- కొత్త సంవత్సరం అనగానే ఏ దేశంలో అయినా సాధారణంగా బాణాసంచా కాల్చి వేడుకలు జరుపుతారు. దానికి భిన్నంగా యూఏఈ మాత్రం దుబాయ్‌లో అదిరిపోయే లైటింగ్‌షోను ఏర్పాటు చేసింది.
- కొత్త సంవత్సరం వేడుకల కోసం దుబాయ్‌లోని బుర్జ్‌ఖలీఫా వద్ద యూఏఈ ఏర్పాటు చేసిన లైటింగ్ అండ్ సౌండ్‌షోకు అనేక ప్రత్యేకతలున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)స్థాపకులు షేక్ జాయేద్ బిన్‌కు నివాళిగా ఈ లైట్ అండ్ సౌండ్ షోను ఏర్పాటు చేశారు. 2018 సంవత్సరాన్ని 'ఇయర్ ఆఫ్ జాయెద్'గా యూఏఈ ప్రకటించింది.
- ఇది ప్రపంచంలోనే అతిపెద్ద లైట్ అండ్ సౌండ్ షోగా గిన్నిస్ రికార్డులకెక్కింది.

ఈ షోకు 'లైట్‌అప్ 2018' అని పేరు పెట్టారు. ఈ షోను అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ఐదు నెలల ముందు నుంచే సన్నాహాలు ప్రారంభించారు. మొత్తం 300 మంది నిపుణులు అన్ని రోజుల పాటు పరిశ్రమించి అద్భుతమైన లైటింగ్ దృశ్యాలను ఆవిష్కరించారు.

✧ లైట్‌అప్‌షోకు అవసరమైన వస్తువులను వివిధ దేశాల నుంచి తెప్పించారు.
✧ 7 కి. మీ. పొడవైన విద్యుత్ వైర్లను, 25 కి. మీ. పొడవైన తాళ్లను వాడారు.
✧ నేపథ్య సంగీతాన్ని దుబాయ్, కైరోల్లోని స్టూడియోల్లో రికార్డు చేశారు.
✧ 80 మంది సంగీత కళాకారులు పాల్గొన్నారు.

- బుర్జ్ ఖలీఫా బిల్డింగ్ మొత్తానికి లైట్‌షోతో ఏర్పాటు చేశారు.
- ఇది విస్తీర్ణంలో 20 ఫుట్‌బాల్ మైదానాలంత (సుమారు 27 ఎకరాలు) ఉంటుంది.
- ఇంతకు ముందు ఈ రికార్డు చైనాలోని ఐసీసీ బిల్డింగ్ పేరు మీద ఉంది.

నోరు తిరుగుతోందా?



How much wood, would a woodchuck chuck if a woodchuk, could chuck wood?

పొడుపు కథ

కాళ్లు లేవు గానీ నడుస్తుంది. కళ్లు లేవు గానీ ఏడుస్తుంది. ఏమిటది?



పజిల్ పూరించండి



పద్యం

నిండునదులు పారు నిలిచి గంభీరమై
వెర్రివాగు పారు వేగఁబొర్లి
అల్పుడాడురీతి నధికుండు నాడునా?
విశ్వదాభిరామ వినురవేమ.

భావం : సెలయేరు వేగంగా ప్రవహించి అన్నింటినీ ధ్వంసం చేసినట్టే జ్ఞానం లేని వాడు ఆవేశంతో అన్ని పనులూ చెడగొడుతాడు. వివేకవంతుడు నిండు నది వలె పనులు సక్రమంగా పూర్తి చేస్తాడు.

జంతర్ మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. ణపయంరి ▶..............
2. భవంవై ▶..............
3. శ్చితానిర్థం ▶..............
4. ధుబంత్రులుమి ▶..............
5. కరాపోలుక ▶..............

ఆణిముత్యం

ఓర్పు అనేది ఎంత చేదుగా ఉంటుందో, దానివల్ల లభించే ప్రతిఫలం అంత తియ్యగా ఉంటుంది.



జతపరచండి

ఈ ప్రముఖులనూ, వారి స్మారక స్థలాలనూ జతపరచండి

1. మహాత్మాగాంధీ	ఎ. శక్తిస్థల్
2. జవహర్‌లాల్‌నెహ్రూ	బి. విజయ్‌ఘాట్
3. లాల్‌బహదూర్ శాస్త్రి	సి. రాజ్‌ఘాట్
4. ఇందిరాగాంధీ	డి. శాంతివనం
5. బాబూ జగ్జీవన్‌రామ్	ఇ. చైత్రభూమి
6. బి.ఆర్. అంబేద్కర్	ఎఫ్. సమతాస్థల్

పదాలు కనుక్కోండి

shoe
duck
doll
globe
block
green

x	k	c	o	l	b
l	n	e	e	r	g
l	g	l	o	b	e
o	q	n	c	w	c
d	n	s	h	o	e
u	w	k	c	u	d

జంబ్లింగ్ వర్డ్స్



1. LICPOE ______
2. IRF ______
3. RICME ______
4. MMCOISIONRE ______
5. SPINEORCT ______


దారి కనుక్కోండి




ఒకటికి మూడు

చిత్రంలో కనిపిస్తున్న వాటిని తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఏమంటారంటే..!

1. కుక్క
2. DOG
3. कुत्ता



నీడలు గుర్తించండి



జవాబులు

పజిల్ పూరించండి : 17 (కనుక్కోవాల్సిన సంఖ్య ఎదురుగా ఉన్న రెండు అంకెలను కూడాలి 9+8=17), **జతపరచండి:** 1 సి, 2 డి, 3 బి, 4 ఎ, 5 ఎఫ్, 6 ఇ. **జంబ్లింగ్ వర్డ్స్ :** 1. POLICE, 2. FIR, 3. CRIME, 4. COMMISSIONER , 5. INSPECTOR, **పొడుపు కథ :** మేఘం, **జంతర్‌మంతర్ :** 1. పరిణయం, 2. వైభవం, 3. నిశ్చితార్థం, 4. బంధుమిత్రులు, 5. రాకపోకలు

తిరుమల సమాచారం

వసతి గదులు: రూ.500: మార్చి 1నుంచి 31 వరకు ఉన్నాయి.
రూ.100 : మార్చి 1నుంచి 31 వరకు ఉన్నాయి.
శ్రీనివాసమ్ : మార్చి 1నుంచి 31 వరకు ఉన్నాయి.
రూ.300 దర్శనం: మార్చి 1నుంచి 31 వరకు ఉన్నాయి.
ఆర్జిత సేవలు : మార్చి 7వ తేదీన ఉన్నాయి.

రైల్వే సమాచారం

రైళ్ల రాకపోకల వేళలు, రిజర్వేషన్ ఖాళీల వివరాలు, టికెట్ చార్జీలు, ఇతర సమాచారం కోసం... 139
ప్రయాణికుల భద్రతకు రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) టోల్ ఫ్రీ నంబరు 182
అనకాపల్లి ఆర్పీఎఫ్ పోస్ట్ ఫోన్... 08924-226965

ఆర్టీసీ సమాచారం

APSRTC

అనకాపల్లి ఎంక్వైరీ	77300 37027
నర్సీపట్నం ఎంక్వైరీ	94932 11969
పాడేరు ఎంక్వైరీ (డీఎం)	73829 06333



సీలేరు గుంటవాడ రిజర్వాయర్‌లో సూర్యుని ప్రతిబింబం

చూడచక్కని సూరీడమ్మా...

ఎముకలు కొరికే చలి.. ఎదురుగా ఉన్న మనిషి సైతం కనిపించనంతగా కురుస్తున్న దట్టమైన మంచు.. ఇటువంటి వాతావరణం చుట్టం చూపుగా వచ్చిపోయే వారికి ఆహ్లాదం అనిపించినా.. అక్కడ నివసించే వారికి మాత్రం నరకమే. ఈ పరిస్థితుల్లో రోజూ ఉదయం తొమ్మిది గంటలైనా ఆదిత్యుడు అగుపించడం కష్టమే. శీతాకాలం ఆరంభం నుంచి విశాఖ మన్యంలో ఇది నిత్యతంతు. కానీ శుక్రవారం ఓ వింతతో పాటు కనువిందైన దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. ఏడు గంటలకే ఉదయ భానుడు మంచు తెరలను చీల్చుకుంటూ జగతికి దర్శనమిచ్చిన తీరు అద్భుతహో.. అనిపించింది. పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఈ అపురూపాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది. ఇదిలావుంటే, అదే సమయంలో సీలేరులోని గుంటవాడ జలాశయంలో సూర్యుని ప్రతిబింబం చూపరులను కట్టిపడేసింది. - పాడేరు/ సీలేరు



పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉదయ భానుడు

బాలికలకు సాంస్కృతిక విభాగంలో ప్రత్యేక శిక్షణ



గొడిచెర్ల(నక్కపల్లి),జనవరి5: మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు సాంస్కృతిక విభాగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ స్కూల్‌కు చెందిన ఉపాధ్యాయురాలు కె.రమణికుమారి ఆధ్వర్యంలో భరతనాట్యం, జానపద నృత్యం, కూచిపూడి నృత్యప్రదర్శనలో పలువురు బాలికలు శిక్షణ పొందుతున్నారు. అన్నమయ్యకీర్తలతో కోలాటం లో శిక్షణ పొందుతున్నారు. ఇవి పిల్లలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

ఘనంగా ధనుర్మాస సమారాధన

పాయకరావుపేట, జనవరి 5: స్థానిక రాధా రుక్మిణి సహిత పాండు రంగస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఘనంగా ధనుర్మాస అన్న సమారాధన జరిగింది. ఆలయ చైర్మన్ యాళ్ళ వరహాలబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాండురంగస్వామి, అమ్మవార్లకు ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి, నారాయణాచార్యులు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ధనుర్మాస సమారాధన కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ యాళ్ళ వరహాలబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు, సీడీసీ చైర్మన్ బోయిడి శ్రీను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారు ఐదు వేల మంది





పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ యాళ్ళ వరహాలబాబు,సమారాధన ప్రారంభిస్తున్న దృశ్యం

భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఆలయ ఈవో పీఎల్ఎన్.రాజు, ధర్మకర్తల మండలి సభ్యులు తూములూరి వీరభద్రరావు, జగతా శ్రీనివాసరావు, వీసం మహేశ్వరరావు, కోడూరి నూకరాజు, కర్రా వీరవెంకటేశ్వరరావు, కట్టమూరి నూకరాజు, ఎస్.వి.రంగా, సత్తిబాబు, గొర్రెల శివరామకృష్ణ, వికాసతరంగిణి సభ్యులు రిండా ఆండాళ్ తమ సేవలను అందజేశారు.

రోడ్డు నిర్మించాకే ఊళ్లోకి రండి

జన్మభూమి సభ వద్దన్న చీడిక గిరిజనులు

దోసలపాడు(నక్కపల్లి),జనవరి 5: మండలంలోని దోసలపాడు గ్రామంలో శుక్రవారం జన్మభూమి సభ నిర్వహణను చీడిక గ్రామస్థులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దోసలపాడు సెగ్మెంట్ పరిధిలో వున్న చీడిక గ్రామంలో 98 శాతం మంది గిరిజనులే నివసిస్తున్నారు. తమ గ్రామానికి రహదారిని నిర్మిస్తామని కొన్నేళ్ల నుంచి నేతలు హామీలిస్తున్నారని, గత ఎన్నికల్లో ఎమ్మెల్యే అనిత రోడ్డు నిర్మించాకే గ్రామంలోకి అడుగుపెడతానని చెప్పారని గిరిజన నేతలు ప్రశ్నించారు. అందువల్ల తమ గ్రామానికి రహదారిని నిర్మించే వరకూ జన్మభూమి సభను నిర్వహించవద్దని డిమాండ్ చేశారు.

ఈ సమయంలో అధికారులతో కాసేపు వాగ్వాదానికి దిగారు. ఇందుకు స్పందించిన



చీడిక గ్రామస్థులకు నచ్చజెబుతున్న ఈవోఆర్‌డీ పీఎస్ కుమార్

ఈవోఆర్‌డీ పీఎస్ కుమార్ ఈ సమస్య ఎమ్మెల్యే అనిత, కలెక్టర్ దృష్టిలో వుందని, రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు కూడా తెలిసిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు.ఎంఈవో డీవీడీ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు దార్ల కృష్ణ పాల్గొన్నారు.

విజయాలకు మార్గాలను అన్వేషించాలి

జూనియర్ ఛాంబర్ జోన్ అధ్యక్షుడు రాహుల్

పాయకరావుపేట, జనవరి 5 : విద్యార్థులు విజయాలకు మార్గాలను అన్వేషించాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని జూనియర్ ఛాంబర్ జోన్ అధ్యక్షుడు రాహుల్ అన్నారు. శుక్రవారం పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యా సంస్థ అనుబంధ సమస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులు విజయాలకు మార్గాలను ఎలా ఎంచుకోవాలి, వాటిని ఎలా పొందాలన్నదానిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు పోటీ ప్రపంచంలో అనేక విద్య, ఉపాధి అవకాశాలు న్నాయన్నారు. వాటిని సాధించేందుకు విద్యార్థులు ఒక నిర్దిష్ట గమ్యాన్ని ఏర్పరచుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీపరంగా



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాహుల్

కూడా విషయ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు, జూనియర్ చాంబర్ అధ్యక్షుడు చెన్నా విజయ్, కార్యదర్శి కె.రవితేజ, జోనల్ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్.హేమశంకర్, సభ్యులు డి.శ్రీకాంత్, బి.రాజేష్‌తోపాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పాండురంగడికి రూ.20 వేల విరాళం

పాయకరావుపేట, జనవరి 5 : స్థానిక పాండురంగస్వామి ఆలయ అభివృద్ధికి పాయకరావుపేట పంచాయతీ 2వ వార్డు సభ్యుడు దాడి తాతారావు రూ.20వేల విరాళాన్ని అందజేశారు. శుక్రవారం ఆలయ చైర్మన్ యాళ్ళ వరహాలబాబుకి నగదు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ పాండురంగడికి మొక్కుబడిగా ఇవ్వాలనుకున్నదాన్ని అందజేశానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆడారి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులను నిర్మూలించాలి

ఎస్.రాయవరం,జనవరి 5 : బెల్టుషాపులు నిర్మూలన మండలంలో అమలు కావడం లేదు. ఎస్.రాయవరం మండలం దార్లపూడి, చినగుమ్ములూరు, ఎస్.రాయవరం, గుడివాడ,ధర్మవరం తదితర ప్రాంతాల్లో మద్యం దుకాణాల నుంచి పలువురు వ్యాపారులు మద్యం కొనుగోలు చేసి వారి ఇళ్ల వద్ద విక్రయిస్తున్నారు. బెల్ట్‌షాపుల నిరోధానికి మండల పరిధిలో కమిటీని నియమించినప్పటికీ దీనిపై కమిటీ దృష్టిసారించకపోవడంతో ఎక్కడపడితే అక్కడ బెల్ట్‌షాపులు దర్శనమిస్తున్నాయి. దీనివల్ల కూలీలు కష్టపడిన సొమ్ములో సగానికి పైగా మద్యానికే ఖర్చుపెడుతున్నారని ధర్మవరం, ఎస్.రాయవరం గ్రామాలకు చెందిన పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో సుమారు 130కి పైగా బెల్ట్ షాపులున్నా పోలీసులు ఒక్కసారి కూడా దాడులు నిర్వహించకపోవడంతో దుకాణాల ముందే మద్యం సీసాలు పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. పైగా ఎంఆర్‌పీ ధర కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు బెల్ట్‌షాపుల నిరోధానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యావికాసంపై వ్యాసరచన పోటీలు

నక్కపల్లి,జనవరి 5: నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు విద్యావికాసంపై వ్యాసరచన పోటీలు, అవగాహన శిబిరం నిర్వహించారు. జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పీవీ రామచంద్రరావు మాట్లాడుతూ సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు గుర్తింపు వుందన్నారు. సామాజిక అంశాలపై వలంటీర్లు అవగాహన పెంచుకోవాలని ఎన్ఎస్ఎస్ పీవో కొండలరావు సూచించారు. అధ్యాపకులు ఎస్.నానాజీ, వి.అప్పారావు, శ్యామ్ పాల్గొన్నారు.

ఘనంగా విద్యా వికాస సదస్సు



పాయకరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట: జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక బృందావనం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం వసంతలక్ష్మి ఆధ్వర్యంలో విద్యా వికాస సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వికాస తరంగి సభ్యులు చిక్కాల శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరు చదవాలి, అందరూ ఎదగాలి అన్న నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం సీహెచ్. సత్యనారాయణ, గొల్లపల్లి నాగు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

విద్యా వికాస ర్యాలీ

కర్రివానిపాలెం(ఎస్.రాయవరం), జనవరి 5 : మండలంలోని కర్రివానిపాలెం, ఎస్.రాయవరం,దార్లపూడి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు,ఉన్నత పాఠశాలల్లో జన్మభూమిని పురస్కరించుకుని విద్యావికాస ర్యాలీ నిర్వహించారు. కర్రివానిపాలెంలో సర్పంచ్ పినపాత్రుని సూర్యనారాయణ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతీ ఒక్క కుటుంబానికి వ్యక్తిగత మరుగుదొడ్డి వుండాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. ఎస్.రాయవరం జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ర్యాలీ, అవగాహన సదస్సులో హెచ్ఎం కేవీఎల్ జ్ఞానేశ్వర, ఉపాధ్యాయులు అప్పలరాజు, శ్రీదేవి, కిరణ్, ఉమాదేవి, ధనలక్ష్మి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



వేంపాడు హైస్కూల్‌లో విద్యావికాసంపై అవగాహనా సదస్సు

విద్యార్థులకు అవగాహన సదస్సు

నక్కపల్లి, జనవరి 5: మండలంలోని వేంపాడు, నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా పలు అంశాలకు సంబంధించి అవగాహన సదస్సులు నిర్వహించారు. అన్ని ప్రభుత్వ,సామాజిక కార్యక్రమాలు, విద్యావికాసం తదితర అంశాలపై హెచ్ఎంలు రాచకొండ శ్రీనివాసరావు, పద్మావతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం వ్యాస రచన, వక్తృత్వం, చిత్రలేఖనం,క్విజ్ పోటీలను నిర్వహించారు. రెండు స్కూళ్ల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.నక్కపల్లి హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయయణ, వేణుగోపాల్,ఎన్‌వీఎస్ ఆచార్యులు,అరుణ, భవానీ ,సత్యవతి పాల్గొన్నారు.

సినిమా గైడ్

గౌతమ్ : సారథి
సూర్యమహల్: ఒక్క క్షణం
సాయిమహల్: హలో
లక్ష్మీ ఏసీ థియేటర్ : ఎంసీఏ

పాడి రైతులకు వడ్డీ లేని రుణాలు

అచ్యుతాపురం రూరల్, జనవరి 5 : చీమలాపల్లిలో విశాఖ డెయిరీ పాల ఉత్పత్తిదారులకు సర్పంచ్ మామిడి శివ అప్పారావు శుక్రవారం బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డెయిరీ పర్యవేక్షకుడు అరసవల్లి మాట్లాడుతూ మేలుజాతి పశువుల కొనుగోలుకు పాడి రైతులకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామన్నారు.



బోనస్ ఇస్తున్న సర్పంచ్ శివ

అచ్యుతాపురం ఎంపీపీ మార్పు..?



ప్రస్తుత ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు

- కొత్త సారథిగా రమేష్‌కుమార్
- నిన్నటితో ముగిసిన పెద్ద మనుషుల ఒప్పందం
- ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఆపిన ఎమ్మెల్యే
- జన్మభూమి తర్వాత వైస్ ఎంపీపీకి బాధ్యతలు



వైస్ ఎంపీపీ రమేష్ కుమార్

అచ్యుతాపురం : అచ్యుతాపురం ఎంపీపీగా టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ రాజాన రమేష్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. అయితే ఈనెల 11వ తేదీ వరకు జన్మభూమి కార్యక్రమాలు ఉండడంతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచనల మేరకు ఆ ప్రక్రియ నిలిచినట్టు సమాచారం. లేకుంటే ఎంపీటీసీ ఎన్నికల సమయంలో పెద్ద మనుషుల ఒప్పందం మేరకు ప్రస్తుత ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు శుక్రవారం తన పదవికి రాజీనామా చేయాల్సి ఉంది. అచ్యుతాపురం మండలం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. టీడీపీ ప్రభుత్వం ఆవిర్భావం నుంచి అచ్యుతాపురం మండలాధ్యక్షుడిగా కాంగ్రెస్ నాయకులే ఎన్నికవుతున్నారు. అయితే గతసారి జరిగిన మండల ఎన్నికల్లో పరిసితి తారుమారైంది. ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి చనిపోవటం. అప్పటివరకు కాంగెస్‌లో ఉన్న ఉప్పలపాటి రమణమూర్తిరాజు (కన్నబాబురాజు)తో పాటు ఆయన అనుచరులు తెలుగుదేశంలో చేరటంతో మండల రాజకీయ సమీకణాలు మారిపోయాయి. కన్నబాబురాజు టీడీపీ తరపున ఎలమంచిలి నియోజకవర్గం నుంచి మళ్లీ పోటీ చేయాలన్న ఉద్దేశంతో ఎంపీటీసీ ఎన్నికల్లో తనదైన శైలిలో రాజకీయం చేసారు. ఎంపీపీ అభ్యర్థి ఎవరైనా సుమారు 80 లక్షలు వరకు ఖర్చు చేస్తే వారినే ఎంపీపీ చేస్తామని అప్పట్లో ప్రకటించారు. దీనికి రమేష్‌కుమార్ వర్గీయులు అంగీకరించలేదు. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి రాజాన రమేష్‌కుమార్ ఆపార్టీనే నమ్ముకున్నారు. అంతేకాకుండా నాలుగు సార్లు తెలుగుదేశం తరపున ఎంపీటీసీ సభ్యునిగా దోసూరు సెగ్మెంట్ నుంచి ఎన్నికయ్యారు. అంతేకాకుండా మండల తెలుగుదేశం అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నారు. అటువంటి వ్యక్తికి కాదని ఎంపీపీ పదవిని డబ్బులిచ్చిన వారికే కేటాయించటం సమంజసం కాదని రమేష్ కుమార్ వర్గీయులు వ్యతిరేకించారు. అయినప్పటికీ రూ. 80 లక్షలు ఇవ్వటానికి రమేష్ కుమార్ అప్పట్లో అంగీకరించారు. కానీ కన్నబాబు రాజు మాత్రం తన సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాసరాజుకే ఎంపీపీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించారు. దీంతో ఎటువంటి రాజకీయ అనుభవం లేని, మొదటిసారిగా ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన శ్రీనివాసరాజును ఎంపీపీగా చేసారు. ఇదిలా ఉండగా ప్రస్తుత జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ లాలం భవాని స్వయానా రమేష్‌కుమార్ అక్క. అప్పట్లో భవానీని జెడ్పీ ఛైర్‌పర్సన్‌గా చేయటానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రమేష్‌కుమార్ ఎంపీపీ బరిలో నుంచి తప్పుకోకపోతే తన అక్క భవానీ విజయానికి ఆటంకాలు ఏర్పడతాయని బెదిరించడంతో రమేష్‌కుమార్ అప్పట్లో వెనుకంజవేసారు. దీంతో నాయకులంతా ఏకమై మూడున్నరేళ్ల శ్రీనివాసరాజు ఎంపీపీగా ఉండటానికి, మిగిలిన ఒకటిన్నరేళ్ల రమేష్‌కుమార్ ఎంపీపీగా ఉండాలని నిర్ణయించారు. రమేష్ కుమార్ పదవి స్వీకరించే సమయంలో కొంత సొమ్ము శ్రీనివాసరాజుకి ఇవ్వాలని కూడా అప్పట్లో పెద్దల సమక్షంలో తీర్మాణించారు. ఈ మేరకు ప్రస్తుత ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు శుక్రవారం తన పదవికి రాజీనామా చేయాలి. శనివారం వైస్ ఎంపీపీ రమేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించాలి. కానీ జన్మభూమి జరుగుతుండటతో సంక్రాంతి తర్వాత రమేష్‌కి బాధ్యతలు అప్పగించాలని ఎమ్మెల్యే సూచించటంతో ఆగినట్టు తెలుస్తోంది.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

జగ్గన్నపేటలో జన్మభూమి సభలపై ర్యాలీ

అచ్యుతాపురం రూరల్, జనవరి 5 : మండలంలోని జగ్గన్నపేట ప్రాథమికపాఠశాల విద్యార్థులు శనివారం జన్మభూమి కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ..ర్యాలీ నిర్వహించారు. వీధుల్లో ఫ్లకార్డులతో నినాదాలు చేస్తూ ర్యాలీ జరిపారు. అలాగే గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాధురి రమణబాబు, విద్యా కమిటీ ఛైర్మన్ నూకరాజు, ఉపాధ్యాయులు జి. రమేష్, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

దాణా పరికరాలు పంపిణీ

మునగపాక, జనవరి 5 : పాడి రైతులకు ఉపయోగకరంగా ఉండే విధంగా సుఖీభవ కార్డు కలిగిన ప్రతి రైతుకు పశుదాణా బేసన్లు పంపిణీ చేస్తున్నామని విశాఖ డెయిరీ ట్రస్టు సీఈఓ ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన గవర్ల అనకాపల్లి పాల కేంద్రంలో పాడి రైతులకు పశుదాణా బేసన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల సంఘాల అధ్యక్షులు బాబ్జి, చందనాటి శ్రీను, సబ్బి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్

మునగపాక, జనవరి 5 : నారాయుడు పాలెం, మునగపాక, నాగులాపల్లిలోని పాడి రైతులకు విశాఖ డెయిరీ ఐకాన్ కృషి ఆస్పత్రి సీఈఓ ఆడారి ఆనంద్ శుక్రవారం బోనస్ పంపిణీ చేశారు.కార్యక్రమంలో పాలసంఘాల అధ్యక్షులు సబ్బి శ్రీనివాసరావు, కాళ్ల జగ్గారావు, దొడ్డి శ్రీనివాసరావు, డెయిరీ జేవో నక్కా నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ ఆది అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



మద్దాలను అభినందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా మద్దాల

మునగపాక, జనవరి 5 : రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా మద్దాల వీరునాయుడు నియామితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శుక్రవారం ఆయనకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో పార్టీ మరింత బలపడేలా నాయకులు, కార్యకర్తలతో పని చేయించాలని తెలిపారు. కాగా వీరునాయుడు పదవి పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు



విద్యార్థులతో ఎంపీపీ శ్రీనివాసరాజు

సమాజ సేవలోనే సంతృప్తి

వెదురువాడ (అచ్యుతాపురం), జనవరి 5 : విద్యార్థులు చదువుతో పాటు సేవాభావాన్ని కూడా అలవాటు చేసుకోవాలని ఎంపీపీ చేకూరి శ్రీనివాసరావు తెలిపారు.శుక్రవారం వెదురువాడలో ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో ఏడు రోజుల పాటు ఈ శిబిరం కొనసాగుతుందని, స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. విద్యార్థులు స్వచ్ఛ భారత్, ఓడీఎఫ్, వైద్య సేవలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కాగా జన్మభూమి, కార్యక్రమాల్లో భాగంగా తమ విద్యార్థులకు పది గ్రామాలపై సమగ్ర సర్వే జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు వచ్చాయని ఎన్ఎస్ఎస్ అధికారి గోపాల కృష్ణ తెలిపారు.

సినిమా గైడ్

సీతాచిత్రమందిర్ : టు కంట్రీస్
తులసీ చిత్ర మందిర్ : హలో
పరమేశ్వరి : ఎంసీఏ
అచ్యుతాపురం బాలాజీ విలేజ్
స్క్రీన్ -1 : ఎంసీఏ
స్క్రీన్ -2 : ఒక్క క్షణం



తులసీనగర్‌లో మేలుకొలుపు కార్యక్రమంలో పాల్గొన్న ఛైర్‌పర్సన్ రమాకుమారి, తదితరులు

పల్లెల్లో మార్మోగుతున్న గోవింద నామం

ఎలమంచిలి జనవరి 5 : పల్లెలు గోవింద నామస్మరణతో మార్మోగుతున్నాయి. ధనుర్మాస ఉత్సవాల నేపథ్యంలో గ్రామీణులు చలిని సైతం లెక్క చేయకుండా మేలుకొలుపు ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా వీధులు గోవిందుడి నామస్మరణతో మార్మోగుతున్నాయి. శుక్రవారం వేకువజామున తులసీనగర్‌లో ఛైర్‌పర్సన్ రమాకుమారితో పాటు అధిక సంఖ్యలో మహిళలు గోవిందుడి విగ్రహం పట్టుకుని దైవనామ స్మరణ చేసుకుంటూ ఇంటింటికి తిరిగి మేలుకొలుపు నిర్వహించారు. అలాగే పీఎన్ఆర్‌పేట, ఏటికొప్పాక, పులపర్తి గ్రామాల్లో మేలుకొలుపు ఉత్సవాలు జరుగుతున్నాయి.

వృత్తి నైపుణ్య శిక్షణతో చక్కని ఉపాధి

కొత్తూరు, జనవరి 5 : వృత్తి నైపుణ్య శిక్షణలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంఏఎల్ కళాశాల ప్రిన్సిపాల్ జయబాబు కోరారు. కళాశాలలో ప్రేమనిధి ఫౌండేషన్ శుక్రవారం నిర్వహించిన శిక్షణను ప్రారంభించారు. ఫౌండేషన్ చైర్మన్ అంజూరి దీపక్, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ఉగాదికి కొత్తగా 6012 పింఛన్లు

» గ్రామ సభల్లో అర్జీలకు 90 రోజుల్లోగా పరిష్కారం » ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకోండి » పరిశుభ్రత పాటించండి » జన్మభూమిలో ఎమ్మెల్యే 'పీలా'

అనకాపల్లి టౌన్, జనవరి 5 : ఉగాది నాటికి అనకాపల్లి నియోజకవర్గంలో కొత్తగా 6,012 మందికి పింఛన్లు అందజేయనున్నట్టు ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో శుక్రవారం ఎనిమిది వార్డులకు సంబంధించి జరిగిన జన్మభూమి సభలో మాట్లాడారు. ఇప్పటికీ ఎవరికైనా పింఛన్లు మంజూరు కాకుంటే ఈ సభల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇళ్లు లేని వారు కూడా దరఖాస్తులు అందజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నారు. బహిరంగ మలవిసర్జన రహిత అనకాపల్లిగా పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు మహిళలు సహకరించాలని కోరారు. జన్మభూమిలో వచ్చిన అర్జీలకు 90 రోజుల్లోగా పరిష్కారం చూపనున్నట్టు చెప్పారు. అనంతరం చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ షేక్ సుభానీ అధ్యక్షతన జరిగిన ఈ సభలో అధికారులు ఉదయ్‌కుమార్, సత్యనారాయణ, రజని, రత్నకుమారి, టీడీపీ నాయకులు బుద్ద నాగ జగదీశ్వరరావు, కొణతాల వెంకటరావు, బీఎస్‌ఎంకే జోగినాయుడు, మళ్ల సురేంద్ర, డాక్టర్ కె.విష్ణుమూర్తి, డాక్టర్ కేవీ సత్యవతి, బొలిశెట్టి శ్రీనివాసరావు, దొడ్డి జగదీష్, కొణతాల రత్నకుమారి, పొలిమేర నాయుడు తదితరులు పాల్గొన్నారు.




జన్మభూమి సభలో పట్టణవాసులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీలా

'దత్తత గ్రామం సంపతిపురం అన్నింటా అభివృద్ధి'

కొత్తూరు, జనవరి 5 : పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని ఎమ్మెల్సీ ఎంవీవీఎస్ మూర్తి అన్నారు. సంపతిపురం, పిసినికాడ, వేటజంగాలపాలెం గ్రామాల్లో శుక్రవారం జరిగిన జన్మభూమి సభల్లో మాట్లాడారు. దత్తత గ్రామం సంపతిపురంలో వచ్చే ఉగాది నాటికి అర్హులందరికీ సొంత ఇల్లు కల్పించేలా కృషి చేస్తానన్నారు. అలాగే, ఇంటింటికీ కుళాయిలు, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు కల్యాణ మండపం నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పీలా మాట్లాడుతూ నేరుగా లబ్ధిదారుని ఖాతాకే నగదు జమ చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. వేటజంగాలపాలెంలో ఓడీఎఫ్ మండల ప్రత్యేకాధికారి సూర్యనారాయణ మాట్లాడారు. ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ సత్యనారాయణ, టీడీపీ నాయకులు మళ్ళ సురేంద్ర, కె.విష్ణుమూర్తి, కె.సత్యవతి, కొణతాల శ్రీనువాసరావు, పచ్చికూర రాము, సర్పంచ్‌లు నంబారి శ్రీను, దాడి కమలాదేవి, పూడి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.


సంపతిపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మూర్తి

'లబ్ధిదారునికే నేరుగా ప్రభుత్వ పథకాలు'

కశింకోట, జనవరి5 : అవినీతికి తావులేకుండా ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారునికి అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని ఎమ్మెల్యే పీలా అన్నారు. జమాదులపాలెం, ఈశ్వరపల్లి చౌడువాడ, తేగాడ గ్రామాల్లో శుక్రవారం జరిగిన జన్మభూమి సభల్లో మాట్లాడారు. ఉగాది నాటికి ఇళ్లు లేని నిరుపేదలందరికీ పట్టాలు అందిస్తామన్నారు. పోలవరం నీళ్లు కన్నూరుపాలెం గ్రామానికి కూడా వస్తాయన్నారు. పోలవరం రాకతో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం అవుతుందన్నారు. పోషకాహార స్టాల్స్, విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎంపీపీ పంచదార్ల లక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు మలసాల కాసులమ్మ, ఏఎంసీ చైర్మన్ కాయలమురళి, ఎంపీడీవో బీవీ సత్యనారాయణ, తహసీల్దార్ కె. జ్ఞానవేణి, జన్మభూమి కమిటీ సభ్యులు పంచదార్ల సూరిబాబు, వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీను, కడిమిశెట్టి నర్సింరావు, సర్పంచ్‌లు సిదిరెడ్డి సూర్యనారాయణ, కరక లోవతల్లి, కన్నూరు అక్కయ్యమ్మ, ఎంపీటీసీ అద్దేపల్లి బాబూరావు, రెడ్డి అయ్యలనాయుడు, కరక సోమునాయుడు పాల్గొన్నారు.


తేగాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీలా

సంక్షిప్తం


ఛాయాదేవిని సత్కరిస్తున్న దృశ్యం

సామాజిక సేవలో ముందుండాలి

నెహ్రూచౌక్, జనవరి 5 : సామాజిక సేవలో రోటరీ క్లబ్ మరింత ముందుండేలా అందరూ కృషి చేయాలని క్లబ్ పాస్ట్ గవర్నర్ కె. ఛాయాదేవి కోరారు. న్యూకాలనీలో గల రోటరీ ఫంక్షన్ హాలులో ఏర్పాటైన క్లబ్ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. సభ్యులు వారి వారి వ్యాపారాలు, వృత్తులను నీతి నిజాయితీలతో నిర్వర్తిస్తూ పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం ఆమెను క్లబ్ సభ్యులు పి.రాజేశ్వర ప్రసాద్, వీవీ రత్నం సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు బుద్ద రమణాజీ, కార్యదర్శి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి

కొత్తూరు, జనవరి 5 : సీతానగరంలో శుక్రవారం స్వచ్ఛతపై గ్రామస్థులకు అవగాహన సదస్సు ఏర్పాటైంది. ఈ సందర్భంగా మండల ఓడీఎఫ్ ప్రత్యేకాధికారి సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతకు అధికా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ గంగుపాం రామలక్ష్మి, ఎంపీటీసీ రాపేటి రాము, గ్రామ నాయకులు గంగుపాం మహేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీ రంగంతో ఉపాధి అవకాశాలు

కశింకోట, జనవరి 5 : టెక్నాలజీ రంగంతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని జన విజ్ఞాన వేదిక జాతీయ రిసోర్సు పర్సన్ ఎం.శాంతసూరజ్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు కేరియర్ గైడెన్స్ అందించారు. జాతీయస్థాయిలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, ఫ్యాషన్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్, లెదర్ డిజైన్, నిట్‌వేర్ డిజైన్ వంటి కోర్సులు ఉన్నాయన్నారు. హెచ్‌ఎం ఎస్.ఎస్.రామ్‌ప్రసాద్, ఉపాధ్యాయులు మల్లారెడ్డి శంకర ప్రసాద్, జి.నర్సింగరావు, జీకేఆర్ స్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి


విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మాణిక్యం

విద్యార్థినుల్లో సృజనాత్మకత గుర్తించాలి

కశింకోట, జనవరి 5 : విద్యార్థినుల్లో సృజనాత్మకతను వెలికితీయాలని తాళ్లపాలెం సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మాణిక్యం సూచించారు. తాళ్లపాలెంలో శుక్రవారం విద్యార్థినులకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ప్రయోగాలకు అవసరమైన సామాగ్రిని పంపిణీ చేశారు. అటల్‌టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జి పి.విజయ్‌కుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడేరు

నియోజకవర్గం

పాడేరు - చింతపల్లి - గూడెంకొత్తవీధి - కొయ్యూరు - జి.మాడుగుల

గిరిజన యువత క్రీడల్లో రాణించాలి

తాజంగి (చింతపల్లి), జనవరి 5: గిరిజన యువత క్రీడల్లో రాణించాలని తాజంగి నోడల్ అధికారి ఎస్.సుధాకర్ అన్నారు. తాజంగిలో శుక్రవారం వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడల్లో ప్రతిభ చూపితే మంచి భవిష్యత్తు ఉంటుందని ఈ సందర్భంగా క్రీడాకారులకు ఆయన సూచించారు.



క్రీడాకారులతో నోడల్ అధికారి

సంక్షిప్తం...



నిరసన తెలుపుతున్న గిరిజనులు

రేషన్ అందలేదని చింతలవీధి వాసుల నిరసన

పాడేరు, జనవరి 5: చింతలవీధి జీసీసీ డిపో పరిధిలోని కార్డుదారులకు ఈ నెల రేషన్ సరుకులు అందలేదని శుక్రవారం ఐటీడీఏ ఎదుట గిరిజనులు నిరసన తెలిపారు. తమ డిపోకు ఈ పోస్ యంత్రం ఏర్పాటు చేశారని, ఇంటర్నెట్ సిగ్నల్స్ లేక అది పని చేయడం లేదని చెప్పారు. దీంతో ఐదు రోజులుగా సరుకులు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఈ పోస్ యంత్రాన్ని తీసేసి, సాధారణ పద్ధతిలోనైనా తమకు సరుకులు అందించాలని కోరారు.

బోయలకు వ్యతిరేకంగా గిరిజనుల ఆందోళన

పాడేరు, జనవరి 5: బోయలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూషణరావు, ఎం.రాజబాబు మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన కులాలను ఎస్టీ జాబితాలో చేర్చితే గిరిజనులు మరింత వెనుకబాటుకు గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్లపై ఐటీడీఏ ఏపీవో కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య నేతలు భీమలమ్మ, దేవరాజ్, సోమేశ్, సింహాచలం, రామారావు పాల్గొన్నారు.

బోయలను ఎస్టీల్లో చేర్చొద్దని కేంద్ర మంత్రికి వినతి

చింతపల్లి జనవరి 5: బోయవాల్మీకులను ఎస్టీల జాబితాలో చేర్చవద్దని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జూయల్ ఒరంకి వినతిపత్రం అందజేసినట్టు భారతీయ ఆదివాసీల సమాఖ్య అధ్యక్షుడు జి.రామ్‌గోపాల్ తెలిపారు. అభివృద్ధి చెందిన బోయలను ఎస్టీ జాబితాలో చేర్చితే అపారమైన నష్టం జరుగుతోందని నవరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మజ్జితో కలిసి మంత్రికి విజ్ఞప్తి చేయగా, దీనికి సానుకూలంగా స్పంధించారన్నారు. ఆయన వెంట శ్రీనివాస్, వైకుంఠరావు, రామరావు, కాంతారావు ఉన్నారు.

సీపీఎస్‌పై సదస్సు రేపు

పాడేరు, జనవరి 5: సీపీఎస్ పింఛన్ విధానంపై ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు ఈనెల ఏడో తేదీన స్థానిక గిరిజన ఉద్యోగుల భవనంలో సదస్సును నిర్వహిస్తామని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోషియేషన్ ప్రతినిధి బృందం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిసింది. సీపీఎస్ పింఛన్ పొందే ప్రతి ఉద్యోగి ఈ అవగాహన సదస్సుకు విచ్చేయాలని వారు కోరారు.

మన్యం సంతల్లో సంక్రాంతి సందడి



వారపు సంత కారణంగా జనంతో కిక్కిరిసిన పాడేరు ప్రధాన రహదారి

పండుగ సామగ్రి కొనుగోలుకు తరలి వచ్చిన గిరిజనులు

కిటకిటలాడుతున్న దుకాణాలు

పాడేరు, జనవరి 5: మన్యంలోని ఏ వారపు సంత చూసినా సందడిగా కనిపిస్తున్నది. సంక్రాంతి పండుగ సమీపిస్తుండడంతో వివిధ సామగ్రి కొనుగోలుకు గిరిజనులు తండోపతండాలుగా తరలి వస్తున్నారు. దీంతో సంతల్లో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

పండుగలకు అవసరమైన కొత్త బట్టలు, ఇతర సామాగ్రిని కొనుగోలు చేసేందుకు గిరిజనులు వారపు సంతలపైనే ఆధార పడుతుంటారు. గిరి పల్లెల్లోని జనం సంతల బాట పడుతుండడంతో ఆయా ప్రాంతాలు రద్దీగా ఉంటున్నాయి. శుక్రవారం పాడేరులోని వారపు సంత జనంతో కళకళలాడింది. గిరిజనులు పండించే వ్యవసాయ ఉత్పత్తులు, సేకరించిన అటవీ ఉత్పత్తులను సంతల్లో విక్రయిస్తున్నారు.



పిల్లలకు బట్టలు కొంటున్న తల్లిదండ్రులు

వాటి విక్రయం ద్వారా వచ్చిన డబ్బులతో వారికి అవసరమైనవి కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది సాధారణ సంక్రాంతికి ముందే గిరిజనుల పండుగ నిర్వహించుకునే అవకాశం ఉంది. దీంతో సంతలకు కుటుంబ సమేతంగా గిరిజనులు వస్తున్నారు.

అలాగే గిరిజన పల్లెల్లో ఎటువంటి దుకాణాలు లేకపోవడంతో గిరిజనులు వారపు సంతలకు విచ్చేసి వారికి అవసరమైనవి కొనుగోలు చేయడం సాధారణం. దీంతో జనవరి రెండో వారం వరకు ఏజెన్సీలో జరిగే వారపు సంతలు జనంతో కళకళలాడతాయి.

పాడేరులో ఆక్రమణలపై రెవెన్యూ కొరడా



తలారిసింగిలో పెట్టిన హెచ్చరిక బోర్డు

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట

ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు

పాడేరు, జనవరి 2: రోజురోజుకూ విస్తరిస్తున్న పాడేరు పట్టణంలో భూ ఆక్రమణలు సైతం అదే స్థాయిలో జోరందుకున్నాయి. ఖాళీ జాగా కనిపించడమే తరువాయి పాగా వేసేందుకు అక్రమార్కులు గెద్దల్లా వాలిపోతున్నారు. ఇళ్ల నిర్మాణాలకు కూడా వెనుకాడడం లేదు. దీనిపై రెవెన్యూ యంత్రాంగం సీరియస్‌గా స్పందించింది. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా సబ్ కలెక్టర్ బాలాజీ డీకే పట్టణంలోని ప్రభుత్వ భూముల పరిక్షణపై ప్రత్యేక దృష్టిసారించారు. ఇందులో భాగంగా పట్టణంలో పలు వీధుల్లోని ప్రభుత్వ భూముల్లో ఆక్రమంగా నిర్మించిన ఇళ్లను నిలిపివేస్తున్నారు. అంతేకాకుండా పట్టణంలోని ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని తహసీల్దార్, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రభుత్వ రెవెన్యూ అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగారు. ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఫలితంగా కొన్ని రోజులుగా పట్టణంలో భూ ఆక్రమణలు తగ్గుముఖం పట్టాయి.



ఓ నిర్మాణం వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

బడిఈడు పిల్లలంతా పాఠశాలలోనే ఉండాలి

చౌడుపల్లి (చింతపల్లి) జనవరి 5: బడిఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉంటూ చదువుకోవాలని చౌడుపల్లి సర్పంచ్ అప్పలమ్మ కోరారు. జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాప్-1, 2 విద్యార్థులు, అధ్యాపకులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ, తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు క్రమంగా పంపించాలని కోరారు. అలాగే ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసపాత్రుడు, జూనియర్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎల్.గణేష్, వెంకటరావు, నోడల్ అధికారి ఉగ్రంగి గణేశ్వరరావు, ఎంపీయూపీఎస్ హెచ్ఎం ఎల్.చిట్టినాయుడు పాల్గొన్నారు.

వినతులను ఆన్‌లైన్‌లో పొందుపరచండి

సబ్ కలెక్టర్ బాలాజీ డీకే

లోతుగెడ్డ (చింతపల్లి) జనవరి 5: జన్మభూమిలో వచ్చిన వినతులను అదే రోజు సాయంత్రం ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని పాడేరు సబ్ కలెక్టర్ బాలాజీ డీకే అన్నారు. లోతుగెడ్డ పంచాయతీలో సర్పంచ్ సావిత్ర అధ్యక్షతన శుక్రవారం జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జన్మభూమి మా ఊరు కార్యక్రమాలు సమయానికి ప్రారంభించాలని, ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించి సాయంత్రం ఐదుగంటల తరువాత కార్యక్రమాన్ని ముగించాలని సూచించారు. సభలకు అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్, ఎంపీడీవో రహ్మాన్, ఈవోఆర్‌డీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజావాణికి 42 వినతులు

పాడేరు, జనవరి 5: ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి 42 వినతులు అందాయి. వీటిని ఏపీవో ఎస్ఎస్ఎస్.కుమార్ స్వీకరించి, ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హుకుంపేట మండలం పాతకోట, పనసపుట్టు గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకున్న 293 మందికి బిల్లులు చెల్లించలేదని గిరిజనులు తెలిపారు. అలాగే పెదబయలు మండలం గోమంగి పంచాయతీ కుమ్మరివీధికి చెందిన రాజారావు, తన కుమారుడికి ఉద్యోగం ఇస్తారనే హామీపై పీహెచ్‌సీ నిర్మాణానికి 50 సెంట్లు భూమిని ఇచ్చామని, కొన్నాళ్లు మాత్రమే రూ.8 వేలు జీతం ఇచ్చే ఉద్యోగం ఇచ్చారని, తర్వాత విస్మరించారని, తమకు న్యాయం చేయమని కోరాడు. తన భార్య ప్రసవ సమయంలో 108 వాహనం కోసం కాల్ చేస్తే రాలేదని, దీంతో ప్రైవేటు వాహనాన్ని సమకూర్చుకుని ఆమెను ఆస్పత్రిలో చేర్పించానని, 108 సిబ్బందిపై చర్యలు చేపట్టాలని జి.మాడుగుల మండలం గడుతూరు గ్రామానికి చెందిన జె.రామకృష్ణ ఫిర్యాదు చేశారు.

జన్మభూమి-మా ఊరుతో సమస్యల పరిష్కారం

జి.మాడుగుల, జనవరి 5: జన్మభూమి-మా ఊరు కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని ప్రత్యేకాధికారి శంకర్‌రెడ్డి అన్నారు. నుర్మతి, బొయితిలి, పెదలువ్వాసింగి, కోరాపల్లి పంచాయతీ కేంద్రాల్లో శుక్రవారం ఎంపీడీవో ప్రేమాకర్, తహసీల్దార్ పాడిపంతులు ఆధ్వర్యంలో జన్మభూమి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జన్మభూమిలో విన్నవించుకున్న సమస్యలు తప్పకుండా పరిష్కారమవుతాయన్నారు. బొయితిలిలో బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించొద్దని తీర్మాన పత్రాన్ని సర్పంచ్ టి.రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు శాంతి తహసీల్దార్ అందజేశారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి

పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ.సత్యనారాయణమూర్తి

పాడేరు రూరల్: జనవరి 5: పాడేరులో వచ్చే నెల నిర్వహించే 23వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ.సత్యనారాయణమూర్తి కోరారు. ఎన్జీవో హోమ్‌లో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశల ఆయన మాట్లాడుతూ, మన్యంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం 23వ జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కె.భూషణరావు, జిల్లా సహాయ కార్యదర్శి బి.వెంకటరమణ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శులు ఎ.విమల, దెశిది, భీమాలమ్మ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గం

మాడుగుల - దేవరాపల్లి - కె.కోటపాడు - చీడికాడ

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ

వరహాపురం (చీడికాడ), జనవరి 5: పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని జెబి.పురం ఎంపీటీసీ సభ్యుడు రాకోట వెంకటసత్యనారాయణ అన్నారు. జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యాభివృద్ధిపై వరహాపురం హైస్కూల్‌లో అవగాహన సదస్సు జరిగింది. ఈ పాఠశాలల్లో ఉన్న సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. హెచ్‌ఎంలు జి.అప్పారావు, యర్రా సత్యనారాయణ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తం



పశువులకు ఆరోగ్య బీమా

మంచాల(చీడికాడ), జనవరి 5: పాడిరైతుల అభివృద్ధికి విశాఖ డెయిరీ ముందంజలో ఉంటుందని విశాఖ డెయిరీ డాక్టర్ నాయుడు అన్నారు. మంచాల గ్రామంలో 48పశువులకు ఇన్సూరెన్స్ చేశారు. రూ.20వేలు నుండి రూ.45వేలు విలువ గల పశువులకు ఇన్సూరెన్స్ చేశామన్నారు. పశువులకు ఏ ప్రమాదం జరిగినా విశాఖ డెయిరీపశువైద్యాధికారులు సేవలందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మరో వైద్యాధికారి రాజు, పాలసంఘం కార్యదర్శి వంటాకు నర్సింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.



విద్యాభివృద్ధిపై ర్యాలీ

కోనాం (చీడికాడ), జనవరి 5: హరిజన, గిరిజనుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కోనాం సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ అన్నారు. విద్యాభివృద్ధి - పరిసరాల పరిశుభ్రతపై కోనాం గిరిజన ఆశ్రమోన్నత పురుషుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు గ్రామంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఒకటో తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తే ప్రభుత్వం ఎన్నో రాయితీలు కల్పిస్తుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చి ఇంటింటి మరుగుదొడ్డిని తప్పనిసరిగా నిర్మించాలని కోరారు. పాఠశాల హెచ్‌ఎం వీవీ రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు, వీఆర్‌వో భరద్వాజ్, హెల్త్ అసిస్టెంట్ జగన్ పాల్గొన్నారు.

11 లోగా ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించాలి

చోడవరం టౌన్, జనవరి 5: ఈ ఏడాది ఏప్రిల్ 20 నుంచి ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా జరగబోయే టెన్త్,ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజు ఈ నెల 11లోగా ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చని బీఆర్‌కే ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ఏవీఎస్‌వీఎస్.ప్రసాదరావు తెలిపారు. 2013, 2014, 2015, 2016 సంవత్సరాలలో చోడవరం బీఆర్‌కే కళాశాలలో అడ్మిషన్లు పొంది ఉత్తీర్ణులు కాని వారు లక్ష్మీపురం రోడ్డు, కోనాం గెస్ట్‌హౌస్ వెనుక ఉన్న కళాశాలలో సంప్రదించాలని, మరిన్ని వివరాల కోసం 8019512349 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.



సొంత భవనం



అద్దె భవనం

సొంతగూడున్నా అద్దె భవనమే గతి

హౌసింగ్ ఏఈ కార్యాలయం దుస్థితి ▸▸ లక్షలు వృథా

మాడుగుల రూరల్, జనవరి 5 : మాడుగుల నియోజకవర్గం, మండలకేంద్రమైన మాడుగులలో ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి దయనీయంగా మారింది. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు స్థల సమస్య పలు కారణాల వల్ల సొంతగూడు కరువై అద్దెభవనాలపైనే అధారపడాల్సిన దుస్థితి నెలకొంటోంది. మండల పరిషత్ కార్యాలయం, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం, వ్యవసాయశాఖ కార్యాలయం, మత్స్యశాఖ కార్యాలయం, సబ్‌ట్రెజరీ, సబ్ రిజస్ట్రార్ కార్యాలయం, ఇలా పలు కార్యాలయాలు నేటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కానీ సొంతభవనం ఉన్నప్పటికీ అద్దెభవనంలోనే విధులు నిర్వహించాల్సిన పరిస్థితిలో మాడుగుల గృహనిర్మాణశాఖ సహాయక ఇంజనీరు కార్యాలయం ఉంది.

నాలుగేళ్ల కిందట రెండు లక్షల వ్యయంతో మాడుగుల అర్బన్ కాలనీ సమీపంలో చెరువుకు ఆనుకుని హౌసింగ్ ఏఈ కార్యాలయం నిర్మించారు. అప్పటికే హౌసింగ్ డీఈ కార్యాలయం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇటీవల హౌసింగ్ ఏఈ కార్యాలయం సమీపంలో ఎదురుగా ఉన్న అద్దె భవనంలోకి హౌసింగ్ డీఈ కార్యాలయం మార్చారు. ఇదిలా ఉంటే సొంతభవనంలో ఉన్న హౌసింగ్ ఏఈ కార్యాలయంలో సరైన సదుపాయాలు లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులకు గురయ్యేవారు. కిటికీలకు తలుపులు లేకపోవడం, గచ్చు పగుళ్లు రావడం, చుట్టూ తుప్పలు పెరిగిపోవడం, చెరువు సమీపంలోనే కార్యాలయం ఉండడం వల్ల చిన్న చిన్న క్రిమికీటకాలు, దోమలు, పురుగులు లోపలికి ప్రవేశించడంతో ఇబ్బందులు గురయ్యేవారు.

వర్షాలకు ఒలిపిరి కొట్టి నీరు లోపలికి వచ్చేస్తుండడంతో రికార్డులు భద్రపర్చడం కష్టమైపోయేది. దీంతో రెండు నెలల కిందట ఎదురుగా అద్దె భవనంలో ఉన్న హౌసింగ్ డీఈ కార్యాలయంలోకి ఏఈ కార్యాలయాన్ని మార్చారు. సొంతభవనంలోనే రికార్డులను ఉంచడంతో వాటికి భద్రత కరువవుతుందనే ఆందోళన కనిపిస్తోంది.

లక్షలు ఖర్చు చేసి భవనం నిర్మించినప్పటికీ పూర్తిస్థాయిలో వసతులు కల్పించకపోవడంతో భవనం రాన్రానూ శిథిలావస్థకు చేరుకుంటోంది. దీనిపై హౌసింగ్ ఏఈ లెక్కల సత్యనారాయణను వివరణ కోరగా సొంత భవనంలో సరైన సదుపాయాలు లేవని, కిటికీలకు తలుపులు లేకపోవడం, గచ్చులు కూడా పగిలిపోవడం, పురుగులు లోపలికి వచ్చేస్తుండంతో ఇబ్బందులెక్కువయ్యాయన్నారు.

ఐసీడీఎస్, రెవెన్యూ శాఖల పనితీరుపై నిలదీత



అధికారులను నిలదీస్తున్న దృశ్యం

ఎల్‌బీ.పట్నం (చీడికాడ), జనవరి 5: మండలంలోని ఎల్‌బి.పట్నం గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఐసీడీఎస్, రెవెన్యూ శాఖల పనితీరుపై పలువురు గ్రామస్థులు నిలదీశారు. శుక్రవారం ఉదయం మాజీ సర్పంచ్ బండారు దేముడునాయుడు అంగన్‌వాడీ భవనంలో రిపేర్లు చేసి సొంత భవనంలోకి పిల్లలను ఏర్పాటు చేయాలని అధికారులను నిలదీశారు. అలాగే గ్రామంలో ప్రభుత్వ భూమి ఉన్నా ఆక్రమణలు తొలగింపులో అధికారులు విఫలం కావడంతో కనీసం ఇంటి స్థలాలు లేక పక్కా గృహాలు నిర్మించుకోలేకపోతున్నారని సీడీసీ డైరెక్టర్ కుదర గోవింద అధికారులను నిలదీశారు. ఇలా ఈ రెండు శాఖల అధికారుల పనితీరుపై సర్పంచ్ పాలవెల్లి, బండారు శేషగిరిరావుతోపాటు పలువురు గ్రామస్థులు నిలదీశారు. అల్లరి చేస్తున్న గ్రామస్థులను పోలీసులు వారించి పైకి తీసుకువచ్చారు. అంతకు ముందు విద్యార్థినుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఎంపీపీ కుచ్చు కళావతి, కురచా నారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కొత్తపెంటలో దేవానందస్వామి ఆరాధనోత్సవం రేపు



ఉత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొత్త పెంట (దేవరాపల్లి), జనవరి 5: మండలంలోని కొత్తపెంటలో దేవానంద స్వామి 18వ ఆరాధనోత్సవం ఈ నెల 7న జరగనుందని ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను రుషీకేశ్ స్వామీజీ శుక్రవారం విడుదల చేశారు. ఈ ఉత్సవాలకు రుషీకేశ్‌తోపాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు రానున్నారని ఆయన తెలిపారు. కమిటీ సభ్యులు కర్రి దేముడు, సిరికి శ్రీనివాసరావు, సిరికి నాగభూషణం, కార్యదర్శి నరసింగరావు, మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణంపై ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల మానవహారం



మారేపల్లి(దేవరాపల్లి), జనవరి 5: మండలంలోని మారేపల్లి గ్రామంలో తెనుగుపూడి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు(ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు) గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మొత్తం 120మంది విద్యార్థుల్లో మారేపల్లిలో రెండు బృందాలు, ఎస్.చేనులపాలెంలో ఒక బృందం 120మంది విద్యార్థులు గ్రూపులుగా ఇంటింటికీ వెళ్లి మరుగుదొడ్లపై సర్వే నిర్వహించారు. మరుగుదొడ్లు ఎవరెవరికి ఉన్నాయి అన్న విషయం తెలుసుకొని లేనివారు నిర్మించుకోవాలని గ్రామస్థులకు అవగాహన కల్పించడంతోపాటు ప్లెకార్డులు, బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ కోటిపల్లి నాయుడు, మాజీ సర్పంచ్ రామ్మూర్తి నాయుడు, ప్రిన్సిపాల్ కేవీ.రమణ, పీడీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు..

జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో.....

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.స్వర్ణలత ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు క ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. బహిరంగ మలవిసర్జన వల్ల వచ్చే అనర్థాలపై ప్లకార్డులు ప్రదర్శించారు.

ధింసా నృత్యం చేసిన మహిళా అధికారులు



తెనుగుపూడి (దేవరాపల్లి), జనవరి 5: మండలంలోని తెనుగుపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జన్మభూమి అనంతరం భోజన విరామ సమయంలో అధికారుల వద్ద ప్రదర్శించడానికి విద్యార్థినులు ధింసా నృత్యం చేస్తుండగా అక్కడే చూస్తున్న మహిళ అధికారులు గతంలో చదువుకున్న రోజులు గుర్తుకొచ్చి వారితోపాటు ధింసానృత్యం చేశారు. హైస్కూల్ హెచ్‌ఎం పాత్రుడు ఆధ్వర్యంలో విద్యార్థులు పాఠశాల గ్రౌండ్‌లో ధింసానృత్యం చేస్తుండగా జన్మభూమికి హాజరైన అధికారులంతా భోజనం చేసి బయటకు వస్తుండగా అక్కడి విద్యార్థినులంతా ధింసా నృత్యం చేస్తుండగా చూసి అధికారులు విద్యార్థినులతో కలిసి ధింసా నృత్యంలో పాల్గొన్నారు. కె.కోటపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆర్.ఉమాదేవి, దేవరాపల్లి వైద్యాధికారి ఆదిరెడ్డి సుష్మాకల్యాణి, జలాశయ ఏఈ కె.భాగ్యలక్ష్మి, పర్యవేక్షకురాలు స్వర్ణలత, పశువైద్యాధికారి మంజుషారాణి ధింసా నృత్యం చేశారు.

జూనియర్ కళాశాల విద్యార్థుల ర్యాలీ



గజపతినగరం (చోడవరం రూరల్), జనవరి 5: జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని గజపతినగరంలో చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు కె.గోవిందరావు, ఎం.రుషి, ఎన్.సంతోష్‌కుమార్, ఎ.సన్యాసిరావు పాల్గొన్నారు.

సంక్షిప్తం



భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి హోమం

చోడవరం టౌన్, జనవరి 5: సంకష్టహర చతుర్థి సందర్భంగా పట్టణంలోని స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీగణపతిహోమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు కొడమంచిలి గణేష్, అర్చకులు వెంకటరావు, సంగీస మహేష్, ధవళ ప్రసాద్, రాము తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ఎస్‌వీవీ.సత్యనారాయణమూర్తి, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చేకూరి శ్రీరామ్మూర్తిరాజు పాల్గొన్నారు.



ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

గునిశెట్టివారి వీధిలో తాగునీటి కష్టాలు

చోడవరం టౌన్, జనవరి 5: పట్టణంలోని గునిశెట్టి వారి వీధిలో ప్రజలు నాలుగు రోజులుగా తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. వీధి కుళాయిల పైప్‌లైన్ మరమ్మతులకు గురికావడంతో ఆ వీధికి చెందిన మహిళలు ఇబ్బందిపడుతున్నారు. పంచాయతీ వారు ట్యాంకరు ద్వారా సరఫరా చేస్తున్న నీరు సరిపోవడం లేదని వారంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

చోడవరంలో 5కె రన్ రేపు

చోడవరం టౌన్, జనవరి 5: జన్మభూమి-మావూరు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 6.30 గంటలకు కొత్తూరు జంక్షన్ నుంచి లక్ష్మీపురం వరకూ 5కె రన్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీవీ చిట్టిరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల, గ్రామస్థాయి అధికారులతో పాటు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించండి

రాయపురాజుపేట జన్మభూమి సభలో ఎంపీడీవో చిట్టిరాజు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎండీవో చిట్టిరాజు

చోడవరం, జనవరి 5: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని ఎండీవో జీవీ చిట్టిరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని రాయపురాజుపేట గ్రామంలో నిర్వహించిన జన్మభూమి సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటు అందిస్తోందన్నారు. అలాగే స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేస్తామని అన్నారు. ఎంపీటీసీ సభ్యుడు బొడ్డేడ రామునాయుడు మాట్లాడుతూ గ్రామంలో రక్షిత మంచినీటి పథకాలు ఉన్నప్పటికీ తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, అదనంగా మరో రక్షిత పథకం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాయపురాజుపేట, నరసాపురం, దుడ్డుపాలెం గ్రామాల విద్యార్థుల కోసం నరసాపురం పంచాయతీ స్కూల్‌ను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్, సర్పంచ్ బొడ్డేడ అచ్చియ్యమ్మ, డిప్యూటీ తహసీల్దార్ రాజా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఆధ్వర్యంలో అంభేరుపురంలో జరిగిన జన్మభూమి సభలో వైసీపీకి చెందిన స్థానిక ఎంపీటీసీ సభ్యుడు సూరిశెట్టి నాగదుర్గ గోవింద్ పింఛన్లు వీధి కొళాయిల కేటాయింపు విషయంలో స్థానిక నేతల తీరును తప్పుపడుతూ మాట్లాడడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ఎన్టీఆర్ హౌసింగ్ లబ్ధిదారుల ఎంపికలో పేర్లు చివరి నిమిషంలో మార్పులు చేసి అర్హులైన వారికి అన్యాయం చేశారని పీలా వెంకట సూరి అప్పారావు అసంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ కేవీఎస్ రవి, ఎంఈవో అచ్యుతరావు, ఈవోపీఆర్‌డీ ఆంజనేయులు, ఏవో శ్రీనివాస్, సర్పంచ్ వేగి మహలక్ష్మమ్మ, స్థానిక నాయకులు వేగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించలేదంటూ ఎంపీటీసీ సభ్యుడి ఆగ్రహం

తట్టబంద (రావికమతం), జనవరి 5: జన్మభూమి మా ఊరు కార్యక్రమానికి తనకు ఆహ్వానం పంపకనందుకు నిరసనగా అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు గోకాడ చినవెంకటరమణ గ్రామ సభను బహిష్కరించారు. మండలంలోని తట్టబంద గ్రామంలో శుక్రవారం జన్మభూమి గ్రామసభకు ఆ గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు చిన వెంకటరమణకు అధికారులు ఆహ్వానం పంపలేదు. దీంతో ఆయన సమావేశానికి హాజరు కాలేదు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సభ జరుగుతున్న సమయంలో తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు, వెంకటరమణ వర్గీయులు ఈ విషయమై అధికారులను నిలదీశారు. ఈ మేరకు సభకు రావాలని కోరుతూ తహసీల్దార్ అప్పటికప్పుడు సిబ్బందిని వెంకటరమణ ఇంటికి పంపించారు. కనీసం తనకు ఆహ్వానం పంపలేదని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే రాజు దృష్టికి తీసుకెళతానని వెంకటరమణ అన్నారు.

పొలేపల్లిలో....

పొలేపల్లి (బుచ్చెయ్యపేట) జనవరి 5 : తమ గ్రామ పంచాయతీ అభివృద్ధి తిరోగమనంలో పయనిస్తోందని పొలేపల్లి సర్పంచ్ సీతా వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం జరిగిన జన్మభూమి-మావూరు గ్రామసభలో మాట్లాడుతూ పంచాయతీకి మంజూరైన అభివృద్ధి పనులు జరగకపోవడంతో గ్రామం అన్నింటా వెనకబడిపోయిందన్నారు. పారదర్శకంగా వ్యవహరించవలసిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగి పనులు చేపట్టకపోవడంతో రెండేళ్ల క్రితం గ్రామ సచివాలయం భవన నిర్మాణానికి మంజూరైన రూ.12 లక్షలు, నీరు-చెట్టులో భీమ్‌పల్లివారి చెరువు పూడికతీతకు రూ.10లక్షలు, ఏడు చెక్‌డామ్‌ల నిర్మాణానికి రూ.35 లక్షలు మురుగుపోయాయన్నారు. అలాగే దిబ్బిడి, కందిపూడి, కేపీ అగ్రహారం గ్రామాల్లో జన్మభూమి సభలు జరిగాయి. మండల కో ఆర్డినేటర్ కేశవ్ పాండా, ఎంపీడీవో టి.కొండలరావు, తహసీల్దార్ కేవీవీ.శివ, సర్పంచ్‌లు పెదిరెడ్ల మాణిక్యం (బాషా), కొర్ని రమణమ్మ, ఎంపీటీసీ సభ్యులు గొన్నాబత్తుల శ్రీనివాస్, సీతా రాము, హెచ్‌డీటీ రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటరమణ

ఎన్.కొత్తూరు, నిండుగొండల్లో సభలు

ఎన్.కొత్తూరు(రోలుగుంట), జనవరి 5 : సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం జన్మభూమి-మావూరు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మండల ప్రత్యేకాధికారి ఏపీడీ ఆనందరావు అన్నారు. శుక్రవారం ఎన్.కొత్తూరు, నిండుగొండ గ్రామాల్లో జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఈ సభల ద్వారా పరిష్కరిస్తామన్నారు. గ్రామ సర్పంచ్ పోతల రాజశేఖర్ మాట్లాడుతూ తమ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం లేదన్నారు. ఐదు నెలల క్రితం సీసీ రోడ్ల కోసం తీర్మానం పంపిస్తే అధికారులు స్పందించలేదన్నారు. నాలుగు నెలల క్రితం గ్రామానికి చెందిన మాకిరెడ్డి శివలక్ష్మి అనారోగ్యం కారణంగా చనిపోతే చంద్రన్న బీమా కింద రూ.2లక్షలను ఆమె కుటుంబ సభ్యులకు అధికారులు అందించారు. నిండుగొండలో ఎంపీడీవో కె.శశీదేవి ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. ఈవోపీఆర్‌డీ రామ్మోహన్‌రావు, వైద్యాధికారి బాపిరాజు, ఏఈఓ చిరంజీవి, ఎంపీపీ గండి సింహాద్రి, సర్పంచ్ బాబులునాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎన్.కొత్తూరులో చంద్రన్న బీమా పంపిణీ చేస్తున్న అధికారులు

గజపతినగరంలో పండగలా జన్మభూమి



గజపతినగరంలో మహిళల కోలాటం

గజపతినగరం (చోడవరం రూరల్), జనవరి 5: మండలంలోని గజపతినగరంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని శుక్రవారం పండగలా నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి పి.వెంకటేశ్వరరావు, ఎంపీపీ గూనూరు కొండతల్లి, జడ్పీటీసీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, మాజీ ఎంపీపీ గూనూరు పెదబాబు, ఎంపీడీవో జీవీ చిట్టిరాజు, డిప్యూటీ తహసీల్దార్ ఎం.రాజా తదితరులు పాల్గొన్నారు. ముందుగా గ్రామ పంచాయతీ వద్ద స్థానిక మహిళలు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. అనంతరం గర్భిణులకు సీమంతాలు జరిపారు. కోలాట బృందాలకు నగదు ప్రోత్సాహం, విద్యార్థులకు ఉపకార వేతనాలు, పలువురికి రేషన్‌కార్డులు ధ్రువీకరణ పత్రాలు, నూతనంగా జారీ చేసిన రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు మళ్ల చినప్పడు, మారెడుపూడి రమాదేవి, కనిశెట్టి రామునాయుడు పాల్గొన్నారు. సింహాద్రిపురంలో తహసీల్దార్ కేఎస్‌వీ రవి ఆధ్వర్యంలో జన్మభూమి జరిగింది.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎంవి.స్వామి



మాట్లాడుతున్న స్వామి

అంభేరుపురం (చోడవరం రూరల్), జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో మార్పులు తీసుకువచ్చేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తుందని, దానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మీగడ వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని అంభేరుపురంలో శుక్రవారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో విద్య, వికాసం అంశంపై వివరించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి వరకూ విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన విద్య అందించడంతోపాటు దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్నం భోజనం ఉచితంగా అందిస్తోందని, 9 నుంచి ఇంటర్ స్థాయి వరకూ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామని అన్నారు. 10వ తరగతి అనంతరం ఉన్నత విద్య అవకాశాలు, స్వయం ఉపాధి కోర్సులు, దూరవిద్య బోధన, శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక విద్య తదితర అంశాలపై విద్యార్థులకు ఆయన వివరించారు. ఎంఈవో పి.అచ్యుతరావు, కేవీఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం నియోజకవర్గం

నర్సీపట్నం - గొలుగొండ - నాతవరం - మాకవరపాలెం

రియల్ మార్టులో పండగ సరుకులు


రియల్ మార్టులోని సరుకులు

గొలుగొండ, జనవరి 5: మండల కేంద్రంలోని చిన్న వర్తకుల రియల్ మార్టులో తక్కువ ధరలకే పండగ సరుకులు సిద్ధం చేశారు. మండలంలో అన్ని రకాలైన నిత్యవసర సరుకులు బయట మార్కెట్‌కన్నా కిలోకి రూ.ఐదు తక్కువకు అందిస్తున్నారు. సరుకులు ఆయా గ్రామాల్లోని రిటైల్ చైన్లలోనూ విక్రయిస్తున్నారు.

సంక్షిప్తం


మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

మరుగుదొడ్లపై విద్యార్థుల అవగాహన ర్యాలీ

నాతవరం, జనవరి 5: ప్రజలంతా వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలంటూ నాతవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. బహిరంగ మల విసర్జన వద్దు.. ఆరోగ్యానికి మరుగుదొడ్డి ముద్దంటూ విద్యార్థులు ర్యాలీలో నినాదాలు చేశారు. వచ్చే మార్చినాటికి శతశాతం మరుగుదొడ్లు నిర్మించుకోవాలని కోరారు. పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులంతా ప్రభుత్వమిచ్చే ఆర్థిక సాయంతో ముందుగా మరుగుదొడ్డి నిర్మించుకుని అందరికీ ఆదర్శంగా నిలవాలని హెచ్ఎం సుర్ల రామ్మూర్తి అన్నారు. ఈ ర్యాలీలో ఉపాధ్యాయులు సతీష్, రత్నకుమారి, హేమలత, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

5కే రన్‌ను విజయవంతం చేయాలి: ఆర్డీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సూర్యారావు

నర్సీపట్నం అర్బన్, జనవరి 5: జన్మభూమి-మాఊరు కార్యక్రమం లక్ష్యం అందరికి తెలిసేలట్టు ఈనెల 7న నర్సీపట్నంలో నిర్వహించనున్న 5కే రన్‌ను విజయవంతం చేయాలని ఆర్డీవో కె.సూర్యారావు కోరారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 5కే రన్ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడో తేదీ ఉదయం 6.30 గంటలకు ఎన్టీఆర్ స్టేడియం నుంచి పెదబొడ్డేపల్లి వరకు వెళ్లి తిరిగి ఎన్టీఆర్ స్టేడియంకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థల నుంచి ప్రాతినిధ్యం ఉండాలన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా 5వేలు, ద్వితీయ బహుమతి 3వేలు, తృతీయ బహుమతి 2వేలు ఉంటాయన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి జూన్‌గాలియేట్ మాట్లాడుతూ పరుగు నియమనిబంధనలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుకలరమణమ్మ, తహసీల్దార్లు వీవీరమణ, అంబేడ్కర్, తారకేశ్వర, ఎంపీడీవోలు జయమాధవి, యాదగిరేశ్వరరావు పాల్గొన్నారు.

పల్లెల్లో కోతులు స్వైరవిహారం

ఇబ్బందుల్లో ప్రజలు
బయటకు రావాలంటే హడల్
పట్టించుకోని అధికారులు


కృష్ణాదేవిపేటలో ఇళ్లపై కోతులు

కృష్ణాదేవిపేట, జనవరి 5: గొలుగొండ మండలంలో పలు గ్రామాల్లో కోతుల స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఎన్నో పర్యాయాలు పాలకులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకొనేవారే లేరు. ఇప్పటికే నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, కొంగశింగి, ఏఎల్‌పురం, తదితర గ్రామాల్లో విద్యార్థులు, గ్రామస్థులు కోతుల దాడిలో గాయాలు పాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కోతుల భయంతో ప్రజలు రాకపోకలు సాగించాలంటే భయపడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చిన చిన్నారులు, పెద్దలు, వృద్ధులపై కోతులు దాడి చేస్తున్నాయి. ఇళ్లలో ఉన్న పలు రకాల వస్తువులు నాశనం చేస్తున్నాయి. ఇప్పటికైనా అటవీశాఖాధికార్లు స్పందించి కోతుల బోనులను ఉపయోగించి వాటిని పట్టుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నీరుగారుతున్న జలసిరి

రెండేళ్లుగా పత్తాలేని పథకం.. నిరాశలో రైతులు... వందల సంఖ్యలో దరఖాస్తులు... పరిష్కారం శూన్యం

మాకవరపాలెం, జనవరి 5: చిన్న,సన్నకారు రైతుల భూములను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం అమలు చేసిన ఎన్టీఆర్ జలసిరి పథకం మండలంలో నీరుగారింది. క్షేత్రస్థాయిలో పథకాన్ని అధికార యంత్రాంగం పక్కాగా అమలు చేయలేకపోతున్నది. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా మోక్షం కలగడం లేదని రైతాంగం విమర్శిస్తున్నది.

మండలంలో జలసిరి బోర్లు కోసం వందల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన వాటిలో కొన్ని దరఖాస్తులకు మోక్షం కల్గించిన అధికారులు మిగిలిన వాటిపై నిర్లక్ష్యం వహించడంతో బోర్లు వేసుకోవాలకుని ఆశ పడిన రైతులను తీవ్ర నిరాశకు గురిచేశారు. అయితే ఒకేప్రాంతంలో ఐదు ఎకరాల పొలం ఉన్న నలుగురు రైతులు తమకు బోరు అవసరమని సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే జియోలజిస్టులు పరిశీలించిన తర్వాత బోరును మంజూరు చేస్తారు. ఇందులో భాగంగానే మండలంలో 385 మంది


జలసిరి బోరుకి వేసిన సోలార్ విద్యుత్

రైతులు జలసిరి బోర్లకు దరఖాస్తులు చేశారు. వాటిలో 51 బోర్లును గుర్తించగా, 13 బోర్లును మాత్రమే తవ్వారు. శెట్టిపాలెంలో ఏడు, జెడ్.గంగవరంలో మూడు, తామరంలో రెండు, రామన్నపాలెంలో ఒక బోరు తవ్వారు. మిగిలిన చోట్ల ఎక్కడా బోర్లు తవ్వలేదు. అయితే ప్రభుత్వం రూ.40వేలతో బోర్లు తవ్వడంతోపాటు బోరుకు విద్యుత్ కనెక్షన్, సోలార్ పవర్, మోటారు అమర్చేందుకు రూ.55వేలు ప్రభుత్వం మంజూరు చేస్తుంది. అయితే ఎస్సీ, ఎస్టీలయితే రూ.6వేలు, ఓసీ, బీసీలైతే రూ.25 వేలు డీడీ రూపంలో చెల్లించాలి. ఇందులో భాగంగా శెట్టిపాలెంలో ఉన్న ఏడు బోర్లుకు సోలార్ విద్యుత్‌ను రైతులు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఆ గ్రామంలో జలసిరి బోర్లు వల్ల సాగు నీరు బాగానే వస్తుందని రైతులు అంటున్నారు. అయితే ప్రభుత్వం జలసిరికి నిధులు నిలిపివేయడంతో తవ్విన బోర్లు వృథాగా ఉన్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. రు.జియాలజిస్టులు పరిశీలించిన చోట బోర్లు వేయకపోవడంతో మరికొందరు రైతులు నిరాశ చెందారు. దీనిపై నర్సీపట్నం డివిజన్ ఏపీడీ శ్రీనివాసకుమార్‌ను వివరణ కోరగా, ఉపాధి హామీ నిధులు ద్వారా జలసిరి పథకంలో కొన్నిచోట్ల బోర్లు తవ్వామన్నారు. ప్రస్తుతం ఉపాధి నిధులను కేంద్ర ప్రభుత్వం ఆపివేసిందన్నారు. అందువల్ల జలసిరి బోర్లు తవ్వడం నిలిపివేశామన్నారు. అయితే ప్రభుత్వం నాబార్డు నిధుల ద్వారా జలసిరి బోర్లును తవ్వాలని చెబుతున్నారు. ఆదేశాలు వచ్చిన వెంటనే బోర్లు మొదలు పెడతామన్నారు.

దరఖాస్తు చేసినా ఫలితం లేదు..
పోలిరెడ్డి రమణ, కొండల అగ్రహారం



దరఖాస్తు చేసి రెండేళ్లు కావస్తున్నా నేటికి అమలుకు నోచుకోలేదు. ఎవరిని కలవాలో తెలియని పరిస్థితి. జియాలజిస్టులు భూమి వద్దకు బోరు తవ్వే ప్రదేశాన్ని పరిశీలించి వెళ్లిపోయారు. మరలా దరఖాస్తు చేస్తామంటే అవసరం లేదని స్థానిక అధికారులు చెబుతున్నారు.

నేటికీ మంజూరు కాని బోరు
అడిగర్ల శ్రీను, వెంకయ్యపాలెం



జియాలజిస్టులు వచ్చి బోరు తవ్వే ప్రదేశాన్ని గుర్తించినప్పటికీ నేటికీ బోరు మంజూరు చేయలేదు. పంచాయతీ పరిధిలో ఒక్క బోరు మాత్రమే తవ్వి వదిలివేశారు. అసలే మెట్ట ప్రాంతాలు కావడంతో జలసిరి బోరు వస్తే కష్టాలు పోతాయని ఆనుకున్నాం. ఈ ఏడాది నీటి తడులు అందక వరి సాగు దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి.

నిర్మించిన రెండేళ్లకే శిథిలం

రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో భవనం దుస్థితి

నాతవరం, జనవరి 5 : మండలంలోని సరుగుడు పంచాయతీ శివారు గ్రామం రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో రూ. 21 లక్షలతో నిర్మించిన భవనానికి రెండేళ్లకే మరమ్మతులు చేపడుతున్నారు. ఈ పాఠశాలలో రూ. 21 లక్షలు సర్వశిక్షాభియాన్ నిధులతో అదనపు భవనం నిర్మించారు. భవనం నిర్మించిన తరువాత శ్లాబ్ ఫ్లోరింగ్ ఊడ్చలేదు. దీంతో అప్పుడే గదుల్లోని గచ్చులు పాడై గోతులు ఏర్పడ్డాయి. శ్లాబ్‌పై నీరు నిల్వ ఉండడంతో వెంటనే నీరు బయటకు పోవడానికి శ్లాబ్‌పై ఫ్లోరింగ్ చేయాలని, గచ్చులు బాగు చేయాలని హెచ్ఎం అధికారుల దృష్టికి తీసుకు


రామన్నపాలెంలో శ్లాబ్ ఫ్లోరింగ్ పనులు

రావటంతో సంబంధిత కాంట్రాక్టర్ శ్లాబ్ ఫ్లోరింగ్ పనులు చేస్తున్నారు. పాడైన గచ్చులకు కూడా మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


రూ. 21 లక్షలతో నిర్మించిన పాఠశాల గదుల దుస్థితి

సంక్షిప్తం


పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న జడ్.గంగవరం వృద్ధులు

పింఛన్లు మంజూరు చేయరూ

జడ్.గంగవరం వృద్ధులు

జడ్.గంగవరం (మాకవరపాలెం), జనవరి 5: నాలుగు జన్మభూమి సభల్లోని దరఖాస్తు చేసినా నేటికీ పింఛన్లు పొందలేకపోయామని జడ్.గంగవరం గ్రామానికి చెందిన వృద్ధులు వాపోయారు. పింఛన్ పొందేందుకు అర్హత ఉన్నప్పటికీ నేటికీ మంజూరు చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి జన్మభూమి సభలోని దరఖాస్తు చేయడం, తర్వాత సభలో వెల్లడిస్తున్న జాబితాలో పేర్లు ఉండడం లేదన్నారు. ఆధార్‌లో 65 సంవత్సరాలకు పైబడి వయస్సు ఉన్నప్పటికీ అధికారులుగాని, జన్మభూమి కమిటీ సభ్యులు పింఛన్లు మంజూరు చేయడం లేదని చెబుతున్నారు. ఐదో విడత జన్మభూమి సభలో కూడా దరఖాస్తు చేశామని వారంటున్నారు. అన్నీ అర్హతలు ఉన్నప్పటికీ పేదలమైన తమకు పింఛన్ లేదని వాపోయారు. అధికారులు విచారణ చేసి తమకు అర్హత ఉంటేనే పింఛన్లు మంజూరు చేయాలని వారు కోరారు.

ఓడీఎఫ్‌పై విద్యార్థుల ర్యాలీలు

కృష్ణాదేవిపేట, జనవరి 5: ప్రతీ పంచాయతీ ఓడీఎఫ్‌గా మారాలని చోద్యం, ఏఎల్‌పురం, కృష్ణాదేవిపేట, కొంగశింగి, తదితర గ్రామాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు మలవిసర్జన వద్దు..మరుగుదొడ్డే ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో కృష్ణాదేవిపేట, చోద్యం హైస్కూల్ల హెచ్ఎంలు ఆకుల కుమారి, జి.రత్నాజీ మాట్లాడుతూ మరుగుదొడ్డను అందరూ ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలిది లచ్చుపంతులు, అచ్చిబాబు, సురేంద్ర, టీవీ రమణ, చైర్మన్ శెట్టి రమణ, తదితరులు పాల్గొన్నారు.

జూదాలు, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

గొలుగొండ, జనవరి 5: సంక్రాంతి సందర్భంగా జూదాలు, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు చేపడతామని ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గొలుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో పండగలు సందర్భంగా కోడిపందాలు, జూదాలు నిర్వహించినా, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. ఎక్కడ అయినా సమాచారమిస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

పాయకరావుపేట
నియోజకవర్గం

పాయకరావుపేట - నక్కపల్లి - కోటవురట్ల - ఎస్.రాయవరం

మహిళలకు ఫ్యాషన్ టెక్నాలజీలో శిక్షణ

పాయకరావుపేట, జనవరి 5: మహిళలకు ఫ్యాషన్ టెక్నాలజీలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని గ్రామ స్వరాజ్య సమితి కార్యదర్శి బద్ది రాము అన్నారు. శిక్షణ పూర్తిచేసినవారికి శుక్రవారం ధ్రువపత్రాలను పంపిణీ చేశారు.



సంక్షిప్తం



చెంబు శవయాత్ర ర్యాలీ

బహిరంగ మలవిసర్జన నిర్మూలన ర్యాలీ

సత్యవరం(పాయకరావుపేట), జనవరి 5 : మండలంలోని సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో వ్యక్తిగత మరుగుదొడ్లపై అవగాహన కల్పిస్తూ బహిరంగ మలవిసర్జన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చెంబును పాడిపై కట్టి గ్రామంలో శవయాత్ర ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత, బహిరంగ మలవిసర్జన నిర్మూలనకు కృషిచేయాలని ప్లకార్డుల ప్రదర్శన చేశారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థునులు వివిధ వేషధారణతో పలువురుని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.అమ్మాజి, ఎంబీఎస్ఎన్,మూర్తి, శ్రీనివాసరావు, శివాజీతోపాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జన్మభూమి గ్రామసభల వివరాలివే

నక్కపల్లి,జనవరి5: మండలంలోని చినతీనార్ల, సీహెచ్ఎల్‌పురం గ్రామాల్లో శనివారం ఎంపీడీవో పిడుగు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జన్మభూమి-మా ఊరు సభలు జరుగుతాయి. ఎన్.నర్సాపురం,పెదతీనార్ల గ్రామాల్లో తహసీల్దార్ రాణీ అమ్మాజీ ఆధ్వర్యంలోనూ, ఉద్దండపురం,నెల్లిపూడి గ్రామాల్లో ఈవోఆర్‌డీ ఆధ్వర్యంలో జన్మభూమి- మా ఊరు సభలు జరుగుతాయని ఎంపీడీవో తెలిపారు.

ఎస్.రాయవరం మండలంలో..

ఎస్.రాయవరం,జనవరి 5: మండలంలోని గుడివాడ, కొత్తరేవుపోలవరం, రేవుపోలవరం గ్రామాల్లో శనివారం జన్మభూమి - మా ఊరు సభలు జరుగుతాయని ఎంపీడీవో డీడీ స్వరూపారాణి తెలిపారు. ఈ సభలను ప్రజాప్రతినిధులు, అధికారులు విజయవంతం చేయాలని కోరారు.

నేడు నాలుగు గ్రామాల్లో జన్మభూమి - మా ఊరు

పాయకరావుపేట, జనవరి 5: మండలంలో 5వ విడత జన్మభూమి - మా ఊరు కార్యక్రమాన్ని శనివారం నాలుగు పంచాయతీల్లో నిర్వహించనున్నారు. ఎంపీడీవో ఎ.ఎ.సాంబశివరావు ఆధ్వ ర్యంలో మండలంలో కొత్తూరు, పెదరాంభద్రపురం గ్రామాల్లో నిర్వహించనుండగా తహసీల్దారు పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో గుంటపల్లి, సీతారాంపురం గ్రామాల్లో నిర్వహించనున్నారు.







రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న అధికారులు,ప్రజాప్రతినిధులు. పందూరులో వడ్డీలేని రుణం అందజేస్తున్న ఎమ్మెల్యే వంగలపూడి అనిత,పెంటకోటలో జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జన్మభూమి - మా ఊరు రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ రవిశంకర్

పెంటకోట(పాయకరావుపేట), జనవరి 5 : గ్రామాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జన్మభూమి - మా ఊరు రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ రవిశంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెంటకోట గ్రామంలో సర్పంచ్ చిక్కాల అమరావతి అధ్యక్షతన నిర్వహించిన 5వ విడత జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, అందజేస్తున్న సేవలను తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు చిక్కాల రామారావు మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమాల్లో ప్రజలు అర్జీలు తీసుకోవడమేగాని ఒక్కటి కూడా పరిష్కారం కావడంలేదన్నారు. రైతు రుణ మాఫీ చేశామని ప్రభుత్వం చెప్పుకోవడం తప్పితే సక్రమంగా రైతుల రుణమాఫీ కావడం లేదన్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం ఇచ్చేసాయం ఇప్పటికీ సగం మందికి అందలేదని ఆరోపించారు. ఇందుకు స్పందించిన రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిక్కాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనంతరం గోపాలపట్నంలో సర్పంచ్ డి.సుధాకర్ ఆధ్యక్షతన జన్మభూమి - మా ఊరు కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో ఎ.ఎ.సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ రెండు కార్యక్రమాల్లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఆయా గ్రామాల పెద్దలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

అర్హులైన వారే పథకాల్లో లబ్ధిదారులు

ఎస్.రాయవరం, జనవరి5: అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అందజేయాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం జన్మభూమి- మాఊరు కార్యక్రమాలను నిర్వహిస్తోందని నియోజకవర్గం ప్రత్యేకాధికారిణి పుష్పమణి చెప్పారు. మండలంలోని గెడ్డపాలెం, భీమవరం, వమ్మవరం గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి - మా ఊరు సభల్లో ఆమె ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎంపీడీవో డీడీ స్వరూపారాణి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల్లో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. రైతు రుణ ఉపశమన పత్రాలను అందజేశారు. భీమవరం గ్రామంలోని పలువురు తమ గ్రామానికి 104 వాహనం రావడం లేదని, వైద్య,ఆరోగ్యశాఖ కార్యకర్తలు అందుబాటులో వుండడం లేదని ఫిర్యాదు చేశారు. జడ్పీటీసీ సభ్యురాలు బొట్టాలక్ష్మి, ఈవోఆర్‌డీ కొండలరావు, ఎంఈవో మూర్తి, సర్పంచ్ గరగా లక్ష్మి, గ్రామ పెద్దలు అతికంశెట్టి అప్పారావు, గరగా శ్రీను పాల్గొన్నారు.

నక్కపల్లిలో...

నక్కపల్లి,జనవరి 5: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం జన్మభూమి- మా ఊరు సభలు జరిగాయి. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను, రైతు రుణమాఫీ ఉపశమన పత్రాలను లబ్దిదారులకు అధికారులు,ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. బుచ్చిరాజుపేట, చందనాడ గ్రామాల్లో ఎంపీడీవో పిడుగు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మభూమిలో మండల జన్మభూమి కమిటీ ప్రతినిధి కురందాసు నూకరాజు మాట్లాడారు. సర్పంచ్‌లు గొర్ల అమ్మాజీ, గంటా వాణి, ఎంపీటీసీ సభ్యులు గట్టెం నానాజీ, టీడీపీ నాయకులు కాళ్ల వీరాస్వామి, పుణ్యమంతుల రమణ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని న్యాయంపూడి గ్రామంలో సర్పంచ్ ఆకేటి గోవిందరావు అధ్యక్షతన నిర్వహించిన జన్మభూమి- మా ఊరు సభలో తహసీల్దార్ రాణీ అమ్మాజీ మాట్లాడారు. జన్మభూమి సభల ఉద్దేశాన్ని ఆమె ప్రజలకు తెలియజేశారు. సర్పంచ్ గోవిందరావు కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. దోసలపాడు, ముకుందరాజుపేట గ్రామాల్లో ఈవోఆర్‌డీ పీఎస్ కుమార్ నేతృత్వంలో ఈ సభలు జరిగాయి.

శతశాతం గ్యాస్ కనెక్షన్లు చంద్రబాబు ఘనతే

కోటవురట్ల, జనవరి 5: మహిళలకు శతశాతం గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దక్కుతుందని పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత కొనియడారు. శుక్రవారం మండలంలోని పందూరు పంచాయతీలో సర్పంచ్ నారాయణరావు అధ్యక్షతన జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జన్మభూమి -మా ఊరు కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలను ప్రజల దరచేర్చే బృహత్తర కార్యక్రమాన్ని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి, ఇళ్లు, ఫించను వంటి సంక్షేమ ఫలాలు అందించే చక్కని అవకాశం జన్మభూమి కార్యక్రమ అని అన్నారు. పొదుపు మహిళకు పదివేల ఇవ్వాలనే సంకల్పంతో పనిచేస్తున్నారన్నారు. చంద్రన్న భీమా పేదకుటుంబాలకు ఆత్మస్థైర్యాన్ని ఇస్తుందన్నారు. చంద్రబాబునాయుడు మహిళల కోసం వడ్డీలేని రుణాలు, దీపం పథకం కింద గ్యాస్‌ను కూడా మంజూరు చేస్తారన్నారు. ఈగ్రామసభలకు జన్మభూమి పరిశీలకుడు ఐపీఎస్ అధికారి రవిశంకర్, ఎంపీపీ అయ్యపురెడ్డి వరహాలమ్మ, మండల ప్రత్యేక అధికారి శ్రీధర్, శీనివాసరావు, దేశంపార్టీ మండల అధ్యక్షుడు లాలం కాశీనాయుడు, ఎంపీడీవో బికళ్యాణీ, తదితరులు పాల్గొన్నారు.

పేట సమస్యలు పరిష్కరించాలి

జన్మభూమిలో సీపీఐ నాయకుల విజ్ఞప్తి

పరిష్కారానికి కృషిచేస్తాం: తహసీల్దార్ పాండురంగారెడ్డి

పాయకరావుపేట, జనవరి 5 : పాయకరావుపేటలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అధికారులు పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ ధనిశెట్టి నాగమణి అధ్యక్షతన జరిగిన 5వ విడత జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అందించే సేవలు వివరించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు మాట్లాడుతూ ప్రభుత్వ జన్మభూమి కార్యక్రమ నిర్వహణ అధికారులుగా ప్రతి ఏటా వచ్చి కార్యక్రమం నిర్వహించి వెళ్ళిపోతున్నారు తప్ప పట్టణంలో మౌలిక సదుపాయాలు పట్టించుకున్న దాఖలాలులేవన్నారు. ఏళ్ల గడుస్తున్నా ఇళ్ళులేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. పేదలకు వైద్యసేవలందించే పీహెచ్‌సీ కనీస అభివృద్ధికి నోచుకోకపోగా ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మెయిన్‌రోడ్డు విస్తరణ జరగలేదన్నారు. పట్టణాన్ని తాండవ వరదల నుంచి రక్షించేందుకు నది ఇరువైపులా ప్రభుత్వం కడతానన్న రక్షణ గోడలు ఊసే లేదన్నారు. డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు కాలేదన్నారు. లేఅవుట్లలో కేటాయించిన పంచాయతీ స్థలాలు స్వాధీనం చేసుకోవాలని, పంచాయతీ పరిధి మించి నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించి పంచాయతీకి ఆదాయం వచ్చేలా చేయాలన్నా పట్టించుకున్నవారులేరన్నారు. దీనిపై తహసీల్దార్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ కళాశాల మంజూరైనా స్థల సమస్య కారణంగా ఏర్పాటుకావడంలేదన్నారు. కార్యక్రమంలో తెలిపిన సమస్యలు పరిష్కారానికి కృషిచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాళ్ళ సురేష్, మండల ప్రత్యేకాధికారి జి.వెంకటస్వామి, ఈఓపీఆర్డీ పి.వెంకటనారాయణ, ఎంఈఓ కేఎన్.గాంధీ, ధనిశెట్టి బాబూరావు, మజ్జూరి నారాయణరావు, సూరా సుబ్రహ్మణ్యం, వార్డు సభ్యులు చిట్టుమూరి రామారావు, అల్లు అప్పారావు, గీసాల పద్మ, దేవాది మంగాదేవి, కసింకోట సత్తిబాబు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిక్కాల శ్రీనివాసరావు, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వడలి శివప్రకాష్, బి.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.





మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు. హాజరైన పట్టణ ప్రజలు

ఎలమంచిలి నియోజకవర్గం

ఎలమంచిలి - అచ్యుతాపురం - మునగపాక - రాంబిల్లి

సాంకేతిక లోపంతో మూతపడిన రైల్వే గేటు

ఎలమంచిలి, జనవరి 5 : కొక్కిరాపల్లి రైల్వే గేటు శుక్రవారం సాంకేతిక లోపం వల్ల మూతపడడంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో పట్టణంలో నుంచి వచ్చే వాహనాలను పెదపల్లి రైల్వేగేటు మీదుగా దారిమళ్లించారు.అనకాపల్లి, విశాఖ నుంచి వచ్చే బస్సులు కూడా ఈ రోడ్డులో వెళ్లాయి.



సంక్షిప్త వార్తలు



చైర్‌పర్సన్ రమాకుమారి

మున్సిపాలిటీకి రూ. 5 కోట్లు మంజూరు

ఎలమంచిలి, జనవరి 5 : మున్సిపాలిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 5 కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారని చైర్‌పర్సన్ రమాకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె ఇక్కడి విలేఖరులతో మాట్లాడారు. నర్సీపట్నం మండలం ధర్మసాగరంలో జరిగిన జన్మభూమి సభలో ముఖ్యమంత్రి మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు పట్టణానికి మంజూరయ్యే 5 కోట్లతో పలు పనులు చేపడతామని చెప్పారు. అలాగే పట్టణంలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. గతంలో జరిగిన జన్మభూమి సభలతో పోల్చితే ఈసారి ప్రజల నుంచి వచ్చే ఆర్జీలు తగ్గాయన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

ధర్మ ప్రచార రథానికి ఘన స్వాగతం

ఎలమంచిలి, జనవరి 5 : పట్టణంలో శుక్రవారం హిందూధర్మ ప్రచార రథానికి భక్తులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమరసతా సేవాఫౌండేషన్ ఆధ్వర్యంలో ధర్మ ప్రచారం కోసం గ్రామాల్లో ఈ రథాన్ని తిప్పుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు రథం తులసీనగర్ రాగానే స్థానికులు పెద్ద ఎత్తున పూజలు జరిపారు. కార్యక్రమంలో ప్రచార రథం నిర్వాహకులు, సమరసతా సేవా ఫౌండేషన్ ప్రతినిధి గంగాధర్, పాల్గొన్నారు.

సామాజిక సేవ చేయండి

నెహ్రూచౌక్, జనవరి 5 : సామాజిక సేవలో రోటరీ క్లబ్ మరింత ముందుండేలా అందరూ కృషి చేయాలని క్లబ్ పాస్ట్ గవర్నర్ కె. ఛాయాదేవి కోరారు. న్యూకాలనీలో గల రోటరీ ఫంక్షన్ హాలులో ఏర్పాటైన క్లబ్ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. సభ్యులు వారి వారి వ్యాపారాలు, వృత్తులను నీతి నిజాయితీలతో నిర్వర్తిస్తూ పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం ఆమెను క్లబ్ సభ్యులు పి.రాజేశ్వర ప్రసాద్, వీవీ రత్నం సత్కరించారు.



క్రిష్ణాపురంలో ముగ్గులు పరిశీలిస్తున్న రమేష్‌బాబు



నాగులాపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు



తిమ్మరాజుపేటలో వినతిపత్రం ఇస్తున్న అప్పారావు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్యే రమేష్‌బాబు
- నియోజకవర్గం వ్యాప్తంగా జన్మభూమి సభలు

ఎలమంచిలి/మునగపాక, జనవరి 5 : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన ఎలమంచిలిలోని క్రిష్ణాపురంలో జరిగిన జన్మభూమి సభలో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత టీడీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జన్మభూమి సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మండల పరిషత్ ముఖ్య సలహాదారుడు కొలుకులూరి విజయ్‌బాబు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చిరంజీవి టీడీపీ పాలనను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సందీప్, తహసీల్దారు అప్పలరాజు, కొలగాని నాగేశ్వరరావు, ఈటీ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపాలిటీలోని స్టేషన్ రోడ్డు, కాకివానివీధి వార్డుల్లోనూ జన్మభూమి సభలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేగి సత్యనారాయణ, టీపీఓ గౌరు, డీఈఈ సురేష్, నాయకులు వెంకటేష్, చిరంజీవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో అందరూ పాల్గొనాలి

అభివృద్ధి కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలని ఎమ్మెల్యే రమేష్‌బాబు పిలుపునిచ్చారు. మునగపాకలోని నాగులాపల్లి గ్రామంలో జరిగిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాగులాపల్లి అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయడం అభినందనీయమన్నారు. గ్రామంలో కోటి రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు త్వర లోనే ప్రారంభమవుతాయన్నారు. గ్రామంలో ఆర్అండ్‌బీ స్థలంలో ఉన్న ఆక్రమణల తొలగింపునకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, సర్పంచ్ యల్లపు భాస్కరరావు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ దొడ్డి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు మళ్ల నాగ సన్యాసిరావు, దొడ్డి వరహా సత్యనారాయణ, గ్రామ శాఖ అధ్యక్షుడు మళ్ల వెంకటరావు, ఎంపీడీఓ శాంతలక్ష్మి, తహసీల్దార్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే...

అచ్యుతాపురం/రూరల్, జనవరి 5 : ప్రజా సమస్యల పరిష్కారానికే జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే రమేష్‌బాబు అన్నారు. దొప్పెర్లతో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామా ల్లోనూ మౌలిక సదుపాయాలు కల్పించడమే టీడీపీ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ఇళ్లు లేని వారికి స్థలాలతో పాటు ఇంటి నిర్మాణా నికి నిధులు కూడా మంజూరు చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు, జెడ్‌పీటీసీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ రాజాన రమేష్ కుమార్, మండల ప్రత్యేకాధికారి మిల్టన్, ఎంపీడీఓ బలరాముడు, తహసీల్దార్ రవికుమార్, చిన్నారావు, పి వెంకటరావు, వరహాలరావు,తదితరులు పాల్గొన్నారు.

మాటలే తప్ప చేతలు శూన్యం

తిమ్మరాజుపేట, హరిపాలెంలో కూడా జన్మభూమి సభలు జరిగాయి. ఈ సభలకు అధికారులు మాత్రమే హాజరయ్యారు. తిమ్మరాజుపేటలో జరిగిన సభలో సీపీఎం నాయకుడు కర్రి అప్పారావు అధికారులను నిలదీశారు. అధికారులతో పాటు అధికార పార్టీ నాయకులు చేసిన ప్రకటనలకు, పనులకు పొంతన ఉండడం లేదన్నారు. చంద్రన్న కానుకలకు గుజరాత్ నుంచి కిలో బెల్లం 50 రూపాయలకు కొనుగోలు చేశారని, అనకాపల్లి కిలో బెల్లం 20 రూపాయలకు ఇస్తామన్నా తీసుకోకపోవటం అన్యాయమని పేర్కొన్నారు. తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీకి చెందిన కార్మి కులు ఆరుగురు తమ గ్రామంలోఉన్నారని, ఫ్యాక్టరీ తెరవకపోవడంతో వారు మూడేళ్లుగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అలాగే జన్మభూమి కమిటీ సభ్యుల తీరుపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు.

పేదలకు న్యాయం

రాంబిలి, జవవరి 5 : టీడీపీ పాలనలో పేదలకు న్యాయం జరుగుతుందని ఎంపీపీ అనిత అన్నారు. పంచదార్ల, కొత్తూరులో జరిగిన సభల్లో ఆమె మాట్లాడారు. మూడున్నరేళ్ల టీడీపీ పాలనలో గ్రామాల్లో ఎనలేని అభివృద్ధితో పాటు సంక్షేమపథకాల అమలు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శంకరరావు, తహసీల్దార్ ఆదిమహేశ్వరావు, ఎంపీడీఓ నిర్మల, ఎలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ డి. రంగనాయకులు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు వి. దిన్‌బాబు, సర్పంచులు నానేపల్లి నాగమణి, ఎన్.కృష్ణ, పలు శాఖల అధికారులు, పాల్గొన్నారు.



పంచదార్లలో జరిగిన సభలో స్టాల్స్ పరిశీలిస్తున్న ఎంపీపీ అనిత



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాల్యాద్రి

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు

ఎలమంచిలి, జనవరి 5 : ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని గురుజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. మాల్యాద్రి అన్నారు. శుక్రవారం ఆ కళాశాలలో జన్మభూమి మా-ఊరు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు విద్యా వికాసం అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను జ్ఞానభూమిగా తీర్చే ప్రక్రియలో విద్యార్థులతో పాటు అధ్యాపకులు తమవంతు పాత్ర పోషించాలని కోరారు. అధ్యాపకుడు జగన్నాథం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మహనీయులను ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. అందుకు ఎంతగానో శ్రమించాలని చెప్పారు. ఉన్నత స్థానాలకు ఎదిగేటప్పుడు ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కోవాల్సి వస్తుందని, వాటన్నింటినీ అధిగమిస్తూ లక్ష్యసాధనకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో జన్మభూమి ప్రతిజ్ఞ చేయించారు. అలాగే స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, విజ్ఞాన ఆంధ్రప్రదేశ్ అన్న అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ వీకేటీ మహాలక్ష్మి. కె. పద్మ. బి. లక్ష్మి. పీడీ ఎండీవీడీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి నియోజకవర్గం

సీఎం పర్యటనతో భారీ బందోబస్తు

కశింకోట, జనవరి 5 : సీఎం చంద్రబాబునాయుడు నర్సీపట్నం పర్యటన నేపథ్యంలో తాళ్లపాలెం-నర్సీపట్నం రోడ్డులో భారీగా పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప, మంత్రులు ఈ రోడ్డు మీదుగా ప్రయాణం చేశారు. దీంతో భద్రత బలగాలు భారీగా మోహరించారు.



కల్వర్టు వద్ద బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు

సంక్షిప్తం



తగరంపూడిలో విద్యా వికాసం

అనకాపల్లి, జనవరి 5 : తగరంపూడిలో శుక్రవారం విద్యా వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మభూమి ప్రత్యేకాధికారి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. గ్రామ టీడీపీ నాయకుడు చెల్లయ్య, స్కూల్ కమిటీ ఛైర్మన్ అప్పలాచారి, హెచ్ఎం కృష్ణకుమారి, ఉపాధ్యాయిని బీవీపీ మహేశ్వరి, కరుణ, మంగవేణి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బుగతా గారి హాస్యవల్లరి రేపు

అనకాపల్లి, జనవరి 5 : పట్టణంలోని గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో ఆదివారం బుగతా గారి హాస్యవల్లరి ఏర్పాటు చేసినట్టు లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వినకోట బుచ్చిరాజు తెలిపారు. మైమ్‌షో కూడా ఉంటుందని వివరించారు. పెద్దసంఖ్యలో పట్టణవాసులు పాల్గొనాల్సిందిగా కోరారు.



స్వచ్ఛభారత్ అందరి బాధ్యత

అనకాపల్లి, జనవరి 5 : పట్టణంలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు శుక్రవారం జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎంఎల్ఎంవీ నారాయణరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవడంతో పాటు నిరక్షరాస్యులను చైతన్య వంతులను చేయాలన్నారు. స్వచ్ఛభారత్‌లో విద్యార్థులు కీలకం కావాలని పిలుపునిచ్చారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంత భారం.. మరీ ఘోరం!

- ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పార్కింగ్ ఫీజుల మోత
- రోజంతా ద్విచక్ర వాహనం ఉంచితే రూ.30
- సైకిల్‌కు రూ.10 చెల్లించక తప్పనిస్థితి
- లబోదిబోమంటున్న వాహనచోదకులు



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పార్కింగ్ స్టాండ్

అనకాపల్లి : ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వాహనాల పార్కింగ్ ఫీజుల మోత ప్రయాణికులకు భారంగా మారుతోంది. అనకాపల్లి, పరిసర ప్రాంతాల నుంచి సైకిళ్లు, ద్విచక్ర వాహనాలపై వచ్చిన వారు కాంప్లెక్సులోని పార్కింగ్ స్టాండ్‌లో ఉంచి రోజూ విశాఖకు వెళ్లి వస్తుంటారు. అలా పార్కింగ్ చేసిన వాహనానికి స్టాండ్‌లో పగటి పూటకు రూ.15 వసూలు చేస్తున్నారు. రాత్రి, పగలు కలిపి ఉంచితే రూ.30 చెల్లించాల్సి వస్తోంది. ఈ లెక్కన నెలకు రూ.450 నుంచి రూ.900 వరకు ఇందుకోసమే ఖర్చు చేయాల్సి రావడం కష్టంగా ఉంటోంది. ఇక సైకిల్ విషయానికొస్తే పగలు ఐదు రూపాయలు, రాత్రి కూడా ఉంచాల్సి వస్తే పది చెల్లించాలి. ఈ లెక్కన నెలకు రూ.150 నుంచి రూ.300 వరకు వెచ్చించాల్సి వస్తోంది.

చిరుద్యోగులకు మరీ కష్టం

అనకాపల్లి పట్టణ వాసుల కంటే సమీప గ్రామాలైన ఉమ్మలాడ, నాగులాపల్లి, ఒంపోలు, మునగపాక, తుమ్మపాల తదితర గ్రామాల నుంచి సైకిళ్లు, ద్విచక్ర వాహనాలపై ఇక్కడికి వచ్చి విశాఖలోని విధులకు వెళ్లి వస్తుంటారు. వీరంతా పార్కింగ్ పేరిట వసూలు చేస్తున్న మొత్తంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్లే నెల నెలా వచ్చే జీతం అంతంత మాత్రమే అయినప్పటికీ నిత్యం విశాఖ వెళ్లి వస్తున్నామని చెపుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంత మొత్తంలో పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తే ఇక ప్రయాణ చార్జీలు, జేబు ఖర్చులుపోను ఇంటికి ఏమిస్తాం? పిల్లల్ని ఎలా పోషిస్తామని వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు ఇలా నిత్యం రాకపోకలు సాగించేవారి వాహనాల పార్కింగ్ ఫీజు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఒకేసారి రూ.5 పెంపు సరికాదు



ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వాహనాల పార్కింగ్ ఫీజు ఒకేసారి రూ.5 పెంచడం అన్యాయం. జీఎస్టీ పేరుతో ఒక వాహనం నుంచి తీసుకునే పది రూపాయల ఫీజును రూ.15కు పెంచేశారు. దీనిని బట్టి ఒక వాహనం నుంచి ఐదు రూపాయలు తీసుకుంటే పది వాహనాల నుంచి 50 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నట్లే! ప్రభుత్వం జీఎస్టీ 18శాతం వేస్తే, 50 శాతం పెంచేస్తారా? ఇదెక్కడి న్యాయం. ఆర్టీసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి.

- కనిశెట్టి సురేష్‌బాబు, అనకాపల్లి

పార్కింగ్ ఫీజుకు జీఎస్టీ దెబ్బ

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వాహనాల పార్కింగ్ ఫీజు గతంలో కొంతవరకు అందుబాటులో ఉండేది. జీఎస్టీ రాకముందు ద్విచక్ర వాహనానికి రూ.10 తీసుకునేవారు. రాత్రి పగలు వాహనాన్ని ఉంచాల్సి వస్తే రూ.20 వసూలు చేసేవారు. ఇప్పుడు పగలు రూ.15, రాత్రి కూడా ఉంచితే మరో రూ.15 వసూలు చేస్తున్నారు. కేవలం జీఎస్టీ పేరుతో వాహనానికి రూ.5 నుంచి 10 వరకు పెంచేశారు. దీంతో వాహన చోదకులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు.

విద్యార్థి భవిష్యత్‌కు విద్య పునాది



పాఠశాలలో మాట్లాడుతున్న హరశ్రీనివాసరావు

తుమ్మపాల, జనవరి 5 : విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలని వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు పిళ్లా హరశ్రీనివాసరావు సూచించారు. ఇక్కడి జడ్పీహెచ్ స్కూల్‌లో శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. భవిష్యత్‌ను తీర్చిదిద్దేది విద్యేనని, ప్రతి ఒక్కరూ శ్రద్ధతో చదువుకోవాలన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో పదికి పది గ్రేడు పాయింట్లు సాధించే విద్యార్థులు ఒక్కొక్కరికీ రెండు వేలు చొప్పున నగదు బహుమతులు అందించనున్నట్టు ప్రకటించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులు 84 మందికి స్టడీ మెటీరియల్ అందజేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బుద్ద వెంకట రామఅప్పారావు, కార్యదర్శి యేరుబండి సత్యనారాయణ, కోశాధికారి కొసూరి బాబూరావు, విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ బొడ్డపాటి చినరాజారావు, గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం ద్వారా దివ్యాంగులకు రవాణా చార్జీలు

జిల్లా సహితవిద్య సంచాలకులు శ్రీదేవి



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న సంచాలకురాలు శ్రీదేవి

కశింకోట, జనవరి 5 : భవిత కేంద్రం ద్వారా దివ్యాంగులకు రవాణా, ఎస్కార్టు ఫీజులు చెల్లించడం జరుగుతుందని జిల్లా సహితవిద్య సంచాలకులు ఎన్.శ్రీదేవి తెలిపారు. కశింకోటలోని భవిత కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిత కేంద్రానికి వచ్చే దివ్యాంగులకు నెలకు రవాణా చొప్పున రూ.300, ఎస్కార్టుగా వచ్చిన వారికి నెలకు 250 వంతున సర్వశిక్షాభియాన్ నుంచి అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 19 మందికి రవాణా చార్జీలు, 32 మందికి ఎస్కార్టు ఫీజు చెల్లించారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులు వరలక్ష్మి, రమణమ్మ, కశింకోట డీపీఎన్ జడ్పీహైస్కూల్ హెచ్ఎం ఎ.శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వేడుకలు



తుమ్మపాలలో ముగ్గులు పోటీ

తుమ్మపాల, జనవరి 5 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వివిధ పోటీలను నిర్వహించారు. జన్మభూమిలో భాగంగా శుక్రవారం జరిగిన విద్యా వికాస్ డేను పురస్కరించుకుని తుమ్మపాల, మామిడిపాలెం జడ్పీహెచ్ స్కూళ్లలో ముగ్గుల పోటీలు, బవులవాడ, మాకవరం ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో 5కే రన్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మార్టూరు జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు నిర్వహించిన సైన్స్‌ఫేర్ గ్రామస్థులను ఆకట్టుకుంది. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



మార్టూరులో ఏర్పాటైన సైన్స్‌ఫెయిర్

నెహ్రూచౌక్ : గవరపాలెం హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరై అందమైన ముగ్గులు వేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. హెచ్ఎం కె.రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తూరు : ముత్రాసి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల ముగ్గులు వేశారు. విజేతలకు ఎంపీడీవో పి.వెంకట రమణ, ఎంఈవో దివాకర్‌లు బహుమతులు అందజేశారు. సర్పంచ్ మేడిశెట్టి రాధ, ఈవో ఆర్వీఎస్ రమేష్, హెచ్ఎం గోవింద్, ఉపాధ్యాయులు కొణతాల ఫణిభూషన్ శ్రీధర్ పాల్గొన్నారు.



ముత్రాసి కాలనీ పాఠశాలలో...

పౌష్టికాహారంతోనే చక్కని ఆరోగ్యం

పాడేరు, జనవరి 5: పౌష్టికాహారం తీసుకుంటే చక్కని ఆరోగ్యం సాధ్యమని ప్రకృతి, పౌష్టికాహార వైద్య నిపుణుడు డాక్టర్ ఏబీఎస్ కే.వరప్రసాద్ అన్నారు. శ్రీకృష్ణాపురం ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఎదిగే దశలో ఉన్న బాలికలు సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆహార నియమాల్లో చేస్తున్న తప్పులను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం...


సీలేరులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

మరుగుదొడ్ల ఆవశ్యకతపై విద్యార్థుల ర్యాలీ

సీలేరు, జనవ 5: మరుగుదొడ్ల ప్రాధాన్యాన్ని వివరిస్తూ సీలేరు పురవీధుల్లో విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రతీ గ్రామంలో బహిర్గత మలవిసర్జన లేకుండా వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకోవాలని, స్వచ్ఛ భారత్‌ను పాటించాలని, మొక్కలను పెంచాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటరమణకు ఘన నివాళి

జర్రెల (గూడెంకొత్తవీధి) జనవరి 5: ఏఎంసీ డైరెక్టర్, మాజీ సర్పంచ్ సాగిన వెంకటరమణకు జర్రెల గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. 2016లో వెంకటరమణ మావోయిస్టుల చేతిలో మరణించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన విగ్రహాన్ని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు జర్రెలలో గత ఏడాది ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు పెద్దబ్బాయి, చిరంజీవి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల విస్తృత ప్రచారం చేయండి

బీజేపీ నేత లోకుల్‌గాంధీ

చిట్టంపుట్టు: (జి.మాడుగుల) జనవరి 5: గిరిజన గ్రామాల అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రచారం విస్తృతం చేయాలని బీజేపీ గిరిజన మోర్చ ప్రతినిధి లోకుల్‌గాంధీ కోరారు. చిట్టంపుట్టు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి బీజేపీ కృషి చేస్తున్న విషయాన్ని తెలియజేయాలన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రధాని చేపట్టిన వివిధ పథకాలను వివరించాలన్నారు. ఈ సందర్భంగా వంద మంది కార్యకర్తలు బీజేపీలో చేరినట్టు అరకు పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కె.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కె.రాజారావు, ఎల్.అనిల్‌కుమార్, వి.సుబ్బారావు, ఎస్.రమణ, కె.మహేష్, ఎం.బాలకృష్ణ, వి.ప్రసాద్, కె.ప్రియాంక పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి సీఎం చంద్రబాబు కృషి

నడింపాలెం జన్మభూమి సభలో పాడేరు ఎమ్మెల్యే ఈశ్వరి



నడింపాలెం జన్మభూమి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరి... హాజరైన వివిధ గ్రామాల ప్రజలు

కొయ్యూరు: జనవరి 5: గిరిజనుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎనలేని కృషి చేస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. మండలంలోని నడింపాలెం, బట్టపణుకుల, శరభన్నపాలెం, వెలగలపాలెం పంచాయతీల్లో శుక్రవారం జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. నడింపాలెం సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే కోట్లాది రూపాయిల వ్యయంతో గ్రామ, గ్రామాన సీసీ రోడ్లు నిర్మిస్తున్నారన్నారు. నడింపాలెం పంచాయతీలో రూ.1.23 కోట్లతో సీసీ రోడ్లు, రూ.66 లక్షలతో తాగునీటి పథకాలు మంజూరు చేశారన్నారు. నియోజకవర్గంలో సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే, పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఏజెన్సీ వ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు ఇవ్వాలని ఇప్పటికే సీఎంను కోరామని, జనవరి నెలాఖరుకు పాడేరు పర్యటనకు విచ్చేసి పది వేల ఇళ్ల మంజూరుకు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కె.పార్వతమ్మ, ఎంపీపీ జి.సత్యనారాయణ, తహసీల్దార్ రమాదేవి, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

అగ్నిబాధిత కుటుంబానికి సాయం

కినపర్తి శివారు వలసంపేట గ్రామంలో గురువారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో గ్రామానికి చెందిన పనసల రామకృష్ణ పూరిల్లు దగ్ధమైంది. దీంతో సుమారు లక్ష రూపాయిల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. గృహోపకరణాలు తిండి గింజలతో పాటు రూ.30 వేలు నగదు, 15 తులాల వెండి పట్టీలు, తులం బంగారం అగ్నికి ఆహుతయ్యాయని బాధితుడు లబోదిబోమన్నాడు. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే ఈశ్వరి బాధితుడ్ని పరామర్శించి రూ.10 వేలు సాయం అందించారు. అలాగే పక్కా గృహం మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు.

జన్మభూమి-మా ఊరుతో గిరి గ్రామాల అభివృద్ధి

టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొర్రా నాగరాజు



జన్మభూమి సభలో మాట్లాడుతున్న బొర్రా నాగరాజు... హాజరైన ప్రజలు

దేవాపురం (పాడేరు రూరల్), జనవరి 5: జన్మభూమి-మా ఊరు కార్యక్రమంతోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొర్రా నాగరాజు అన్నారు. తహసీల్దార్ జె.దుర్గారవీంద్రనాథ్ బృందం శుక్రవారం ఉదయం దేవాపురం, మధ్యాహ్నం సలుగు పంచాయతీల్లో నిర్వహించిన జన్మ భూమి-మా ఊరు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మండల కేంద్రాలకు వచ్చి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా అధికారులే గ్రామాలకు వెళ్లి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన జన్మభూమిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన 110 పథకాల్లో చంద్రన్న బీమా గిరిజన ప్రాంత ప్రజలకు గొప్ప వరమన్నారు. తహసీల్దార్ దుర్గారవీంద్రనాథ్, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, ఏసీడీపీవో డి.శార్వాణి, విద్యుత్‌శాఖ ఏఈఈ ప్రభాకరరావు, కాఫీ సబ్ అసిస్టెంట్ అప్పలనాయుడు, ఏఈవో పార్వతి, ఏటీడబ్ల్యూవో ఎం.శ్రీనివాసరావు తదితరులు ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం దేవాపురం, సలుగు గ్రామ సభల్లో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన చంద్రన్న సంక్రాంతి కానుకలు, కొత్త రేషన్ కార్డులు, విద్యార్థులకు ఉపకార వేతనాలు, డ్వాక్రా మహిళలకు సహాయ నిధులను పంపిణీ చేశారు.

అలాగే ఎంపీడీవో మధుమోహన్‌కుమార్ బృందం కాడెలి, పాడేరులో జన్మభూమి నిర్వహించారు. మాజీ మంత్రి మణికుమారి, జడ్పీటీసీ సభ్యురాలు పోలుపర్తి నూకరత్నం ప్రభుత్వ పథకాలను వివరించారు. ముల్లుమెట్ట వీటీజీలకు తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించాలని వైసీపీ నేత సురేష్‌కుమార్ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.వెంకటరత్నం, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీదేవి, జడ్పీమాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, ఏఎంసీ డైరెక్టర్లు రొబ్బి రాము, బొడ్డేటి వరలక్ష్మి, బత్తుల లక్ష్మి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతు చేయాలని గిరిజనుల ఆందోళన

కక్కిలో జన్మభూమి బహిష్కరణ

పాడేరు రూరల్, జనవరి 5: మండలంలోని మారుమూల దేవాపురం, సలుగు, ఐనాడ పంచాయతీలకు ప్రధాన రహదారిని మరమ్మతు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సలుగు పంచాయతీ కక్కి గ్రామంలో గిరిజనులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు జన్మభూమి నోడల్ బృందాన్ని అడ్డగించారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొర్రా నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన కారులతో చర్చించారు. రహదారులు, తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సీఎం ప్రత్యేక దృష్టిని సారించి అవసరమైన నిధులను అందించేందుకు సిద్ధంగా ఉన్నారని, మూడు పంచాయతీల సమస్యలను ఎమ్మెల్యే ఈశ్వరి ద్వారా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనను విరమించారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి: ఎమ్మెల్యే

గూడెంకొత్తవీధి జనవరి 5: ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కోరారు. దామానాపల్లి పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ కుందరి రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం జన్మ భూమి-మా ఊరు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. టీవీఎస్‌సీ సభ్యురాలు మత్స్యరాస మణికుమారి మాట్లాడుతూ, గిరిజనుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అలాగే గాలికొండ పంచాయతీలో జరగాల్సిన జన్మభూమి కార్యక్రమం సప్పర్లలో జరిగింది. సర్పంచ్ లేకపోవడంతో ఎంపీడీవో రవిరత్నకుమార్ సభ నిర్వహించారు. కార్యక్రమాల్లో నాయకులు ఎంపీఎస్.ప్రసాద్, సాగిన బాలరాజు, గంటా నళిని, బలరామ్, ముక్కలి మహేష్ పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధికి ముఖ్యమంత్రి పెద్దపీట


చంద్రన్న కానుకలు అందిస్తున్న ప్రసాద్

కొత్తపాలెం (చింతపల్లి), జనవరి 5: ఆదివాసీల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేశారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంవీవీఎస్.ప్రసాద్ అన్నారు. కొత్తపాలెం పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ ఊర్మిళ అధ్యక్షతన శుక్రవారం జన్మ భూమి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పీటీజీలకు కేవలం 55 ఏళ్లకే పింఛన్ పంపిణీ చేసే కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. అలాగే రైతులకు రాయితీ యంత్రాలు, యువతకు ట్రాక్టర్ రుణాలు, చిన్నారులకు గిరిగోరుముద్దలు, కాఫీ సాగులో ప్రగతి కోసం ప్రత్యేక ప్రాజెక్టును ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతోందన్నారు. అర్హులందరికీ రేషన్, ఉపాధి కార్డులు, ఆర్‌వోఎఫ్ఆర్ సాగు హక్కు పత్రాలు, పక్కా గృహాలు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ఒక్క కొత్తపాలెం గ్రామ పంచాయతీలోనే 100 పక్కా గృహాలు, రూ.3 కోట్లతో కనెక్టివిటీ సీసీ రోడ్లు, రూ.75 లక్షలతో మంచినీటి పథకాలను నిర్మించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కవడం మచ్చమ్మ, ఎంపీటీసీ సభ్యులు బేరా సత్యనారాయణ పడాల్, లోచల సత్యనారాయణ, నాయకులు చల్లంగి లక్ష్మణరావు, బౌడు రామ్మూర్తి, కిముడు లక్ష్మయ్య, పెదిరెడ్ల బేతాళుడు, ఏటీడబ్ల్యూవో చంద్రశేఖరావు, ఎంఈవో ప్రసాద్, పీఆర్, టీడబ్ల్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ, ఎస్ఎంఐ జేఈలు జ్యోతిబాబు, సాగర్, రఘు, భరత్, శ్రీనివాసరావు, జీసీసీ మేనేజర్ మల్లేశ్వరరావు, హెచ్‌డబ్ల్యూవో వినాయకరావు, సీడీపీవో నీలవేణి, ఏవో నవీన్ జ్ఞానమణి, ఏపీఎం రాజశేఖరరావు, ఏపీవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వీరవల్లిలో నేటినుంచి ఎన్ఎస్ఎస్ శిబిరం

వీరవిల్లి అగ్రహారం, మాడుగుల రూరల్, జనవరి 5: మండలంలోని వీరవిల్లి అగ్రహారం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నుంచి 12 వరకు వడ్డాది ప్రభుత్వ డి గ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఇ.నరసింహమూర్తి తెలిపారు. ప్రతిరోజూ ఒక్కో సేవా కార్యక్రమాన్ని నిర్వ హిస్తామని పేర్కొన్నారు..



మాడుగుల రూరల్ : ఎల్.పొన్నవోలులో మాట్లాడుతున్న శైలజ


చీడికాడ : దండిసురవరం సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామానాయుడు

సమస్యల పరిష్కారానికే జన్మభూమి-మా ఊరు

మాడుగుల మండల ప్రత్యేకాధికారి శైలజ

మాడుగుల రూరల్, జనవరి 5 : ప్రజా సమస్యల పరిష్కారానికే జన్మభూమి-మావూరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి కె.శైలజ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్.పొన్నవోలు, జాలంపల్లి పంచాయతీల్లో ఏర్పాటు చేసిన సభల్లో ఆమె మాటాడుతూ ఆయా శాఖలకు సంబందించిన సమస్యలను ప్రజలు అధికారుల సమక్షంలో తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల మంజూరు, తాగునీరు సమస్యలను పరి ష్కరిస్తామని చెప్పారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. తహసీల్దార్ ఎల్.రామారావు, సర్పంచ్ ఏదిర ఈశ్వరరావు, యన్నంశెట్టి సత్తిబాబు, గండిప డాల శ్రీను, అధికారులు పాల్గొన్నారు.

అవురువాడ, కింతలి వల్లాపురం గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజ్ ఆధ్వర్యంలో జన్మభూమి సభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు గురించి వివరించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు దూది దేముడు, తాళ్లపు రెడ్డి భారతి, సోమన్నదొర, ఎంపీటీసీ సభ్యురాలు చింతలపాటి సునీత చక్రవర్తి, కార్యదర్శులు సీహెచ్ నాయుడు, శివ తదిత రులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంపీపీ

గవరపాలెం (కె.కోటపాడు), జనవరి 5 : జన్మభూమి-మావూరు కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీపీ సబ్బవరపు పుష్పవతి అన్నారు. శుక్రవారం మండలంలోని గవరపాలెం, కేజే పురం గ్రామాల్లో నిర్వహించిన సభల్లో ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ రేషన్‌కార్డులు, పింఛన్‌లు, ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. తహసీల్దార్ బీవీ .రాణి ఆధ్వర్యంలో సింగన్నదొరపాలెం, దాలివలస గ్రామాల్లో సభలు జరిగాయి. సర్పంచ్‌లు వెలగల సత్యవతి, రొంగలి అమ్మతల్లినాయుడులను ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో సీహెచ్.సుబ్బలక్ష్మి, ఈవోపీఆర్డీ ఎస్.అప్పారావు, సర్పంచ్‌లు యడ్ల లక్ష్మి, నెక్కెల పెంటయ్య, ఎంపీటీసీ సభ్యులు అల్లు నాయుడుబాబు, కోన రావాలమ్మ, పిల్లల జయ, టీడీపీ నాయకుడు యడ్ల తాతబాబు, పంచాయతీ కార్యదర్శులు ఎన్.రామునాయుడు, రమాదేవి, నళిని పాల్గొన్నారు.


దేవరాపల్లి : తెనుగుపూడి గ్రామసభలో మాట్లాడుతున్న రవిప్రకాష్

మూడు నెలల్లో మోడల్ గ్రామంగా దండిసురవరం : గవిరెడ్డి

దండిసురవరం (చీడికాడ), జనవరి 5: గ్రామస్థులు ముందుకొస్తే మూడు నెలల్లో దండి సురవరం గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతానని మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. మండ లంలోని దండిసురవరం, ఎ.అగ్రహారం, బి.సిం గవరం గ్రామాల్లో శుక్రవారం జరిగిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ దండిసురవరం అన్ని రంగాల్లోనూ అభివృద్ధికి దూరంగా ఉందని, గ్రామంలో త్వరలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నానన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అయ్యే ఖర్చుల్లో 50 శాతం వెచ్చించేందుకు గ్రామస్థులు ముందుకు వస్తే మిగిలిన 50 శాతం తన సొంత నిధుల నుంచి అందజేస్తామన్నారు. చీడికాడలో వచ్చే నెల 1 నుంచి టీడీపీ కార్యాలయంలో వైద్య సేవలందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం బాధిత కుటుంబాలకు చంద్రన్న బీమా అందజేశారు.

గ్రామ సర్పంచ్‌లు వేపాడ నాగేశ్వరరావు, మైచర్ల నానాజీ, శరగడం జయరామకృష్ణ, ఎంపీపీ కుచ్చు కళావతి, ఎంపీడీవో ఆర్ఎం.గ్లాడ్స్, తహసీల్దార్ పి.భాగ్యవతి, ఈవోపీఆర్డీ బి.చైతన్య, మాజీ ఎంపీపీ దారపు సత్యనారాయణ, కె.కోటపాడు టీడీపీ మండల అధ్యక్షుడు కొరుపోలు జయరాం, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు బొబ్బాది తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

తెనుగుపూడి (దేవరాపల్లి), జనవరి 5: ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలు అధికారులే పరిష్కరించాలని మాడుగులు నియోజకవర్గ జన్మభూమి పరిశీలకులు ఎ.రవి ప్రకాష్. అన్నారు. మండలంలోని తెనుగుపూడి లో శుక్రవారం జన్మభూమి గ్రామసభలో ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై అధికారులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. అనంతరం సామూహిక సీమంతాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

వాలాబు జన్మభూమి కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, జడ్పీటీసీ సభ్యురాలు గాలి వరలక్ష్మి, సర్పంచ్ పి.వరలక్ష్మి, మండల ప్ర త్యేక అధికారి జి.మహలక్ష్మి, ఎంపీడీవో డి.చం ద్రశేఖర్, తహసీల్దార్ వైఎస్ నాగరాజు, ఎంఈవో సీహెచ్.రవీంద్రబాబు, ఐసీడీఎస్ పీవో రొంగలి ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు అప్పలనాయుడు, సర్పంచ్ అప్పలనర్స, గుండా లమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాదృక్పథం అలవర్చుకోవాలి

సాగరం కాలనీ (మాడుగుల రూరల్), జనవరి 5 : విద్యార్థులు సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలని మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపా ల్ ఆర్.కుసుమకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని సాగరంకాలనీలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం.రాంకుమార్ ఆధ్వర్యంలో వారంరోజులు పాటు చేపట్టనున్న సేవా కార్యక్రమాలలో భాగంగా తొలిరోజు కార్య క్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. . ఆటలు మానసిక ఒత్తిడిని దూరం చేసి ప్రశాం తత చేకూరుస్తాయన్నారు. తదనంతరం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించారు.


మాడ్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కుసుమకుమారి

మంచాల మోడల్ స్కూల్‌లో ముగ్గుల పోటీలు

మంచాల (చీడికాడ), జనవరి 5: మండలంలోని మంచాల మోడల్ స్కూల్‌లో ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. సంక్రాంతి పండగను పుర స్కరించుకుని శుక్రవారం మధ్యాహ్నం పాఠశాల ఆవరణలో ఈ పోటీలను నిర్వహించారు. అధిక సంఖ్యలో బాలికలు ఈ పోటీల్లో పాల్గొని వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. వీరిలో 5 గురిని విజేతలుగా ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 8న బహుమతులందజేస్తామని ప్రిన్సిపాల్ తంతి హీరాలాల్ తెలిపారు. విద్యార్థుల్లో సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.


రంగవల్లులు తీర్చిదిద్దుతున్న బాలికలు

సంక్షిప్తం

10న మంత్రి అయ్యన్న పర్యటన

మాడుగుల జనవరి 5: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఈ నెల 10న మాడుగలలో పర్యటించనున్నారు. ఇక్కడ జన్మభూమి ముగింపు భలో ఆయన పాల్గొంటారని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు తెలిపారు. మాడుగుల మండల నాయకులతో కలిసి ఆయన మంత్రి అయ్యన్న పాత్రుడిని కలిసి ఆయనకు నూతన సంవత్సర, సంకాంత్రి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో ఇప్పటి వరకూ జరిగిన అభివృద్ధి పనుల గురించి మంత్రికి వివరించారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అలాగే ఈ నెల 10న జరగనున్న జన్మభూమి ముగింపు కార్యక్రమానికి రావాల్సిందిగా ఆయ నను ఆహ్వానించామని, అందుకు ఆయన సమ్మతించారని రామా నాయుడు తెలిపారు.

మూడు రోజులుగా కుళాయి నీరు బంద్

మాడుగుల, జనవరి 5: మూడు రోజులుగా కుళాయిల నుంచి చుక్క నీరు రాక స్థానిక మోదమాంబ కాలనీ ప్రజలు నానా అవస్థలూ పడుతున్నారు. దీంతో దగ్గరలో ఉన్న బోర్లకు వెళ్లి నీళ్ల తెచ్చుకుంటున్నారు. గంటల తరబడి కొడితే గానీ బిందెడు నీరు రావడం లేదని మహిళలు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుని నీటి సమస్యల పరిష్కరించాలని కోరుతున్నారు.

నేడు మూడు పంచాయతీల్లో సభలు

మాడుగుల, జనవరి 5: మండ లంలోని జేడీ పేట, చింతలూరు, వీరనారాయణం గ్రామాల్లో జన్మభూమి సభలు నిర్వహించనున్నామని ఎంపీడీవో ఎస్. డేవిడ్‌రాజ్ తెలిపారు. గడచిన నాలుగు రోజులుగా మండ లంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన సభల్లో అధికరంగా పింఛన్‌లు, ఎన్టీఆర్ గృహ నిర్మాణాల కోసం దరఖాస్తు లందాయన్నారు. అలాగే ఇతర సమ స్యలపై కూడా ఆయా గ్రామాల ప్రజలు విన్నవించారన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణం

మాడుగుల, జనవరి 5: స్థానిక మోదమాంబ కాలనీలో ఎంపీటీసీ సభ్యురాలు పాము లక్ష్మి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో పంచాయతీ నిధులతో ఈ కాలనీలో సీసీ రోడ్ల నిర్మా ణాలు చేపట్టి, పక్కనే మట్టి రోడ్లనువది లేశారు. దీంతో ఆ ప్రాంతాలు కొద్ధిపాటి వర్షం కురిసినా బురదమయంగా మారుతున్నాయి.

ఈ విషయమై ఆ ప్రాంతీయులు పలు మార్లు గ్రామ పంచాయతీ అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధు లకు ఫిర్యాదు చేశారు. కాలనీకి చెందిన వైసీపీ నాయకుడు ద్రాక్షారపు రామచంద్రరావు, ఎంపీటీసీ సభ్యురాలు పాము లక్ష్మి నిధులు లక్ష రూపాయలతో 35 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టి పనులు ప్రారంభించారు.

విద్య, వికాసంపై విద్యార్థులకు పోటీలు



లక్కవరం (చోడవరం రూరల్), జనవరి 5: జన్మభూమి-మా ఊరు, విద్యావికాసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని లక్కవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, పద్యపోటీలు నిర్వహించారు. హెచ్ఎం జీజే.సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు శతక పద్యాల పుస్తకాలను అందజేశారు.



కుసర్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పుస్తక ప్రదర్శన నిర్వహించిన దృశ్యం

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

కుసర్లపూడి (రోలుగుంట), జనవరి : జన్మభూమి-మావూరు కార్యక్రమం సందర్భంగా కుసర్లపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాల ఉపాధ్యాయులు ఈ సందర్భంగా విద్యార్థుల్లో విద్యావికాసం పెంపునకు విద్యాశాఖ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉదయం నుంచి సాయంత్రం వరకు దీన్ని తిలకించారు. ఇటువంటి ప్రదర్శనల వల్ల పుస్తక పఠనంపై విద్యార్థులకు ఆసక్తి పెరుగుతుందని ఎచ్ఎం సాంబశివరావు తెలిపారు. పాఠశాలలో చిన్న గ్రంథాలయం ఏర్పాటు చేశామన్నారు.

మహిళల్లో అక్షరాస్యత పెంపుతో విద్యాభివృద్ధి

సర్పంచ్ బత్తుల అరుణ

వడ్డాది(బుచ్చెయ్యపేట) జనవరి 5 : మహిళల్లో అక్షరాస్యత పెంపుతోనే విద్య వికాసం సాధ్యపడుతుందని సర్పంచ్ బత్తుల అరుణ అన్నారు. వడ్డాది కేపీడీ జడ్పీ హైస్కూల్‌లో జన్మభూమి-మావూరు కార్యక్రమంలో భాగంగా జరిగిన విద్య వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళలు శతశాతం అక్షరాస్యులు కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన బోధనోపకరణాలను ఆమె పరిశీలించారు. గణిత వృక్షం, గణితపువ్వు ఉపకరణాల నమూనాలను చూసి విద్యార్థులను ప్రశంసించారు. కస్తూర్బా విద్యార్థినులు దేశభక్తిగీతాలకు చేసిన నృత్యాలు అలరించాయి. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, హెచ్ఎం త్రినాథ్, కస్తూర్బ స్కూల్ ప్రత్యేకాధికారి దొండా చంద్రకళ, మాజీ ఎంపీపీ బత్తుల తాతయ్యబాబు, ఉపసర్పంచ్ సయ్యపురెడ్డి శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు దొండా గిరిబాబు, వీఆర్వోలు గణేష్, వెంకటరమణ, సీఆర్పీ కుమార్, వడ్డాది, బంగారుమెట్ట, ఎటీపీ.అగ్రహారం ప్రాథమిక పాఠశాలల హెచ్ఎలు పాల్గొన్నారు.



గణితపువ్వు ఉపకరణను సర్పంచ్‌కు వివరిస్తున్న విద్యార్థిని



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మరుగుదొడ్ల నిర్మాణంపై ర్యాలీ

రోలుగుంట, జనవరి 5: వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మానం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత అన్నారు.

శుక్రవారం రోలుగుంటలో కళాశాల విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం స్వచ్ఛభారత్‌లో భాగంగా స్వచ్ఛ విశాఖ, స్వచ్ఛ గ్రామం, స్వచ్ఛ వార్డుల సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆమెకోరారు. ఉపాధ్యాయులు సహదేముడు, గౌరి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సుబ్బలక్ష్మి తదితరులు

విద్యార్థులకు భగవద్గీత పోటీలు

లక్ష్మీపురం (చోడవరం రూరల్), జనవరి 5: ప్రముఖ సామాజికవేత్త, రచయిత కళాప్రపూర్ణ చర్ల గణపతి శాస్త్రి 109వ జయంతి సందర్భంగా మండలంలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు శుక్రవారం భగవద్గీత శ్లోకాల పఠన పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ శేషగిరిరావు ఆధ్వర్యంలో నిడదవోలుకు చెందిన ఆర్ష విజ్ఞాన పరిషత్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక అన్నమాచార్య సంగీతపీఠం డైరెక్టర్ ఎం.సుబ్బలక్ష్మి గణపతి శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు పండిట్ జి.రామయ్యరెడ్డి, ఉపాధ్యాయులు వంటాకు సన్నిబాబు, జ్యోతి, అరుణ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

మరుపాక (రావికమతం), జనవరి 5: పాడి రైతులకు గిట్టుబాటు ధరతోపాటు ప్రతీ పండగకి ప్రోత్సాహంగా నగదును అందిస్తూ ఆదుకొంటున్న ఘనత విశాఖ డెయిరీ ఛైర్మన్ దేనని మరుపాక పాలసంఘం అధ్యక్షుడు కుర్రు రాజు అన్నారు. మరుపాక పాల సంఘంలో 217మంది సభ్య రైతులకు సంక్రాంతి బోనస్‌గా రూ.1.37లక్షలు, దాణా బేసిన్‌లను శుక్రవారం ఆయన అందజేశారు.

సమయపాలనే విజయానికి సోపానం : మహర్షి సాగర్

గర్నికం (రావికమతం) జనవరి 5: నిరంతర శ్రమ సమయపాలన విజయానికి సోపానాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహర్షి సాగర్ అన్నారు. లక్ష్య సాధన, చేపట్టాల్సిన వ్యూహం అనే అంశంపై మండలంలోని గర్నికం కేజీవీబీ విద్యార్థినులకు శుక్రవారం ఆయన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థినులు కేవలం చదువుపైనే ధ్యాస ఉంచాలని సూచించారు. జయాపజయాలపై దృష్టిసారించకుండా ఏకాగ్రతతో పరీక్షలు రాయాలన, ఉత్తమ ఫలితాలతోపాటు ఒత్తిడిని కూడా అధిగమించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి కె.రాణి పాల్గొన్నారు.

వడ్డాది కేజీబీవీలో....

వడ్డాది(బుచ్చెయ్యపేట) : ఏకాగ్రతతో లక్ష్యాన్ని సాధించవచ్చునని వ్యక్తిత్వవికాస నిపుణుడు మహర్షి సాగర్ తెలిపారు. ఆయన శుక్రవారం వడ్డాది కస్తూర్బా విద్యాలయం విద్యార్థినులకు మానసిక వికాసంపై పలు సూచనలు చేశారు. సెల్‌ఫోన్, స్నేహితులు, సినిమాలు పక్కన పెడితే ఏకాగ్రతతో విద్యాభ్యాసాలు చేయవచ్చునన్నారు. మనలో ప్రతి భావన, చేసే ప్రతి పని కొంతకాలం గడిచాక సూక్ష్మరూపం పొంది బీజరూపంగా ఈ సూక్ష్మశరీరంలో సుషుప్తావస్థలో జీవించి ఉంటాయన్నారు. ఎంచుకున్న గమ్యం పట్ల పరిపూర్ణ విశ్వాసాన్ని కలిగి ఉంటే లక్ష్యం సాధ్యపడుతుందన్నారు. పాఠశాల ప్రత్యేకాధికారి దొండా చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రావికమతం : గర్నికం కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న మహర్షి సాగర్

సంచారజాతుల గుడారాలపై రాళ్లదాడి

భయాందోళనలు వ్యక్తం చేస్తున్న గుడారాలవాసులు

వడ్డాది, (బుచ్చెయ్యపేట) జనవరి 5 : వడ్డాది జూనియర్ కళాశాల ఆ వరణలో గుడారాలు వేసుకున్న నివాసం ఉంటున్న సంచార జాతి వారి గుడారాలపై మూడు రోజులుగా రాత్రుళ్లు రాళ్లదాడి జరుగుతుండంపై అందులో నివసిస్తున్నవారు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా నుంచి 50 మంది వచ్చి 10 రోజుల క్రితం కళాశాల ఖాళీ స్థలంలో గుడారాలు వేసుకుని జీవిస్తున్నారు. ఉదయం వేళల్లో బిచ్చమెత్తుకుని జీవిస్తున్నారు. బుధవారం రాత్రి సమయంలో గుడారాలపై రాళ్ల దాడి జరగడంతో గుడారాలకు సమీపంలోని మామిడి తోటల్లో గుడారాల నివాసులు గాలించారు. గురువారం రాత్రి కూడా రాళ్లు పడ్డాయి. విషయం తెలుసుకున్న స్థానికులు కూడా వీరికి సహాయంగా గాలింపులో పాల్గొన్నారు. అయినా రాళ్లదాడి చేసినవారి ఆచూకీ తెలియలేదు. శుక్రవారం రాత్రి కూడా రాళ్లదాడి జరగడంతో స్థానికులు, మహారాష్ట్రవాసులు సింథే రాము, శివాజీ, రాజు, సుతువే రజనీకాంత్ తదితరులు కర్రలు, టార్చ్‌లైట్లతో మామిడితోట, సమీపప్రాంతాల్లో గాలించారు. మాజీ ఎంపీపీ బత్తుల తాతయ్యబాబు అక్కడకు వెళ్లారు. అక్కడి వారితో మాట్లాడుతుండగా మళ్లీ రాళ్లు పడ్డాయి. ఎంత గాలించినా రాళ్లు వేసిన వాళ్లెవరో మాత్రం కనిపించలేదు.



రాళ్లు వేసిన వారి కోసం గాలిస్తున్న సంచారజాతుల వారు, స్థానికలు

సంక్షిప్తం



ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

యూనిఫారం పంపిణీ

రావికమతం, జనవరి 5: నాణ్యమైన విద్యతోపాటు పలు సంక్షేమ పథకాలు ప్రభుత్వ పాఠశాలలోనే అమలు చేస్తున్నారని హైస్కూల్ విద్యాకమిటీ ఛైర్మన్ వేపాడ శ్రీను అన్నారు. మండల కేంద్రం రావికమతం హైస్కూల్‌లో విద్యార్థులకు ఆయన శుక్రవారం యూనిఫారం అందజేశారు. ఎస్ఎంసీ సభ్యుడు గెంజి శ్రీను, హెచ్ఎం రామలక్ష్మి, ఉపాధ్యాయుడు బంటు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.



అర్జాపురంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మహాత్ముని జీవితంపై పోటీలు

అర్జాపురం(రావికమతం), జనవరి 5: జన్మభూమి కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండలంలో అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మహాత్మగాంధీ జీవితంపై పలు పోటీలు నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ పాత్రపై వ్యాసరచన, అహింస సిద్ధాంతంలో గాంధీజీ పాత్రపై వక్తృత్వ, సత్యాగ్రహంపై పాటలు, గాంధీ జీవిత చరిత్రపై లఘునాటిక, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలను జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తారు. అలాగే దొండపూడి హైస్కూల్‌విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జగన్నాధీశ్వరరావు, వెదురుపర్తి నాగేశ్వరరావు, సీఆర్పీ రామారావు తదితరులు తెలిపారు.

11 లోగా ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించాలి

చోడవరం టౌన్, జనవరి 5: ఈ ఏడాది ఏప్రిల్ 20 నుంచి ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా జరగబోయే 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజు ఈ నెల 11లోగా ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చని బీఆర్‌కే ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ఏవీఎస్‌వీఎస్.ప్రసాదరావు తెలిపారు. 2013, 2014, 2015, 2016 సంవత్సరాలలో చోడవరం బీఆర్‌కే కళాశాలలో అడ్మిషన్లు పొంది ఉత్తీర్ణులు కాని వారు లక్ష్మీపురం రోడ్డు, కోనాం గెస్ట్‌హౌస్ వెనుక ఉన్న కళాశాలలో సంప్రదించాలని, మరిన్ని వివరాల కోసం 8019512349 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఉపాధి హామీ జాబ్‌కార్డుల పంపిణీ

గొలుగొండ, జనవరి 5: చీడిగుమ్మలలో శుక్రవారం ఉపాధి హామీ జాబ్‌కార్డులను ఎంపీపీ సుర్ల లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి పూర్తి సమాచారం అందించేందుకు ప్రభుత్వం కార్డులు పంపిణీ చేపట్టిందన్నారు.



ఉపాధి కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

సంక్షిప్తం

ముఖ్యమంత్రికి వినతులు

నర్సీపట్నం టౌన్, జనవరి 5: జన్మభూమి సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తమ సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు శుక్రవారం ఇక్కడ వినతిపత్రాలు అందజేసారు. సీపీఎస్ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీజీ నాథ్, తదితరులు ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ల పోస్టులను రెగ్యులరైజ్ చేయాలని సంఘం అధ్యక్షుడు నంబారు సత్యారావు, తదితరులు ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. 2012లో కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించి కేవలం గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, తమను క్రమబద్ధీకరించి ఆదుకోవాలని వారు కోరారు. అలాగే ఐసీడీఎస్ లింకువర్కర్ల తొలగింపు జీవోను రద్దుచేయాలని కోరుతూ ముఖ్యమంత్రికి సీఐటీయూ తరుపున వినతిపత్రాన్ని అందజేశారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టులలో తొలగించిన లింకువర్కర్లను నియమించాలని కోరారు. ఇందులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాసరావు, లింకు వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్.సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు బస్సును ఏర్పాటుచేయాలి

నర్సీపట్నం రూరల్, జనవరి 5: తమకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ సూర్యపవన్‌కుమార్‌కు పాలిటెక్నిక్ విద్యార్థులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నర్సీపట్నంకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుందన్నారు. మార్గమధ్యంలో బస్సులు ఆపడం లేదన్నారు. అధికారులు స్పందించి ప్రత్యేకంగా బస్సును ఏర్పాటుచేయాలని కోరారు.

నేడు జన్మభూమి జరిగే గ్రామాలు

మాకవరపాలెం, జనవరి 5: మండలంలో శనివారం మూడు గ్రామాల్లో జన్మభూమి సభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఉదయశ్రీ తెలిపారు. శనివారం రాచపల్లి, వజ్రగడ, పాపయ్యపాలెం గ్రామాల్లో జన్మభూమి సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అన్ని శాఖల అధికారులు యథావిధిగా పాల్గొనాలని ఆమె సూచించారు.

సినిమా గైడ్

శ్రీకన్య - ఎంసీఏ

కన్య - ఇన్సిడెన్షియా

కన్యమినీ -అమెజాన్

సాయిశ్రీకన్య - ఒక్కక్షణం

రాజుమూవీమ్యాక్స్ - హలో

బంగార్రాజు - 2కంట్రీస్



ముఖ్యమంత్రి చంద్రబాబుతో అయ్యన్న కుటుంబ సభ్యులు



చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న సన్యాసిపాత్రుడు దంపతులు



రాజధానికి రూ.పది వేలు విరాళం ఇస్తున్న రైతు అనిమిరెడ్డి అప్పలనాయుడు



జన్మభూమి సైకత శిల్పాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



లబ్ధిదారులకు మంజూరుచేసిన ట్రాక్టర్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అయ్యన్నపాత్రుడు



సభాప్రాంగణంలో ఖాళీ లేక బయట నిల్చొన్న మహిళలు



ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్న చంద్రబాబు



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న సీఎం చంద్రబాబు

సీఎం సభలో పదనిసలు

నర్సీపట్నం అర్బన్/రూరల్, జనవరి 5:

- ధర్మసాగరం గ్రామ ముఖద్వారంలో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.
- గ్రామంలో కొంతదూరం ముఖ్యమంత్రి కాలినడకన వెళ్లి గ్రామాభివృద్ధిని పరిశీలించారు. గ్రామస్థులు, యువకులు భవనాలపై నుంచి ముఖ్యమంత్రిపై పూలవర్షం కురిపించారు. కొంతమంది ముఖ్యమంత్రితో ఫొటోలు తీయించుకోవడానికి పోటీపడ్డారు.
- సంక్రాంతి పొయ్యిని ముఖ్యమంత్రి స్వయంగా వెలిగించారు.
- విద్యా-వికాసం కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ ఏర్పాటుచేసిన పెదబొడ్డేపల్లి జడ్పీ ఉన్నతపాఠశాల పదో తరగతి విద్యార్థిని లావణ్య, బలిఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి అల్లు దుర్గాప్రసాద్, నర్సీపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కుమార్‌బాబు, బలిఘట్టం పాఠశాలకు చెందిన లగుడు లీలాప్రసాద్ వేసిన మహాత్మాగాంధీ, రైతు, హరిదాసు, మదర్‌థెరిస్సా, భరతమాత వేషధారణలను ముఖ్య మంత్రి అభినందించారు.
- క్రీడాపోటీలలో భాగంగా అధికారులు ఏర్పాటుచేసిన కబడ్డీ, వాలీబాల్, రింగ్‌టెన్నిస్, బాక్సింగ్ పోటీలను ముఖ్యమంత్రి చంద్రబాబు తిలకించారు.
- రచ్చబండ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో డ్వామా పీడీ కళ్యాణ్‌చక్రవర్తి, డీఎఫ్‌వో శేఖర్ బాబులను సీఎం సెక్యూరిటీ సిబ్బంది పక్కకు నెట్టయడంతో మంత్రి అయ్యన్న తనయుడు విజయ్ వారిని ముందుకు తీసుకు వెళ్లారు.
- రచ్చబండ నుంచి వెళ్తున్న సీఎంకు కోటనందూరు మండలం దొడ్డవరానికి చెందిన వికలాంగులు అడ్డాల నూకరాజు, ధర్మసాగరానికి చెందిన వికలాంగుడు పెట్ల నానిబాబులు పెన్షన్ మంజూరుచేయాలంటూ ముఖ్యమంత్రికి వినతిపత్రం అందించగా, వెంటనే మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు.



బాల్యవివాహాల నిరోధక పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. మంత్రి అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి, ఎంపీపీ సుకల రమణమ్మ